# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 18, సంచిక: 9, సెప్టెంబర్ 2025

వెల: రూ. 25/-



## 23వ పర్యాయంగా
## 7 కోట్ల జప సమర్పణ దృశ్యమాలికలు





## 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ దృశ్యమాలికలు













# శ్రీవేంకటేశం
**ఆధ్యాత్మిక మాసపత్రిక**

**సంపుటి:** 18 **సంచిక:** 9

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040-27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| శ్రీకరం.. శుభకరం నారాయణ మంత్రం | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| నవవిధ భక్తిమార్గాలు.. | 20 |
| తిరుప్పావై | 24 |
| పితరులకు ఆనంద దాయకం– మహాలయం | 31 |
| రామాయణ రత్నాకరం | 36 |
| ముకుందమాల | 40 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 44 |
| భక్తి ముక్తి దాయకం అనంత పద్మనాభ స్వామి వ్రతం | 50 |
| తిరుమల సర్వస్వం | 52 |
| దండకారణ్యం | 57 |
| మరణించి జీవించు | 58 |
| క్షమాగుణం | 60 |
| వామనావతారము | 62 |
| పౌండ్రిక వాసుదేవుడు | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# అంతఃకరణ శుద్ధి

భక్తుడు ఎల్లప్పుడూ భగవంతుని మెప్పే ప్రధానంగా జీవించాలి. ఇలా భగవంతుని మెప్పు పొందాలంటే భగవంతుడు ఇష్టపడే రీతిగా మన నడవడి మనో వాక్కాయ కర్మ రీతిగా ఉండాలి. లేశమాత్రమైనా కల్మష భావాలు మన దరికి రానీయకూడదు. భగవంతుడు సర్వాంతర్యామి కాబట్టి మన అంతరంగాన ఉన్న విషయం ఆయనకు తెలుస్తుంది. కాబట్టి ప్రతి వ్యక్తీ మనో వాక్కాయ కర్మణా శుచిగా ఉంటూ ఇతరులకు మేలు కలిగే విధంగా ప్రవర్తన కలిగి ఉండుట ముఖ్యం. ఇలా ఉంటే... కోరిక, పగ, ద్వేషం, భయం, అజ్ఞానం వంటి మాలిన్యాలు తొలగిపోతాయి. ఇలా ప్రశాంతమైన మనస్సుతో జ్ఞానం వైపు సాగడాన్ని అంతఃకరణ శుద్ధి అంటారు. ఆధ్యాత్మిక జీవితంలో దీనికి చాలా ప్రాధాన్యత ఉంది. ఈ అంతఃకరణ శుద్ధి ద్వారా మనిషికి నిజమైన ఆనందం, శాంతి, జ్ఞాన చింతన లభిస్తాయి. ఈ అంతఃకరణ శుద్ధి లభించాలంటే కొంత సాధన అవసరం. వృద్ధులకు సాయపడటం, పేదల ఆకలి తీర్చటం, సేవ చేయటం, అహంకారం తగ్గిస్తూ మనసులో దయ, జాలి, కరుణ వృద్ధి చెందుటకు ప్రయత్నం ద్వారా సాధించవచ్చును. ఇతరుల తప్పులను క్షమించడం, రాగద్వేషాలకు అతీతంగా ఉండుట అలవాటు చేసుకోవాలి. ఇతరుల వల్ల బాధ కలిగినప్పుడు వారిని క్షమించుట వలన మనలో ప్రతికూల భావాలు తొలగి సానుకూల దృక్పథం అలవడుతుంది. ఎల్లప్పుడూ సత్యాన్నే పలుకుట వలన ఆలోచనల్లో, మాటల్లో ప్రక్షాళన జరుగుతుంది. నిజాయితీగా జీవించుట అలవడుతుంది. చేష్టల ద్వారా, మాటల ద్వారా ఇతరులకు హాని కలిగించరాదు. ఇలా జీవిస్తే సకల జీవుల పట్ల దయాగుణం పెరుగుతుంది. ఉన్నంతలో తృప్తి చెందడం అలవాటు చేసుకోవాలి. అసూయకు తావివ్వకూడదు. అంతర్గతంగా భగవంతుని సదా ధ్యానించుట ద్వారా మనలోని లోపాలు దూరమవుతాయి. ముఖ్యంగా కోరికలు దుఃఖానికి హేతువులని గుర్తించి వాటిని అదుపులో పెట్టాలి. ఇలా అంతఃకరణ శుద్ధి ద్వారా నిస్వార్థంగా చేసే పనులు భగవంతునికి ఎంతో ఇష్టం, ఆయన మెప్పు పొందే సాధనాలు.

అంతఃకరణ శుద్ధి ద్వారా మనసులో కల్లోలం సృష్టించే ఆందోళనలు, ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా చక్కని ఆరోగ్యం లభిస్తుంది, మనస్సుకు ఆనందాన్ని కలిగిస్తుంది. అప్పుడే మనం మానసిక ఆనందాన్ని అనుభవించగలుగుతాము. జాలి, కరుణ, క్షమ వంటి దైవీ గుణాలు అలవరచుకొని భగవంతునికి మరింత దగ్గరవుటకు అవకాశం ఉంటుంది. ఇలా ఒకప్రక్క మన ప్రయత్నం కొనసాగిస్తూ, మరోప్రక్క భగవంతునికి శరణాగతి కోరుట మరువకూడదు. మనం కలియుగ మానవులం కావున మన స్వప్రయత్నం వలన కావలసిన స్థితికి చేరలేము. కాబట్టి మనలోని లోపాలను సరిదిద్ది సరియైన మార్గమందు పెట్టమని సదా ఆయన నామస్మరణ చేస్తూ జీవించాలి. ఇలా అంతఃకరణ శుద్ధి చేసుకుని లోకంలో ఇతరులకు మేలు చేస్తూ, తాను ఎల్లప్పుడూ భగవంతుని ధ్యానంలో సంచరించే మానవుడంటే శ్రీవేంకటేశ్వరునికి ఎంతో ప్రీతి. కాబట్టి ప్రతి మనిషి అంతఃకరణ శుద్ధితో సదా శ్రీవేంకటేశ్వరుని నామస్మరణ చేస్తూ, శరణాగతి భావంతో జీవించేవారి జన్మ ధన్యం. భగవంతుడు ప్రసాదించిన జన్మను సార్థకం చేసుకుని జీవిద్దాం! సదా శ్రీవేంకటేశ్వరుని దాసులుగా, భక్తిపూర్వకంగా, శరణాగత భావంతో జీవిద్దాం! స్వామి కృపను పొందుదాం!

నమో వేంకటేశాయ! గోవిందా! గోవిందా!


నమో వేంకటేశాయ
**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా|| కె.వి. రాఘవాచార్యులు



శ్లో ॥ సప్రేమ భీతి కమలా కరపల్లవాభ్యాం
సంవాహనేఽపి సపది క్లమ మాదధానౌ ।
కాంతా వవాఙ్మనస గోచర సౌకుమార్యౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥

తాత్పర్యం – వేంకటేశ్వరా! లక్ష్మీదేవి ప్రేమతో భయముతో నీ పాదములను ఒత్తవలెనని చిగుళ్ళవంటి తన చేతులతో తాకినంతనే నీ పాదములు కందిపోయినవి. సుందరమైనవి, వాక్కుకు మనస్సుకు అందని సౌకుమార్యము కలిగిన నీ పాదములను శరణు వేడుచున్నాను.

శ్లో ॥ లక్ష్మీ మహీ తదనురూప నిజానుభావ
నీళాది దివ్యమహిషీ కర పల్లవానామ్
ఆరుణ్య సంక్రమణతః కిల సాంద్రరాగౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥

తాత్పర్యం – వేంకటేశా! శ్రీదేవి, భూదేవి వారి వంటి నీళాదేవి మొదలగు నీ పట్టమహిషులు తమ చిగుళ్ళవంటి చేతులతో ఒత్తునపుడు, వారి చేతుల ఎఱ్ఱని కాంతులు ప్రసరించుటచే నీ పాదములు మిక్కిలి దట్టమైన ఎఱ్ఱని రంగును కల్గియున్నవి కాబోలు! అట్టి నీ పాదములను శరణు పొందుచున్నాను.


## చందా వివరాలు

(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు: ____________________

చిరునామా: ____________________

పిన్‌కోడ్: ____________________

చందా వివరాలు: ____________________



మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") ఉచితం



# ముక్తిమార్గము

భావానువాదం:

శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య


## శ్రీరాగం

ఎన్నిబాధలఁ బెట్టి – యేఁచెదవు నీవింక –
నెంతకాలముదాఁకఁ గర్మమా!
మన్నించు మనుచు నీ – మఱుగు చొచ్చితిమి మా –
మాటలాలకించవో కర్మమా! || పల్లవి ||

1. ప్రతిలేని దురితముల – పాలుసేయక నన్నుఁ –
బాలించవైతివో కర్మమా!
తతితోడ నాత్మ పరి – తాపంబు తోడుతను –
తగులేల సేసితో కర్మమా!
జితకాములకు గాని – చేతికిని లోనయి –
చిక్క వేకాలంబు కర్మమా!
మతిహీనులైనట్టి – మాకు నొక పరిపాటి –
మార్గంబు చూపవో కర్మమా! || ఎన్ని ||

2. ఆసలనియెడి తాళ్ళ – నంటఁగట్టుక విధికి –
నప్పగించితివి గదె కర్మమా!
వాసి విడిచితిమి నీ – వారమైతిమి మమ్ము –
నన్నె చెడనీకువో కర్మమా!
కాసుకునుఁ గొరగాని – గతిలేని పనికిఁగా -
కాలూఁద నీవేల కర్మమా!
ఓసరించొక మారు – వొయ్యనే ఒకరీతి -
నొల్లనవి తలఁగుమీ కర్మమా || ఎన్ని ||

3. తిరువేంకటాచలా-ధిపుని మాయలచేత –
దెసలఁదిరిగిన యట్టి కర్మమా!
హరిదాసులగు వారి – నాదరింతువుగాక –
అంత నొప్పింతువా కర్మమా!
వరుస నేనుగ మీఁద – వాని సున్నంబడుగ –
వచ్చునా నీకిట్లఁ గర్మమా!
పరమ పురుషోత్తముని – భ్రమతఁబడి నీవిట్ల –
బట్టబయలైతిగా కర్మమా! || ఎన్ని ||



భావము – ఓ కర్మమా! ఎంతో కాలము నుండి నీవు మమ్ము పీడించుచున్నావు. ఇట్లే ఇంకను ఎంతకాలము ఎన్ని బాధల పాలు గావించి నొప్పించెదవు? నీవు పెట్టు బాధలేమాత్రము భరించలేక మమ్ము రక్షింపమనుచు నేటికి మేము నీ చాటు చేరితిమి. మా మాట విని మమ్ము మన్నింపరాదా!

ఓ కర్మమా! నీవలన మేమనేక పాపముల పాలైతిమి. సాటిలేని ఈ పాపముల పాలొనర్పక మమ్ము రక్షింపవైతివి గదా! నీవలన మేమెప్పటికప్పుడు దురంతమైన మనో వేదనకు గురి యగుచున్నాము. ఇంత పరితాపకరమగు బంధమును మాకేల కల్గించితివి? నీవు కోర్కెలను తుదముట్టించిన విరక్తులకే లొంగుదువు. తదితరుల చేతికెప్పుడును చిక్కవు. మేము మతిలేని వారము. మా మీద దయ దలచి ఒక క్రమము తప్పని దారి చూపరాదా?

ఓ కర్మమా! ఆశాపాశములతో, మమ్ము బంధించి కర్మఫల ప్రదాయకమైన విధి కప్పగించితివి కదా! మేము మా పెద్దరికములను, పేరు పెంపులను వదులుకొంటిమి. పూర్తిగా నీ కధీనులమైతిమి. మాపై అనుగ్రహించి మా పెంపు చెడనీక కాపాడుము. కాసుకు కూడా పనికిరాని నిష్ప్రయోజనమైన పనికై ఇంచుకంత సేపైన కాలు నిలువనీయక మమ్మేల త్రిప్పెదవు? ఒకమారు ప్రక్కకొదిగి 'నేను మిమ్మెల్లను', అని తొలగవలసిన రీతిని తిన్నగా తొలగిపొమ్ము!

ఓ కర్మమా! నీవు శ్రీవేంకటేశ్వరుని మాయా ప్రభావముచే అడ్డమాకలేక సకల దిక్కులలో సంచరింతువు. హరికి దాసులైనవారిని మాత్రము ఆదరింతువు కాని తదితరులను నొప్పించినట్లు నొప్పించ జాలవు కదా! ఏనుగు పైనున్న వానిని సున్నమడుగుటకు వీలగునా? అట్లే భగవద్భక్తులను బాధించుటకు నీకు వీలుగాదు, మేము పరమ పురుషునిపై భక్తి కలిగి యున్నాము. కాన నీ గుట్టు మాకు బట్ట బయలైనది. నీవింక మమ్మేమియు చేయలేవు.

# శ్రీకరం... శుభకరం
# నారాయణ మంత్రం

– చింతలపాటి శివశంకర శాస్త్రి

**శ్లో ॥ “చతుర్భుజం చిదానందం మల్ల చాణూర మర్దనం
చరాచర గురుం దేవం తం వందే చక్రపాణినం
శ్రియః కరం శ్రియోనాథం శ్రీధరం శ్రీ వరప్రదం
శ్రీ వత్సల ధరం సౌమ్యం తం వందే శ్రీ సురేశ్వరం”**

‘‘భాద్రపద నక్షత్రోం కూడిన పున్నమి గల మాసము భాద్రపద మాసము’’ అని అందురు. ప్రజలందరికీ భద్రమును కలిగించు మాసము కనుక ఈ మాసమును భాద్రపద మాసమని అందురు. ఈ మాసంలో వినాయకచవితి, ఋషి పంచమి, వామన జయంతి, అనంత పద్మనాభ వ్రతము మొదలైన పండుగలు వస్తాయి.

అనంతుడు, అచ్యుతుడు, అప్రమేయుడు, జ్యేష్ఠుడు, సనాతనుడు, ఆశ్రిత భక్తజన వత్సలుడు, స్థితి – కారకుడు శ్రీమహావిష్ణువు. కుంఠము కానిది వైకుంఠము. కుంఠనము అంటే కలిసి ఉండే స్థితిని చెడగొట్టడము అని అర్థము. అంటే వియోగం కలిగించడం. ‘వికుంఠ’ అనగా వియోగాన్ని తొలగించడం. కలిసి ఉండవలసిన వారి సన్నివేశాలని, పదార్థాలని కలిపి ఉంచే పరమాత్మకు ‘‘వైకుంఠ’’ శబ్దము సార్థకమైంది. వైకుంఠుడంటే ‘‘సర్వేషాం – సంశ్లేషియితా’’ అని వ్యుత్పత్తి. మహాభారతం శాంతిపర్వంలో ‘‘మయా సంశ్లేషితా భూమిః అద్భిః వ్యోమః చ వాయు నా వాయుశ్చ తేజసా సార్థం వైకుంఠ దత్తం అంతతో మయాః’’ అని స్వామి స్వయంగా చెప్పాడు. ‘‘పంచభూతాల పంచీకరణాదులు చేసేది నేనే. అందుకే నన్ను వైకుంఠుడు అంటారు’’ అన్నాడు.

‘‘కశ్చిదశ్చిన్మంతరే వికుంఠాయాం మాతరి జాతత్యా ద్వైకుంఠః’’. వికుంఠ అనే తల్లికి కుమారునిగా అవతరించినందు వల్ల ఆ స్వామికి వైకుంఠుడు అని పేరు వచ్చినట్లు అమరకోశం వర్ణిస్తుంది. ఆ స్వామి నివాస స్థానం వైకుంఠం. ఆ వైకుంఠ వాసుడే శ్రీమన్నారాయణుడు. ఆ నారాయణుని మంత్రమే ‘‘ఓం నమో నారాయణాయ’’ ఎంతో శక్తివంతమైంది.

**“ధ్యాయన్ కృతే యజన్ యజ్ఞై స్త్రేతాయ్యాం ద్వాపరేఽర్చయన్
యదాప్నోతి తదాప్నోతి కలౌ సంకీర్త్య కేశవమ్”**

భగవన్నామ స్మరణం అంటే దేవీ దేవతలలో ఎవరినైనా భక్తి శ్రద్ధలతో స్మరించడం అని చెప్పవచ్చును. ‘‘సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి’’ అని చెప్పినట్లుగా ఏ దేవీ దేవతనైనా స్మరించవచ్చు. సేవించవచ్చు. భక్తి శ్రద్ధలే ముఖ్యనామం అనంతమైంది. అవ్యయమైనది. సులభసాధ్యమైనది. ‘‘భగవదనుగ్రహానికి పాత్రులయ్యేందుకు భగవంతునిలో ఐక్యమయ్యేందుకు పరమోత్కృష్ట సాధనం శరణాగతి. అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ’’. తమకు భగవంతుడు తప్ప, ఇతరమైన ఆధారమేదీ లేదని గ్రహించి, విశ్వసించి, అతడే దిక్కని, ఆతని పాదములను ఆశ్రయించి కొలవడమే శరణాగతి. శరణు జొచ్చిన వారిని కాపాడటం భగవంతుని స్వభావం.



భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు మనకు అందించే ఆధ్యాత్మిక నిధి మంత్రం. వ్యక్తి మానసిక దౌర్బల్యాన్ని మటు మాయం చేసి, అచంచలమైన ధైర్యాన్ని, దివ్యతేజస్సుని కలుగజేస్తాయి మంత్ర రాజములు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాల్ని విడిచిపెట్టి, నిత్యం మంత్రబీజాక్షరాలు జపిస్తూ ఎందరో మహర్షులు తపోనిధి సంపన్నులుగా మన దేశానికి, ఆధ్యాత్మిక సంప్రదాయానికి ఎనలేని కీర్తినార్జించి పెట్టారు. అంతేకాదు యోగసాధనను, పరమాత్మ సాన్నిధ్యాన్ని పొందడానికి చేయవలసిన కృషినీ, దానికి చేయవలసిన విధానాన్ని తరువాతి తరాలకు అందజేసి ఘనత వహించారు. మన మహర్షుల సంకల్పానికి కార్యరూపమే ఈ మంత్రరాజాలు. పరమార్థాన్నీ, జీవేశ్వర సంబంధాన్నీ బోధించే మంత్రరాజం అష్టాక్షరి. తిరుమంత్రమని, మూలమంత్రమనీ పిలువబడుతోంది. ఏకాంతమునగానీ, విష్ణు విగ్రహము ముందుగానీ, విష్ణ్వాలయంలో గానీ, నీళ్ళలో గానీ, నిశ్చలమైన మనస్సుతో శ్రీమహావిష్ణువును అష్టాక్షరీ మంత్రంతో జపించాలి. ఈ మంత్రానికి ఋషి నారాయణుడు, ఛందస్సు దేవి గాయత్రి. దేవత పరమాత్మ.

**"ఆర్తా విషణ్ణాః శిథిలాశ్చ భీతాః**
**ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః**
**సంకీర్త్య నారాయణ శబ్దమేకం**
**విముక్త దుఃఖాః సుఖినోభవంతు"**

పీడితులు, విషాదగ్రస్తులు, భయభీతులు భయానకమైన వ్యాధులచే పీడింపబడువారు ఒక్కసారి నారాయణ శబ్దమును సంకీర్తన చేసినంతనే దుఃఖములకు దూరమై సుఖమును పొందెదరు. ఎందువలననగా విష్ణుభగవానుని నామం మహత్తరమైంది. మోక్షప్రదాయిని అయిన శ్రీహరి నామం వీనులకింపైనది. నిరంతరం భగవన్నామ స్మరణ చేస్తుంటే, ఆయన కరుణా కటాక్షాలు మనపై ప్రసరిస్తాయనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. భగవన్నామమే పరమధర్మం. ఆయన నామమే పరమ తపస్సు. ఆయన నామమే లోకాలకు గతి. అందుకే మనం ఎన్నిసార్లు భగవంతుని నామాన్ని జపించినప్పటికిని అలుపు రాదు. ఆర్తీ తీరదు. అదొక తీరని దాహం.

''ఓం నమో నారాయణాయ'' అని ఎనిమిది బీజాక్షరాలతో కూడి యుండుట వలన దానికి ''అష్టాక్షరీ మంత్రం'' అను పేరు వచ్చింది. ఈ మంత్రాన్ని జపిస్తూ నిత్యం తపస్సు చేసి ఎందరో మునిపుంగవులు పరమాత్మ సాయుజ్యాన్ని పొందారు. ఈ మంత్ర స్వరూపాన్ని పరిశీలిస్తే నారాయణ స్వరూపం అవగతమవుతుంది. భగవంతుని క్రియాశీలత్వాన్ని విశ్వ స్వరూపాత్మకుడైన శ్రీహరి స్వరూపాన్ని ఈ మంత్రం ద్వారా తెలుసుకోవచ్చు.

ఈ మంత్రంలో ప్రథమాక్షరం 'ఓం'కారం'. అ–ఉ–మ = ఓం. ఇదే ప్రణవం. ''ఓంకారం'' త్రిమూర్త్యాత్మకం. అ – ఇడానాడి. ఉ – పింగళనాడి. మ – సుషుమ్నానాడి. ఈ నాడుల ద్వారా శ్వాసక్రియ జరిగి లౌకికంగా జీవనం సాగుతుంది. అలౌకికంగా యోగం నిలుస్తుంది.

**"ఓం స్మరణాత్ కీర్తనా ద్యాణి శ్రవణాశ్చ జపాదపి**
**బ్రహ్మంతత్త్వాప్యతే నిత్యయో మిత్యే తత్పరాయణః"**

ఓంకారం యొక్క స్మరణ, కీర్తన, శ్రవణ, జపాదుల వలన మానవుడు పరబ్రహ్మను పొందుతాడు.

''తస్య వాచకః ప్రణవః'' అంటూ పతంజలి ఓంకారాన్ని బ్రహ్మవాచకంగా సూత్రీకరించాడు. మూలాధారంలో పడుకుని ఉన్న మూడున్నర మాత్రల కుండలిని ఓంకారశక్తి. యోగసాధనతో వెనక్కు తిరిగి మూలాధారం నుంచి అనాహతం మీదుగా నుదుట నడిమినున్న ఆజ్ఞాచక్రానికి చేరుతుంది. అందువలననే మానవ జీవితంలో ఉపాసనకు మించిన మార్గం మరొకటి లేదు.

ఈ సృష్టి రచనకు పూర్వం అఖిల బ్రహ్మాండంలో ఒకే ఒక అపార నాదం ప్రతిధ్వనిస్తూ ఉండేదని, అది ఓంకార నాదమని మహర్షులు తెలిపారు. ఈ ఓంకారం నుంచే సప్త వ్యాహృతులు ఉత్పన్నమయ్యాయి. ప్రణవ జపం వల్ల ఐశ్వర్యం వృద్ధి అవుతుంది. అమరత్వాన్ని విష్ణులోక, కిన్నెరలోక, గంధర్వలోక, శివలోక, దేవలోక, ఇవీ అవీ – అనేకంటే సర్వలోక సంచారం కలుగుతుంది. సద్భావనలను, మంచి వ్యక్తిత్వాన్ని కలిగించే శక్తి ఏర్పడుతుంది. మనిషి లోపల అంతర్గత శక్తిని ప్రేరేపించే మంత్రం ఓం నమో నారాయణాయ. మానసిక వికారాలను, మనో వైకల్యాన్ని తొలగిస్తుంది. కర్తవ్య పాలనను బోధిస్తుంది. సిరిసంపదలు, సౌఖ్యం, మానసిక వికాసం, శారీరక ఆరోగ్యాలను ప్రసాదిస్తుంది.

**"ఓం నమో నారాయణాయేతి మంత్రోపాసకః**
**వైకుంఠ భువనలోకం గమిష్యతి"**

ఈ అష్టాక్షరీ మంత్రమును భక్తి శ్రద్ధలతో జపించిన వారు వైకుంఠమును చేరగలరు.

**"ఆపో నాం ఇతిప్రోక్తా ఆపోవై నరసూనవః**
**ఆయనంత స్యతాః పూర్వం తస్యోన్నారాయణః స్మృతః"**

నార+అయనము – నారాయణ. 'నారములు అనగా ఉదకములు'. 'అయనము అనగా స్థానముగా కలవాడని' బాహ్యార్థము. చరాచర స్వరూపముగా నుండు శరీరములని నర శబ్దార్థము. 'అయన' అనగా ఆశ్రయుడు, అంతర్యామి, నియామకుడు, సర్వాంతర్యామి అని అర్థము. అదీగాక నరులకు గమ్యస్థానమైనవాడు. మరియు ప్రళయాంతమున కూడా నశించిక సముద్రము నందు మర్రి ఆకుపై శయనించువాడని అర్థము కూడా నుడివెదరు. సకల జీవాలకు ప్రాణ స్వరూపుడు,

సర్వాంతర్యామి అయినవాడు నారాయణుడు. సర్వ శుభాల్ని ప్రసాదించే విమలాంతరంగుడే గాక, నవ్య స్వరూపంలో నవ్య మార్గాలలో వాత్సల్యాన్ని కురిపిస్తాడు.

మోహన రూపాత్మకుడైన విశ్వేశ్వరుడు విశ్వాన్ని తన స్వరూపంతో వహించి భక్తులను, యోగులను, ఋషులను – పుణ్య చరితులను తన దివ్యస్వరూప సాక్షాత్కారము చేత సమ్మోహపరచే స్వభావం కలవాడు. అందువల్ల శ్రీహరి శిష్టాచార పరాయణులైన సాత్విక సంపన్నులను సమర్థవంతంగా పోషించేవాడిగా కీర్తి వహించాడు. మోహాన్నీ, వ్యామోహాన్నీ విధ్వంసం చేసి, సత్య సందర్శనం గావించి, జ్ఞానజ్యోతి వెలిగించి, మోక్షాన్ని ప్రసాదించే కరుణా స్వరూపుడు, భక్త వత్సలుడు శ్రీమన్నారాయణుడు.

మోహము ఒక సాలెగూడు వంటిది. మోహపాశములో చిక్కుకున్న మానవుడు తన ధర్మమును, సత్కర్మను మరచిపోయి పురుషార్థ హీనుడవుతున్నాడు. కనుకనే గీతలో భగవంతుడు ''నష్ట మోహః స్మృతిర్లబ్ధః'' అని ఉపదేశించాడు. దేహము, దేహ సంబంధాలను త్రెంచివేసి ఒకే ఒక పరమపిత పరమాత్మ స్మృతిలో నిమగ్నుడవై కర్తవ్య పాలన చేయమని భగవంతుని మహావాక్యము.

భగవంతుని నామాన్ని ఉచ్చరించడం వల్ల మన జిహ్వాకు శుద్ధత ఏర్పడుతుంది. అనేక ఇతర విషయాల గురించి మాట్లాడినా – అటువంటి శుద్ధత ఏర్పడదు. దేవాలయాలలో ఈశ్వరుని దివ్య మంగళస్వరూపాన్ని సందర్శించినప్పుడే మన కళ్ళకు సార్థకత లభిస్తుంది. కానీ ఇతర దృశ్యాలను చూసినప్పుడు సార్థకత లభించదు. ఈశ్వరుని అర్చించడానికే మన కరములు ఉన్నాయి. అలా అర్చించని నాడు అవి కరములు కానే కావు. అదే విధంగా మన మనస్సు ఎల్లప్పుడూ భగవంతుని పాదపద్మాలనే ధ్యానిస్తూ ఉండాలి. పరమాత్ముని భక్తితో స్మరించడమే సర్వోత్తమ ధర్మమనే భీష్ముని మాట అక్షరసత్యం. పరమాత్మ పట్ల భక్తి లేకపోతే మన జీవితాలు నిష్ప్రయోజనాలే అవుతాయి. ''చక్రి చింతలేని జన్మంబు జన్మమే తరళ సలిల బుద్బుదంబు గాక''. దుర్లభమైన మానవజన్మ సార్థకము కావాలంటే భక్తిమార్గమే సరియైన మార్గము.

నారదుడు తన త్రిలోక సంచారము ద్వారా భగవన్నామాన్ని ప్రచారం గావించి త్రిలోకాలను తరింప చేశాడు. ప్రహ్లాదుడు తనకు ఎన్ని కష్టములెదురైనా చలించక త్రికరణ శుద్ధిగా హరిగాన మొనర్చి తరించాడు. విషయాలలో చిక్కి గుడ్డివారై సంసారమందు మమత కలిగినవారికి సర్వపాపాలను నశింపచేసే సాధనం హరినామమొక్కటే. అన్ని నామాలకన్నా హరినామ మొక్కటే అనంత ఫలప్రదమని అన్నమయ్య అభిప్రాయము. అన్ని పాపాలను హరించగలిగేది అనంత శయనుని నామజపమే అని అతని అచంచల విశ్వాసం. హరినామ మాహాత్మ్యము గురించి విధాత నారదునితో విష్ణు నామ సంకీర్తనం వల్ల సకల పాపాలు నశిస్తాయని ''నామ సంకీర్తనాద్విష్ణోః దహ్యంతే బహు పాతకాః''. సర్వవ్యాపి, అమిత తేజస్సు గల నారాయణుని కీర్తించడం, సూర్యుడు ఉదయించగానే చీకట్లు తొలగిపోయినట్లు హరినామాన్ని జపించగానే పాపాలు తొలగిపోతాయంటూ

**"కీర్తనా దేవ కృష్ణస్య విష్ణోరమిత తేజసః**
**దురితాని విరీయంతే తమాం సేవ వినోదయే"**

అని వివరిస్తూ ఎంత పెద్ద వెదురు పొదనైనా నిప్పురవ్వ బూడిద చేసినట్లు భగవన్నామము ఎంత పెద్ద ఘోర పాపాన్నైనా నశింప చేస్తుందని పలికాడు.

**"రా శబ్దో చ్చారణే వక్త్రాత్ పాపం విగచ్ఛతి**
**'మ' కార శ్రవణే జాతే భస్మ భావం గమిష్యతి"**

'రా' అనే శబ్దాన్నుచ్చరించడం వలన నోటి ద్వారా పాపం బయటకు వెడుతుంది. 'మ' కారాన్ని వినడం వలన బాహ్య వస్తువులపై నున్న మమకారం భస్మమైపోతుందని శాస్త్రోక్తి. 'ర' కారం అందరినీ రమింపచేసి పరమాత్మ తన పూర్ణామృత హృదయంతో తనను సేవించే వారిపై కరుణను కురిపించే ప్రసన్న వదనుడు, మ కారం మద మాత్సర్యాలను విధ్వంసం చేసే స్వభావం కలవాడని అర్థము. అన్నీ నావే అన్న భావంతో అన్నింటిపైనా మోహం పెంచుకుంటారు. అజ్ఞానాంధకారంతో కష్టాలను కొని తెచ్చుకుంటారు. అలాంటి వారి వ్యామోహాన్ని విధ్వంసం చేసి, సత్య సందర్శనం గావించి జన్మ పునరావృతం నుండి విమోచన గావించి మోక్షాన్ని ప్రసాదించే విశ్వరూపుడు శ్రీహరి.

**"శ్రీనివాసస్య దేవస్య స్మరణం సతతం తథా"**

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన ఆ దేవదేవుని నిరంతరం స్మరిస్తూ ఉండటమే ఆయన పట్ల భక్తియని వేంకటాచలం ద్వారా తెలుస్తోంది. విశ్వాసంతో, భక్తితో, ఆర్తితో, నిర్మల చిత్తంతో హృదయ పూర్వకంగా భగవన్నామ స్మరణ చేసి, భగవంతుని దివ్యానుగ్రహమును పొంది తరించెదమని, మన వచస్సును, మన మనస్సును కొత్త యశస్సుకు మోక్షమునకు మార్గం సుగమం చేయాలని ఆశిస్తూ ఆ దేవదేవుని సంకీర్తనామృతంలో ఓలలాడి తరిద్దాము, తరింపచేద్దాము.

**"నారాయణ – నారాయణ జయ గోవిందహరే**
**నారాయణ – నారాయణ జయ గోపాలహరే**
**కరుణా పారావార వరుణాలయ గంభీర నారాయణ**
**ఘన నీరద సంకాశ కృత కలి కల్మష నారాయణ**
**శ్రీద శ్రీన శ్రీనివాసః శ్రీనిధి శ్రీ విభావనః**
**శ్రీధర శ్రీకర శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః"**

**సర్వేజనాః సుఖినోభవంతు**



30వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం


## స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

— **గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

**దిశా నిర్దేశం :** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 30 వ భాగపు లీలల ప్రచురణ. (నవంబర్ 2014 నుండి జనవరి 2016 వరకు).



స్వామివారిని సంతోషపెట్టుటే లక్ష్యంగా ఎలాగైనా హరినామ క్షేత్రాన్ని స్థాపించాలని నిర్ణయించి, ఈ రకమైన కొన్ని క్షేత్రాలను సర్వే చేశాను. నేను చూచిన క్షేత్రాలు ఒక స్వామీజీ పర్యవేక్షణలో నిర్వహింపబడుచున్నవి, కాని నేను స్వామీజీని కాదు కదా! భక్తులపై ప్రభావాన్ని చూపలేను కదా అనే ఒక శంక ఏర్పడ్డది. మరియు ఈ క్షేత్రం నిరాటంకంగా జరగాలంటే కొన్ని గదుల నిర్మాణంతో పాటు దృఢ సంకల్పం కలిగిన భక్తులను తయారు చేయవలసి ఉంటుందని భావించాను. మరోప్రక్క మేము వ్యాపారము చేయరాదని, ఒకవేళ చేసినట్లైతే ఫలితం దక్కదని, దుఃఖిస్తారని రకరకాల లీలల ద్వారా స్వామివారు హెచ్చరించారు. ముఖ్యంగా తేది 23-11-2014 నాటి కల భయముచే నా డబ్బు దొంగిలించుకుపోతారని భావించి రోజంతా స్వామివారిని స్మరిస్తూ గడిపాను. చివరికి నేను, నా భార్య ఎలాంటి వ్యాపారము చేయకూడదని, పూర్తిగా స్వామిసేవ తప్ప మరో విషయంపై మనస్సు పెట్టదలచుకోలేదు. ఈ నిర్ణయంతో స్వామివారు ఎంతో సంతోషించారు. మరునాడు "ఓయీ! నీవు భక్తులను తయారు చేయ పనిలేదు, నేనే నా సమ్మోహన శక్తిచే వారిని ఆకర్షిస్తానని" ఒక దివ్య స్వప్నమును ప్రసాదించారు. వారి సమ్మోహన శక్తిని నాపై ప్రయోగించి చూపించారు. శరీరము పులకించి ఆనందంతో ఉక్కిరి బిక్కిరైనాను. ఆనందబాష్పాలు జలజలా రాలాయి. మీరు తప్ప నాకు మరేదీ వద్దు అనే భావన లోనికి వెళ్ళిపోయాను. మీకోసం ఏమైనా చేయగలననే దృఢ సంకల్పం కలిగింది. నాకు నా ప్రభువే ప్రాణం, జీవం, సర్వం అని అన్నాను.

### స్వామివారు తన సమ్మోహన శక్తిని ప్రయోగించుట


ఇది ఒక విశ్లేషణాత్మకమైన లీల. ఈ కల

కన్నప్పుడు కేవలం నన్ను తృప్తి పరచుటకే స్వామివారు ఈ లీలలను చూ పారనుకున్నాను. కాని 2020 సంవత్సరంలో స్వామి ఆజ్ఞతో అన్ని లీలలను చదివినప్పుడు దీని ఆంతర్యం తెలుసుకున్నాను. ఒకరకంగా రాబోవు హరినామ క్షేత్రం ఈ విధంగా ఉండునని సూచించాడు. ఈ క్షేత్రము మొదట మామూలు క్షేత్రము లాగానే ఉంటుంది. కాని తరువాత రోజులలో స్వామివారు తన సమ్మోహన శక్తిని ప్రసరింపచేసి భక్తులను వారి వారి పనులను వదలి స్వామి వద్దకు వచ్చేవిధంగా ఆకర్షిస్తారని సూచించారు. ఇది నా జీవితంలో మరో ఆణిముత్యం.

ఈ లోకంలో శ్రీవేంకటేశ్వరుని ఆలయాలు ఎన్నో ఉన్నప్పటికీ కేవలం తిరుమల స్వామివారికే ఇంత ఆకర్షణ ఎందుకున్నది? శాస్త్రరీత్యా ప్రతి ఆలయంలోని స్వామివారు ఒకే శక్తి కలిగి ఉన్నప్పుడు, అన్ని ఆలయాలలో ఈ ఆకర్షణ ఎందుకు లేదు? దీనికి జవాబు : అక్కడ స్వామివారు తన సమ్మోహన శక్తిని ప్రదర్శిస్తున్నారు. అందుకే మూడు రోజులు దర్శనానికి వేచి ఉన్నప్పటికీ, క్షణమాత్రపు దర్శనానికే భక్తులు తృప్తి చెందుచున్నారు. ఇలాంటి సమ్మోహన శక్తిని రాబోవు హరినామ క్షేత్రములో ఉపయోగించి భక్తులను తనవద్దకు రప్పించుకుందునన్నారు. ఇది ఒక అద్భుతమైన లీల.

ఈ లీలలో స్వామివారు నేను జన్మించిన, అప్పనపల్లి గ్రామములోని మా చిన్న మామ ఇల్లును వాడుకున్నారు. వారి ఇంటికి ముందు 'బనుకు' అని ఒక పెద్ద ఏడు ఎనిమిది అడుగుల వెడల్పు కలిగిన వరండా, ఇంటి ఈ చివర నుండి ఆ చివర వరకు ఉంటుంది, మరియు వీరి ఇల్లు గ్రామ ప్రధాన మార్గములో ఉంటుంది. ఆ లీల ఈ విధంగా ఉంది.

**తేది 24-11-2014 కల :** అది ఒక ఊరు. నేను ఆ ఊరివాడినేనట. ఒకనాడు పని నిమిత్తమై (బహుశా వ్యవసాయ పని) విశాలమైన ఆ ఊరి ప్రధాన మార్గం గుండా వెళ్ళుచున్నాను. ఆ సమయాన ఆ దారి వెంట నేను తప్ప మరెవ్వరూ లేరు. అది పండువెన్నెల కాయుచున్నది కావున మనస్సు అత్యంత ప్రశాంతంగా ఉన్నది. నేను నడుచుకుంటూ ఆ దారి వెంబడి వెళ్ళుచున్నాను. మధ్యలో ఎడమప్రక్క ఒకచోట వీధి వరుసలో ఒక ఎత్తైన అరుగు కనబడ్డది. ఈ అరుగు ఒక ఇంటిముందు ఉన్న ఏడు ఎనిమిది అడుగుల వెడల్పు గల వరండాలాగా కనబడ్డది. ఒక్కసారి ఈ వరండా, మరియు ఇల్లు, అప్పనపల్లిలో నేను జన్మించిన మా చిన్నమామ ఇల్లులాగ అనిపించింది. ఈ వరండాకు ఒక చివర దారి అయితే మరో చివర ఆ ఇంటివారు వారి ఇంటిలో కొంత భాగాన్ని చిన్న దేవుని మందిరం నిర్మించుకున్నారు. అంటే... దేవుని మందిరం ముందు ఈ వరండా ఉన్నదన్న మాట. ఈ దేవుని మందిరం చాలా చిన్నగా దాదాపు 3x3 సైజు కలిగి మూడడుగుల ఎత్తు మాత్రమే ఉన్నది,



స్వామివారు తన సమ్మోహన శక్తి ని ప్రయోగించుట



అప్పనపల్లిలోని మా అమ్మమ్మ ఇల్లు

దాని తలుపులు మూయబడినవి. అంటే... మా చిన్నమామ వారు వారింటిలో వరండా వైపు ముఖము చేసి చిన్నపాటి గదిని ఆలయ నిమిత్తమై నిర్మించినట్లు ఉన్నది. ఈ ఆలయము ముందు వరండా ఉంటుంది. భక్తులు ఈ వరండా పైకి వచ్చి స్వామివారిని అర్చించాల్సి ఉంటుంది. కాని ఈ సమయమున ఆలయ ద్వారాలు మూసి ఉన్నప్పటికీ, ఈ వరండా అరుగుపైన శ్రీమన్నారాయణుని ఒక రెండడుగుల విగ్రహము ఆ ఆలయము నుండి ఏడడుగులు ముందుకు వచ్చి రోడ్డువైపు ముఖము చేసి ఈ వరండా అంచున ఉంచబడ్డది. ఆ విగ్రహము పూలమాల మరియు తులసిమాలచే అలంకరించబడింది. అది ఒక పంచలోహ విగ్రహము మాదిరిగా ఉన్నది. కాని ముఖము మాత్రం నల్లగా కనిపించింది. పాదాలు మాత్రం ధగ ధగ లాడుచున్నట్లు లోహ కాంతి లాగా కనిపించింది. ఈ మూర్తి ఒక రకంగా అరుగుపై కూర్చుండి ఆ దారిన వచ్చిపోయే వారిని చూస్తున్నట్లు కనబడ్డది. ఆ దారిన వెళ్ళుచున్న నేను వీరిని చూచి, పరవశించి ఆగి రెండు చేతులతో నమస్కరించి, రెండు నిమిషాలు అలాగే ఉండి, తిరిగి నా పనికై వెళ్ళిపోయాను. నాకు ఈ విగ్రహం అత్యంత సుందరంగా కనిపించింది. కాని నేను మాత్రం ఒక నమస్కారం పెట్టి నా పనికై వెళ్ళిపోయాను. తిరిగి రెండవ రోజు కూడా ఇదే దారిలో వెళ్ళాను. ఈసారి స్వామివారు మహా అద్భుతంగా కనబడ్డారు. కాని మునుపటి లాగా పూలమాలలు, తులసిమాలలతో అలంకరించి లేరు. మునుపటి కంటే కొంచెం ఎత్తుగా బలిష్టమైన కండల సౌష్టవముతో కనిపించారు. ఒక

రకంగా తిరుమల శ్రీవేంకటేశ్వరుడు అభిషేకం తరువాత ఏ అలంకరణ లేకుండా ఉన్నట్లు, సుందర బాహునిగా కనిపించారు. స్వామివారు శంఖు చక్రాలను ధరించారు. వారి భుజము మరియు చేతి కండరములను స్పష్టంగా చూచాను. వారి ముఖంపై తిరునామం స్పష్టంగా కనబడ్డది. ఈసారి కూడా స్వామివారు ఆలయము నుండి బయటకు వచ్చి నాకోసం ఎదురు చూస్తున్నారనిపించింది. ఈసారి కూడా స్వామి ముఖం నల్లగా మరియు పాదాలు మాత్రం మెరుస్తున్నట్లు బంగారు రంగులో కనబడ్డవి. స్వామికి ఈ నలుపురంగు ముఖము నుండి మోకాలు క్రింది వరకు పూసినట్లు కనబడ్డది. అంటే స్వామివారు ముఖం నుండి మోకాలు క్రింది వరకు నల్లగా ఉన్నాడు. తరువాత పాదాల భాగము బంగారం మెరిసినట్లు మెరుస్తున్నాడు. స్వామివారు బహు గంభీరంగా ఉండి నన్ను మరింత ఆకర్షించారు. స్వామివారు వారి సమ్మోహన శక్తిని నాపై ప్రయోగించినట్లు వారిని చూడగానే ఆకర్షించబడి పరవశించిపోయాను. నాలో భక్తిభావం హృదయం నుండి పైకి ఉబికి వచ్చినదనిపించింది. ఆనందంతో ఉప్పొంగిపోయాను. చివరికి ఆనంద బాష్పాలను కలలోనే రాల్చుకున్నాను. ఒకరకంగా స్వామివారు నన్ను తనవద్దకు రప్పించుటకు తన సమ్మోహన శక్తిని నాపై ప్రయోగించారు. స్వామిని వదిలి ఉండలేకపోయాను. ఒక్క ఉదుటున స్వామి వారి వద్దకు పరుగెత్తి "స్వామీ నాకు మీరు తప్ప మరేదీ వద్దు" అంటూ స్వామివారు ఉన్న అరుగుపై ప్రణమిల్లాను, నా పనిని వదిలాను. స్వామివారి రూపము, వారి చూపులు నా హృదయములో ముద్రించుకున్నవి. ఎంతో ఆనందించాను. వారు నాకోసమే వచ్చారని తలంచి మరి మరి కృతజ్ఞతలను తెలుపుకున్నాను. నేను ఏ పని నిమిత్తమై వెళ్ళుచున్నానో ఆ పనిని పూర్తిగా మరచిపోయి స్వామి వద్దనే ఉన్నాను. కల చెదిరింది.

ఇది ఒక అత్యంత విశ్లేషణాత్మకమైన లీల. ఇందులో నేను జన్మించిన ఇల్లు కనబడ్డది. ఆలయం తలుపులు మూసి ఉన్నప్పటికీ స్వామివారు బయట ఉండి ఆ దారిన వచ్చిపోయే వారిని తన వద్దకు ఆకర్షించారు. ముందు మామూలు ఆకర్షణే కాని తరువాత తన సమ్మోహన శక్తిని ప్రయోగించారు. ఆ దారిలో పోయేవారిని వారి వారి పనులను మరచిపోయి తన వద్దనే ఉండునట్లు చేశారు. దీనర్థం : మా ఊరు, చిన్నగుండవెల్లిలో నిర్మించు హరినామ క్షేత్రము మొదట మామూలు క్షేత్రము లాగానే కనిపించవచ్చును. కాని కాలక్రమంగా స్వామివారు భక్తులను తనవైపు ఆకర్షించుదురని, కొంతమంది భక్తులు స్వామి చెంతనుండి కదలరని అర్థం. ఒక పర్యాయం ఈ హరినామ క్షేత్రం బద్రీనాథ్ క్షేత్రం లాగా దివ్యదేశమై వర్థిల్ల గలదని చెప్పారు. ఇప్పుడు తిరుమల స్వామిలాగా భక్తులపై తన సమ్మోహన శక్తిని ప్రయోగిస్తానని చెప్పారు. కావున ఈ హరినామ క్షేత్రం నూటికి నూరుపాళ్ళు విజయవంతమగునని అర్థం.

**ఒక వివరణ:** 2005 సంవత్సరంలో, హైదరాబాద్ లో స్వామివారు ప్రసాదించిన స్థలములో ఇల్లు కట్టుకున్నప్పుడు, స్వామివారిని మా ఇంటికి భోజనానికి ఆహ్వానించాను. అప్పుడు మా అమ్మమ్మ గ్రామములో నేను జన్మించిన ఇదే ఇంటిని వాడుకుని, "నీవు హరినామక్షేత్రం వద్ద నిర్మించు ఇంటికి వచ్చి భుజిస్తానని" స్వామివారు చెప్పారు. ఇప్పుడు కూడా ఇదే ఇంటిని వాడుకుని తన సమ్మోహన శక్తిని ప్రయోగించాడు. దీనర్థం : ఇది మా ఊరిలోని హరినామక్షేత్రం గురించే వచ్చింది. ఇందులో స్వామివారు భక్తులను తిరుమల లాగా ఆకర్షిస్తారని చెప్పారు.

ఈ కల తరువాత నాలో నేను ఇలా ఆలోచించుకున్నాను. స్వామివారి అఖండ నామస్మరణ చేయించాలని, దానికి తగిన స్థలము కొరకు వెతికాను. మరియు ఇలాంటి అఖండ నామస్మరణ చేయు సంస్థలను వారం రోజుల క్రింద తేది 18-11-2014 నాడు శ్రీమాన్ కసిరెడ్డి వెంకటరెడ్డి గారితో వెళ్ళి చూచాను. ఎలాగైనా ఈ అఖండ హరినామ క్షేత్రాన్ని సాధించాలనే భావనచే స్వామివారిని అనుగ్రహించమని గత కొన్ని రోజుల నుండి ప్రార్థిస్తూ, పదే పదే వేడుకున్నాను. దారి చూపమన్నాను. బహుశా దీనికి అనుబంధంగానే తేది 24-11-2014 నాటి కల సారమై ఉంటుందని భావించాను. స్వామివారు తన సమ్మోహన శక్తిని ప్రయోగించి నన్ను ఆకర్షించారు. నాలో అమితానందమును నింపారు. ఆనందబాష్పాలను స్రవించే విధంగా ఆనంద శిఖరాగ్రమును చేర్చారు. దీని ప్రతిఫలంగా నా లౌకిక వ్యవహారములను వదిలి స్వామి పాదాల చెంత చేరిపోయాను. దీని అర్థం ఏమిటంటే... ఇక నీకు ఈ లౌకిక వ్యవహారము ముగించే సమయమైనది. నన్ను చేరిపో అని అర్థం కావచ్చు అని భావించాను. చివరికి స్వామివారు చూపు దారి వెంట నడుచుటకు సిద్ధపడ్డాను.

## లడ్డూ ప్రసాదమును ఇచ్చి ఆరోగ్యాన్ని బాగు చేయుట

నాలో పై రకమైన భావాలను చూచిన వెంటనే స్వామివారు మరింత సంతోషించారు. గత కొన్ని సంవత్సరాల నుండి వెంటాడుతున్న నా ఆరోగ్య సమస్యలను తగ్గించ నిర్ణయించుకున్నారు. మరియు ఈ క్రింద తెలిపిన చక్కని లీలను చూపారు. చిత్రమేమిటంటే... ఈ లీలను చూపిన తరువాత సంతోషంతో పొంగిపోతూ... ఈ క్రింది విధంగా నా డైరీలో వ్రాసుకున్నాను. "ఈరోజు ఒక చక్కని, మనస్సు కుశలమైనటువంటి నా స్వామి అనుగ్రహాన్ని పొందానని ధైర్యంగా, గుర్తింపు పూర్వకంగా ప్రజలకు తెలుపగలిగిన ఒక అద్భుత ఘటన జరిగింది. నేను గత 15 సంవత్సరాల నుండి

డయాబెటిక్ తో బాధ పడుచున్నాను. చాలా రోజుల నుండి డయాబెటిక్ కావటం వలన న్యూరోపతికి గురైనాను. ఫలితంగా అరికాళ్ళలో మంటలు పుట్టాయి. గత 2 సంవత్సరాల నుండి మందులు వాడుతున్నప్పటికీ తగ్గలేదు. ఇవి కంట్రోల్ లో ఉండాలంటే, మొదట నా షుగర్ లెవల్స్ నార్మల్ గా ఉండాలి అనేది మొదటి మందు. ఆ తరువాతే ఇతర మందులు. ఇలా షుగర్ నార్మల్ గా ఉండాలంటే నేను ఎలాంటి తీపి పదార్థాలను తినకూడదు. కాబట్టి నేను, నాకు ఎంతో ఇష్టమైన స్వామివారి లడ్డూ ప్రసాదమునకు దూరముగా ఉండవలసిన అవసరమేర్పడ్డది. నేను పూర్తిగా ఒక లడ్డూను తింటే తప్ప తృప్తి కలగదు. అలాంటిది ఒక చిన్నముక్కతో సరిపెట్టుకొనుట బాధ కలిగేది. కాని ఏమీ చేయలేని స్థితి, స్వామి అనుగ్రహము, నా భాగ్యము ఇంతే అనుకుని ఊరుకున్నాను. ఇంతే కాకుండా గత మూడు సంవత్సరాల నుండి మోకాళ్ళ నొప్పులు మితిమీరినవి. వయస్సు మీద పడటం వలన, ఎముకలు అరిగినవని డాక్టర్లు అన్నారు. ఈ నొప్పుల వలన నేను రథయాత్ర, జప సమర్పణ పూజలలో కూర్చుండలేకపోయాను. ఇవి నా మనస్సును కదిలించి వేశాయి. స్వామి సేవకు దూరమవుతున్నానని, ఆయన ప్రసాదమును తినలేకపోవుచున్నానని బాధ కలిగింది. అందుకని గత కొన్ని నెలలుగా "నా ఆరోగ్యమును కాపాడుమని, వారి ప్రసాదమును తృప్తిగా తినే అవకాశమును ప్రసాదించుమని స్వామివారిని ప్రార్థించాను. అనారోగ్యం కారణంగా నేను మీ సేవకు దూరం కాకూడదని వేడుకున్నాను. మరియు అనారోగ్యంగా ఉంటే ఈ రోజుల్లో చేసేవారు ఎవరూ ఉండరు కావున చచ్చేవరకు కాళ్ళు చేతులు చక్కగా. ఆరోగ్యంగా ఉండాలని" కోరుకున్నాను. మరియు "ప్రభూ! నా వయస్సును పొడిగించవలసిన అవసరం లేదు, కాని నా జీవిత చరమాంకము వరకు ఏ నొప్పీ లేకుండా బ్రతుకుచు, మిమ్ములను స్మరిస్తూ, మీ సేవ చేసుకునే అవకాశమును ఇవ్వమని వేడుకున్నాను. మరియు స్వామీ! నేను ధనము, ధాన్యము కోరుట లేదు, సంఘములో పరపతి వద్దు, కాని ఆరోగ్యమును, మీ సేవను ప్రసాదించుమని పదే పదే దీనంగా వేడుకున్నాను". బహుశా దీని ఫలితంగానే ఈ క్రింది కల కన్నాను.

**తేది 04-12-2014 కల:** అది ఒక శ్రీవేంకటేశ్వరుని ఆలయ ప్రాంగణము. అక్కడ శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవము లాంటి ఉత్సవము తరువాత కళ్యాణము లాంటి ఒక పవిత్రమైన పండుగ జరుగుచున్నది. ఎత్తైన ఒక చతురస్రాకారపు వేదికపై శ్రీవేంకటేశ్వరుణ్ణి అధిష్ఠించి, అరటి ఆకులు, మామిడి తోరణాలు కట్టి, మంచి పూలదండలతో ఆ ప్రాంగణము అలంకరించబడ్డది. ఆ ఆలయంలో పండుగ కావున చాలామంది భక్తులు విచ్చేశారు. ఆ ప్రదేశమంతా తిరునాళ్ళను పోలి ఉంది. రకరకాల వ్యక్తులు



పూజారి లడ్డూ ప్రసాదం ఇచ్చుట

వారి వారి ఊళ్ళనుండి వచ్చి ఆ ప్రాంతమంతా తిరుగుచున్నారు. గుంపులు గుంపులుగా జనాలు కనబడ్డారు. దుకాణాలు కూడా ఉన్నవి. నేను ఆ ప్రాంతానికి వెళ్ళాను. ఒకసారి ఈ భక్తులను నలువైపులా చూచి, స్వామివారి కళ్యాణ వేదిక వెనుకవైపుకు వెళ్ళి ఒక సాధారణ భక్తుని వలె చూస్తున్నాను. నేను ఆ వేదిక వెనుక ఉన్నాను కనుక స్వామివారు కనబడలేదు. కాని పూజారి మాత్రం, స్వామివైపు తిరిగి పూజ చేస్తున్నాడు కాబట్టి, స్పష్టంగా కనపడ్డాడు. నల్లని ఆరడగులవాడు, పంచె ఉత్తరీయం ధరించాడు. శ్రీవైష్ణవుడు, శిఖ ముడుచుకున్నాడు. వైష్ణవుని మాదిరిగా తల వెంట్రుకలు ఉన్నవి. చక్కని ఊర్ధ్వ పుండ్రాలను ధరించి స్వామి ముందు నిలబడ్డాడు. పూజా కార్యక్రమములు అప్పటికే అయిపోవుట వలన ఊరికే నిలబడ్డాడు. ఇంతలో పూజారి ఒక్కసారిగా వంగి స్వామివారి ముందున్న ప్రసాదమును తీసుకుని ప్రక్కకు తిరిగి నాకు ఇచ్చాడు. ఒక దొప్పలో రెండు లడ్డూలు, మరియు ఇతరములైన మరొక పదార్థము ఉన్నది. నాకు కలలో ఈ ప్రసాదము స్పష్టంగా కనబడ్డది. దానిని చేతితో తీసుకుంటున్నప్పుడు స్వామివారు నాకు తన లడ్డూలను ఇచ్చారనే తృప్తి కలిగింది. నా షుగర్ వ్యాధి గుర్తుకొచ్చింది. కల చెదిరింది.

అంటే స్వామివారు నన్ను ఈ ప్రసాదమును తినమన్నారు. నా షుగరు ఏమీ చేయదన్నారు. లేదా నా అనారోగ్య సమస్యలు తీరిపోతాయని కూడా దీవించారని భావించాను.

తరువాత రోజులలో నా అనారోగ్య సమస్యలు చాలావరకు మెరుగయ్యాయి. మోకాళ్ళ నొప్పులు చాలా తగ్గినవి, నా రోజువారీ పనులకు ఎలాంటి బాధ కలగని స్థితికి వచ్చాను. ఇక షుగరు మరియు న్యూరోపతి మంటలు కూడా చాలావరకు భరించలేని స్థితి నుండి భరించగలిగే స్థితికి వచ్చాయి. ఆనందించాను.

## హరినామ క్షేత్రానికి శ్రీ ఆంజనేయుడు క్షేత్రపాలకుడని సూచించుట

గత కొంత కాలం నుండి స్వామివారు చెప్పిన వారి

''హరినా మ క్షేత్రము''ను ఏర్పాటు చేయాలనే కోరిక బలంగా కలి గింది. ఏవిధంగానైనా సాధించాలనే పట్టుదలతో ఉన్నాను. అయినప్పటికీ ఎందుకో తెలియదు కాని ఎంత ప్రయత్నించినా ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయాను.

మా గ్రీన్ కార్డు కాపాడుకొనుటకు మేము ప్రతి సంవత్సరం అమెరికా వెళ్ళాలి కాబట్టి 40 రోజుల కొరకని తేది 06-12-2014 నాడు అమెరికాకు, నా పెద్ద కొడుకు చి॥ వేదాంత్ వద్దకు వెళ్ళాము. అమెరికాలో ఉన్నప్పుడు స్వామి సేవకు దూరంగా ఉండుట వలన తపన ఎక్కువ వుంటుంది. ఇక్కడ స్వామివారు హరినామక్షేత్రం గురించిన మరో రెండు అత్యంత ముఖ్యమైన లీలలను ఈ విధంగా చూపెట్టారు.

ఈ కల అమెరికాకు వెళ్ళిన రెండవ రాత్రి వచ్చింది. అంతకుముందు నా ప్రభువు యొక్క అఖండ నామస్మరణ కొరకై ఒక భజన మండపమును నిర్మించాలనే ఆలోచనలో ఉన్నాను. నా మదిలో రాత్రింబవళ్ళు ఇదే ఆలోచన వచ్చేది. దీనికి అనుగుణంగానే ఆ రాత్రి కలలో ఈ దృశ్యమును చూపారు, నా ప్రభువు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు.

**తేది 08-12-2014 కల:** అది ఒక పెద్ద హాలు, దానికి ఒకప్రక్క భక్తులు ఉండుటకు నివాస గదులు రెండు మూడు అంతస్తులలో నిర్మించి ఉన్నవి. ఆ బంగళా ముందర విశాలమైన మైదానము ఉన్నది. ఆ స్థలము చుట్టూ చాలా ఎత్తైన ప్రహరీ గోడ ఉన్నది. ఈ ప్రహరీ గోడకు ఉన్న గేట్ ఆర్చి పైన శ్రీ ఆంజనేయుడు గదను భుజముపై ధరించి భీకరంగా కనిపించాడు. ఇది నాకు కనబడ్డ సరళి. దీనిని మరోరకంగా చెప్పాలంటే! ఒక పెద్ద ఎత్తైన ప్రహరీగోడ, దానికి ఒక గేటు, ఆ గేటుకు పైన ఆర్చికి శ్రీ ఆంజనేయుడు గదను భుజముపై ధరించి భీకరంగా ఉన్నాడు. లోన పెద్ద మైదానము, అందులో ఒక బంగళా ఉంది. ఆ బంగళాలో ఒక పెద్ద హాలు, ఆ హాలుకు ఒక ప్రక్క భక్తులు ఉండుటకు నివాస గదులు నిర్మించి ఉన్నవి. ఇంతే కల.




**హరినామ క్షేత్రానికి శ్రీ ఆంజనేయస్వామి వారిని క్షేత్ర పాలకుడిగా సూచించుట**

దీని అర్థం – శ్రీ ఆంజనేయుణ్ని ఆదర్శంగా, రక్షకుడిగా తీసుకుని, భక్తులుగా మారాలని, భక్తిని వృద్ధి చేసుకోవాలని, ఆంజనేయుని మాదిరి ఎల్లప్పుడూ స్వామివారిని స్మరిస్తూ, సంపూర్ణ శరణాగతులుగా ఉండమని స్వామివారి ఆజ్ఞ అని భావించాను. మరియు హరినామ క్షేత్రమునకు శ్రీ ఆంజనేయుడు క్షేత్రపాలకుడిగా ఉండాలని స్వామివారి అభిమతం.

## హరినామ క్షేత్రం ఏర్పాటు చేయమని మా తండ్రిచే చెప్పించుట

ఇక రెండవ లీల తేది 16-12-2014 రోజున ఉదయం 5 గంటల ప్రాంతమున వచ్చింది. ఇది ఒక అద్భుతం. శ్రీవేంకటేశ్వరుడు నన్ను తన దారిలోకి తెచ్చుకొనుటకు 1990 లో చనిపోయిన మా తండ్రి గారిని ఎన్నోసార్లు ఉపయోగించుకున్నాడు. ప్రతిసారి శ్రీవేంకటేశ్వరుని పట్ల నా మనస్సులోని భావాలకనుగుణంగా మా తండ్రి ప్రవర్తన ఉంటుండేది. కాని ఇప్పుడు మాత్రం మా తండ్రి నన్ను ఈ పని చేయమంటూ ప్రత్యేకంగా ఆదేశించాడు. తాను చెప్పిన ఈ పని చేస్తే... తాను నా తండ్రి యైనందులకు సంతోషించుదునని మరియు నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు కూడా సంతోషించునని చెప్పాడు. వెంటనే పూర్వం దశరథుని మాటలను శ్రీరాముడు ఏవిధంగా శిరసా వహించాడో... నీవు మీ తండ్రి మాటను పాటించాలనే ఒక హృదయాంతర భావం నాలో కలిగింది. ఇది ఒక అద్భుతమైన లీల. ఈ కల ఈవిధంగా ఉంది.


గత కొన్ని నెలలుగా స్వామివారి ''హరినామ క్షేత్రము'' స్థాపించుటకు ఆజ్ఞను ఇవ్వమని పదే పదే వేడుకున్నాను. దీనిని స్థాపించాలనే ఉద్దేశ్యం నాలో బలంగా ఉంది. కాని దీని గురించి ఆలోచిస్తూ... కాలం గడుపుతున్నానే తప్ప పట్టుపట్టి చేయలేదు. మరోప్రక్క జీవితంలో సమయం తగ్గుతున్నది, నా కోరిక మాత్రం ఉన్నచోటనే ఉన్నది. కావున స్వామివారిని మరీ మరీ ప్రార్థించాను. దీనికి సరియైన ఆజ్ఞను ఇవ్వమన్నాను. పైగా నేను మీకు సేవకుడనని, సేవకుడు ఎప్పుడైనా యజమాని మాటనే వినాలని, మీరు నా యజమానులని, నాకు కోరికుంటే సరిపోదు, దానికి మీ అనుమతి కావాలి కాబట్టి ఆజ్ఞను ఇవ్వమని నానా విధాలుగా ప్రార్థించాను. ఈ ప్రార్థన గత నెల రోజుల నుండి అంటే ఇండియాలో ఉన్నప్పుడు ప్రారంభించి నేటివరకు అలాగే కొనసాగుతున్నది. మరో విషయం. కొన్ని సంవత్సరాల క్రితం, నేను శ్రీవేంకటేశం మాసపత్రికను ప్రారంభించినప్పుడు, నాకు జ్ఞాన బోధ చేయుటకు, తగిన యోగ్యత సాధించుటకు అనువుగా వారు నన్ను ఇంజనీరింగ్ కళాశాలలో ఎం.టెక్ లో చేర్పించారు. బాగా చదివి ఉత్తీర్ణుడవు కమ్మని సూచించారన్న మాట. అప్పటినుండి ప్రతి సంవత్సరం, జప సమర్పణ మరియు

శ్రీవేంకటేశం మాస పత్రికను నడుపుచు ఆధ్యాత్మికంగా ఎదుగుటకు నా వంతు ప్రయత్నం చేశాను. లక్ష్యం ఎం.టెక్ లో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడనవ్వాలని. కాని చాలా విషయాలలో స్వామివారు చెప్పింది ఆచరించలేకపోయాను, నిజానికి నాకు సేవ పైననే మనస్సు ఉంది కాని స్వామివారిని పొందాలనే కోరిక నాలో ఏ కోశానా లేదు. అందుకే నేను సేవపైన మాత్రమే దృష్టి నిలిపాను, కాని స్వామి చెప్పినట్లు యోగ్యతపై దృష్టి నిలపలేదు. మొదట 'నా' అన్నది తీసివేయమన్నారు. దీనిలో నూటికి నూరుపాళ్ళు అసమర్థుడనైనాను. ఎంత ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. మాయచే కప్పబడి ఉన్న నేను, మామూలు మనిషి లాగానే జీవించాను. ఈ సందర్భంలో స్వామివారు హరినామ క్షేత్రం ఏర్పాటు చేయమని మా తండ్రి గారిచే ఆజ్ఞ ఇప్పించారు. ఒకటే కలలో రెండు సన్నివేశాలు ఈ విధంగా ఉన్నాయి.

**తేది 16-12-2014 కల :** నేను కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.టెక్ చదువుచున్నానట. ఈ కోర్సు ఫైనల్ పరీక్షలు రేపు ఉన్నవట, కానీ నేను ఏమీ చదవలేదు. అసలు కళాశాలకు సరిగా వెళ్ళలేదు, పాఠాలు నేర్వలేదు, ఏమీరాదు. తెల్లవారితే పరీక్ష అని తెలిసి భయపడ్డాను. ఏం చేయాలో తెలియదు. ఒకరకంగా చెప్పాలంటే ఎం.టెక్ లో ఓనమాలు కూడా తెలియని వాడిలా అయిపోయాను. ఒక్కరోజు చదివి పరీక్ష ఎలా వ్రాయాలి? ఏమి జరుగునో, ఎంత పనైంది? ఎందుకు చదవలేదు? అనుకుంటూ బాధపడ్డాను. కనీసం వచ్చే సెమిస్టర్ లోనైనా బాగా చదివి పాస్ కావాలనే ఉద్దేశంతో ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను ఆశ్రయించాను. కాని ఒకింత సిగ్గు పడ్డాను. ఒక సెంటర్ కు వెళ్ళి, వారి వద్ద కోచింగ్ తీసుకొనుటకు జాయిన్ అవుతానని చెప్పుటకు సిగ్గేసి, వారి వద్ద మాస్టర్ గా పని చేస్తానని, ఏదేదో చెప్పాను. తరువాత ఉన్న విషయం చెప్పాను. నేను ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో ఎంటెక్ విద్యార్థినని, సరిగా చదవలేదని, మీ వద్ద కోచింగ్ తీసుకుందామనుకుంటున్నానని, నాకు సహాయపడండని వేడుకున్నాను. దీనిని మొదట సిగ్గుచే సరిగా చెప్పలేకపోయాను. కాని అసలు విషయం ఇది అని వారితో అన్ని విషయాలు చెప్పి నాకు సహాయపడవలసిందిగా కోరాను. ఒకవేళ వీరు అంగీకరించనిచో ఇలాంటి వేరే సంస్థలలో చేరాలని దృఢభిప్రాయముతో ఉన్నాను. కాని చివరికి వీరు ఒప్పుకున్నారు.

తరువాత కలలో సీను మారింది. నేను ఒక మైదానంలో ఉన్నాను. ఏదో అలికిడికి అనుకోకుండా పైకి చూచాను. ఇంతలో స్వర్గం లేదా మరో లోకం నుండి మా తండ్రి కీ.శే పుల్లగూర్ల వెంకటరెడ్డి గారు క్రిందికి దిగుటను చూచాను. ఒక తేలికైన వస్తువు పైనుండి క్రిందికి జారిపడినట్లు ఆయన మెల్ల మెల్లగా క్రిందికి వస్తున్నారు. ఈయన ఒకసారి క్రిందికి జారాడు, రెండు సెకండ్లు ఆగాడు, మళ్ళీ జారాడు, మళ్ళీ ఆగాడు, ఇలా వస్తున్నాడు. తెల్లని పంచె, తెల్లని చొక్కా ధరించి ఆయన చనిపోవుటకంటె ఒక 20 సంవత్సరముల ముందటి రూపముతో క్రిందికి దిగుచున్నారు. ఒకరకంగా నేను ఆయనను స్పష్టంగా చూడాలనే ఉద్దేశంతో మెల్ల మెల్లగా క్రిందికి దిగుచున్నాడు. చివరికి నానుండి 25 అడుగుల దూరంలో, నేల నుండి ఒక 20 అడుగుల ఎత్తులో గాలిలో నిలబడ్డారు. నేను ఆయనను చూచి చాలా సంతోషించాను. నా స్వామి శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే, ఈయన స్వర్గం నుండి విడుదలై నన్ను చూచుటకు నా వద్దకు వచ్చాడని భావించాను. ఒకప్రక్క మా తండ్రిని చూచి సంతోషిస్తూ, మరోప్రక్క మా ప్రభు శ్రీవేంకటేశ్వరునికి కృతజ్ఞతలను తెలుపుతున్నాను. ఇలా చాలాసేపు మా తండ్రిని చూస్తూ నిలబడ్డాను. ఇంతలో ఒకరికొకరం చూచుటలోని నిశబ్దమును ఛేదిస్తూ మా తండ్రిగారిట్లన్నారు. ''నాయనా! నీవనుకున్నది త్వరగా మొదలుపెట్టుము. దీనివలన స్వామివారు మెచ్చుకుందురు'', మరియు ''నీవు నాకు కొడుకువైనందున నేను సంతోషించుదును'' అని చెప్పి మరి రెండు నిముషాలు అలాగే చూచి తిరిగి వెళ్ళిపోయారు. ఈ సంఘటన జరుగునప్పుడు నాకు శ్రీరామచంద్రునికి ఒకానొక సమయమున వారి తండ్రి దశరథుడు స్వర్గం నుండి వచ్చి ఉపదేశించిన విషయం కలలోనే గుర్తుకు వచ్చింది. మరియు ఎలాగయితే పూర్వం దశరథుని మాటను శ్రీరామచంద్రుడు శిరసా వహించాడో... నీవూ అలాగ శిరసా వహించాలనే హృదయాంతర భావం వెనువెంటనే కలిగింది. కల చెదిరింది.

ఈ విధంగా నాకు స్వామివారు మా తండ్రి ద్వారా హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయమనే ఆజ్ఞను ఇప్పించారు. మరియు ఈ లీల ద్వారా మరో నిగూఢ రహస్యమును తెలుసుకున్నాను. ఎంతవరకైతే నేను యోగ్యత సాధించి పరీక్షలో పాస్ కానో అంతవరకు హరినామ క్షేత్రమును స్థాపించుటకు అర్హత ఉండదని




**హరినామ క్షేత్రం ఏర్పాటు చేయమని పై లోకం నుండి వచ్చిన మా తండ్రి చెప్పట**

2020 సంవత్సరంలో ఈ లీల చదివినప్పుడు గ్రహించాను.

మరో విషయం. నాకు ఇంతటి మహత్తర జన్మను ప్రసాదించి, స్వామి సేవతో పాటు వారి ఎన్నో లీలలను చూచే భాగ్యమును పొందుచున్న ఈ జన్మకు కారకులైన మా తల్లితండ్రుల ఋణమును ఏవిధంగానైనా తీర్చుకోవాలని తలంచాను. 20 08 సంవత్సరంలో మా అమ్మ చనిపోవుటకు ఒకరోజు ముందు నా మూడవ వంతు పుణ్యమును సమర్పించుట ద్వారా స్వామివారు ఆమెకు వైకుంఠాన్ని ప్రసాదించారు. దీనితో మా అమ్మ ఋణం తీర్చుకున్నాను. కాని 1990లో చనిపోయిన మా తండ్రి ఋణమును తీర్చుకోలేదనే చింత నాలో ఉండేది. ఋణం తీర్చుకునే అవకాశమే లేదని బాధపడసాగాను. కాని ఈరోజు ఈ లీల ద్వారా నేను మా తండ్రి గారు చెప్పినట్లు నడుచుకుంటే... ఆయన సంతోషించుదునని అన్నాడు, మరియు ఆయనతో పాటు నా స్వామివారైన శ్రీవేంకటేశ్వరుడు కూడా సంతోషించునని చెప్పాడు. కాబట్టి దీనిని ఎలాగైనా సాధించి తీరాలనే భావము దృఢపడ్డది. కాని దీనిని ఎక్కడ స్థాపించాలో చెప్పలేదు కావున స్వామివారిని తీవ్రంగా ప్రార్థించసాగాను.

## సాధారణ జీవితానికి అలవాటు పడినట్లు సూచించుట

అమెరికాలో ఉన్నప్పుడు సురేఖకు కూడా స్వామివారు ఒక చక్కని లీలను ప్రసాదించారు. ఇది వ్యక్తిగత వ్యవహారముగా కనిపించినప్పటికీ, నేను ఆడంబరాలు లేని సాధారణ జీవితానికి అలవాటు పడ్డానని స్వామివారు సూచించారు.

ఈ సమయాన మా ఇద్దరు పుత్రులు అమెరికాలోనే ఉన్నారు. పెద్దవాడు చి॥ వేదాంత్ ఫోనిక్స్‌లో ఉంటూ ఏటీ & టీ లో ఉద్యోగము చేస్తున్నాడు. చిన్న వాడు చి॥ అరవింద్ రెడ్డి చికాగోలో ఎం.ఎస్ చదువుచున్నాడు. వీరు వారి వారి మిత్రులతో కలిసి నివసిస్తున్నారు.

**తేది 22-04-2015 కల :** ఈ కలలో మేము అనగా నేను నా భార్య సురేఖ కలిసి చికాగోలోని చిన్న కొడుకు చి॥ అరవింద్ రెడ్డి దగ్గరకు పోయామట. వాడి రూంలో వాడితో పాటు ఇంకో 5 మంది వాడి మిత్రులుంటున్నారు. అందులో ముగ్గురు కాలేజీకి పోయారట. అరవింద్ మరియు అతని మిత్రుడు ఇంటివద్ద ఉన్నారట. సురేఖ వంట వండుతున్నదట, ఆ మిత్రుడు మరియు అరవింద్ ఈమెకు సహాయం చేయాలా? అని మాటి మాటికీ అడుగుచున్నారట. కాని ఈమె నిరాకరించిందట. మధ్యలో మా పెద్ద కొడుకు చి॥ వేదాంత్ ఫోన్ చేసి మాట్లాడాడట. నీకు చిన్న కొడుకే ఇష్టం అందుకే అక్కడికి పోయావని నిష్ఠూరపు మాటలు అన్నాడట. చివరికి కాలేజీకి పోయినవారు రాగానే అందరూ కలిసి భోం చేశారట. చివరికి ఆ గదిలో మంచం లేదని, డాడీ ఎలా పడుకుంటాడో అని అరవింద్ తటపటాయించుచున్నాడట. ఇంతలో సురేఖ కల్పించుకొని, డాడీ తొందరగా పడుకుంటాడు ఆయనకు ఒక కంఫర్ట్ ఇవ్వండని చెప్పిందట. వారు అలాగే చేశారట. నేను పడుకున్నానట. పిల్లలు మంచి రుచికరమైన భోజనము చాలా రోజుల తరువాత దొరికిందంటూ తృప్తిగా తిన్నారట. పడుకున్న తరువాత సురేఖకు ఇదే కల మళ్ళీ తిరిగి వచ్చిందట. అంటే కలలో కల తిరిగి వచ్చిందన్నమాట. ఇంతే కల. ఈ కలతో సురేఖ చాలా సంతోషించింది. బహుశా ఆమెను తృప్తిపరచుటకే స్వామివారు దీనిని చూపారు అని మొదట భావించినప్పటికీ... నేను సాధారణ జీవితానికి అలవాటు పడినట్లు స్వామివారు సూచించారు. నిజానికి స్వామివారిని తృప్తి పరచాలని భావించి నా ఆహార విషయాలలో కాని, సౌకర్యాలలో కాని పట్టింపు లేకుండా జీవించాలని నా మూలంలో మార్పు జరగబోవుచున్నదని సూచించారు. ఇది భక్తుడికి ఉండవలసిన లక్షణము.

ఇండియాకు వచ్చిన తరువాత హరినామ క్షేత్రము గురించి తీవ్రంగా ఆలోచించాను. ఏవిధంగానైనా సాధించాలనే పట్టుదల నాలో బలంగా ఉంది కానీ ఎంత ప్రయత్నించినా ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయాను. హరినామ క్షేత్రం కొరకు తగిన స్థలము కావాలంటూ భక్తుల సహకారాన్ని కోరుతూ శ్రీవేంకటేశం మాసపత్రికలో మరియు దినపత్రికలలో ప్రకటన ఇచ్చాను. కాని సరైన స్పందన కనపడలేదు. ఇంతలో స్వామివారు క్రింది మరో లీలను చూపారు.

## హరినామ క్షేత్రం ఏర్పాటుకు స్వామివారి సహాయం తప్ప మరెవ్వరి సహాయం ఆశించరాదనుట

**తేది 31-05-2015 కల :** ఇది ఒక నూతనమైన కల. ఇందులో శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానంద స్వామివారు కనిపించారు. అది ఒక గవర్నమెంట్ హాస్పిటల్. అందులో ఎందరో రోగులు చేరి ఉన్నారు. అందరూ వారి వారి మంచములపై ఉన్నారు. కొందరు పడుకున్నారు, కొందరు కూర్చున్నారు. మరికొందరు పక్కవారితో ఏదో మాట్లాడుచున్నారు. ఇలా ఆ దవాఖానాలో చాలామంది ఉన్నారు. ఆ హాస్పిటల్ లో పెద్ద హాలు ఉంది. అందులో పక్క వార్డులకు పోవుటకు చక్కని దారులు వదులుచు మంచములు వేయబడి ఉన్నవి. వాటినిండా పేషెంట్స్ ఉన్నారు. ఒక మంచంపై ఈ స్వామీజీ కాషాయ వస్త్రములు ధరించి కనబడ్డారు. నేను ఎందుకో ఆ హాలులోని దారి గుండా పక్క వార్డుకు పోవుచున్నాను. నేను అంతకుముందే ఈ స్వామీజీని ఇక్కడ ఉండుటను చూచాను. అప్పుడు ప్రక్కన ఉన్న ఒక పేషెంట్ ఏదో చెప్పబోతుంటే... తోచక తడబడ్డాడు. ఈ స్వామీజీ ఆ మాటను అందుకుని ఒక చక్కని ఆధ్యాత్మిక అర్థం వచ్చే విధంగా ముగించారు. అది నన్ను ఎంతగానో సంతోషపరచింది. ఇప్పుడు నేను అతని పక్కన ఉన్న

దారి గుండా ప్రక్క వార్డుకు పోవుచున్నాను. ఒకరకంగా నేను ఆయనను మళ్ళీ మళ్ళీ చూడాలని, ఆయనను ఆకర్షించాలనే నెపంతో పక్కవార్డుకని ఆయన ప్రక్కనుండి వెళ్ళాను. బహుశా దీనిని కనిపెట్టిన స్వామీజీ నాకు కనబడకుండా నిండా కప్పుకుని మంచముపై ఇతర పేషెంట్ ల మాదిరిగా పడుకున్నాడు. నేను నిరాశ చెందాను. అక్కడ నిలవకుండా ముందుకు పోయాను. కల చెదిరింది.

నేను ఈ కల కన్నప్పుడు అర్థం చేసుకోలేదు. బహుశా దీని అర్థం – హరినామ క్షేత్రం ఏర్పాటుకు నీకు ఎవ్వరూ సహాయము చేయరు. అక్కడిక్కడ వెతుకుట వ్యర్థము. కేవలం యోగ్యత సాధించి, స్వామివారి కృపతో మాత్రమే ఇది సాధ్యమని సూచించారు. దీనికి అనుగుణంగా మరో సంఘటన నా జీవితంలో జరిగింది. స్వామి సేవకై తపిస్తే, తప్పక స్వామివారు సహాయము చేసి, దానిని నెరవేర్చునని ఈ క్రింది ఒక సంఘటన ద్వారా సూచించారు.

మేము ప్రతి తొలి ఏకాదశి మరియు వైకుంఠ ఏకాదశి పర్వదినమున భజగోవిందం నిర్వహించుట ఆనవాయితీ. వచ్చే తొలి ఏకాదశి తేది 27-07-2015 నాడు సాయంత్రం హబ్సీగూడ కాకతీయ నగర్ మా కాలనీ లోని వీధి నెం.4 లో గల ఒక గ్రౌండ్ లో నిర్వహించ తలచాము. దాని ప్రకారం తగిన ఏర్పాట్లు చేసుకున్నాము. కాలనీ సొసైటీ వారికి అందులో నిర్వహించుటకు తగిన అనుమతి నివ్వమని ఉత్తరము వ్రాశాను. అప్పుడు మా కాలనీ సొసైటీకి శ్రీమాన్ మురళి గారు ప్రెసిడెంట్ గా ఉన్నారు. సొసైటీ వారు రేపు మాపు అని చివరికి నిరాకరించారు. కాలనీలో ఉన్న ఆలయంలో చేసుకో, మీ ఇంటి దగ్గర చేసుకో, లేకుంటే మానుకొమ్మని మాట్లాడారు. చాలా నిరుత్సాహ పడ్డాను. ఏమి చేయాలో తోచలేదు. ఎన్నిసార్లు సొసైటీవారిని అడిగినా ఫలితం లేకపోయింది. ఇక చేయునది లేక, భగవంతునిపై భారం వేసి, ఆయన్నే స్మరిస్తూ ఈ పరిస్థితుల నుండి కాపాడి 'భజగోవిందం'ను అదే స్థలంలో ఏర్పాటు చేయుమని వేడుకుంటూ భారమైన హృదయంతో పడుకున్నాను. కానీ ఎలాగైనా అక్కడనే చేసి తీరాలనే పట్టుదలతో ఉన్నాను.

తేది 12-07-2015 కల : అది ఒక కాలనీ, అందులో మా ఇల్లు కూడా ఉన్నది. అప్పుడప్పుడే మా కాలనీ డెవలప్ అగుచున్నది. మట్టి రోడ్లే ఉన్నవి. డ్రైనేజీ లేదు. ఎవ్వరి ఇంటికి వారు సెప్టిక్ ట్యాంక్ కట్టుకున్నారు. కాలనీ ప్రెసిడెంట్ శ్రీ మురళీ గారే, వారి ఇల్లు మా ఇంటికి దగ్గరలోనే ఉన్నది. మా 'నమో వేంకటేశాయ' రథయాత్ర ఫంక్షన్ సమయం దగ్గరలోనే ఉన్నది. చాలామంది భక్తులు దీనికై ఇంటికి వస్తారు. కాబట్టి ఒక్కపూటకే మా సెప్టిక్ ట్యాంక్ నిండిపోతుంది. ఈ మధ్యనే ఒక మున్సిపల్ డ్రైనేజీ లైన్ కాలనీ నుండి వేశారట. కాని ఎవ్వరికీ ఇంకా కనెక్షన్ ఇవ్వలేదు. నేను ఈ ఫంక్షన్ ఉన్నదని ఒక్కరోజు కనెక్షన్ కోసం మురళిగారి ఇంటికి వెళ్ళాను. ఆయన ఒక పెద్ద గదిలో ఉన్నాడు (ఇది ఈయన నిజమైన ఇల్లు). విషయం వివరించాను. ఆయన డైరెక్టుగా ఒప్పుకోలేదు కాని ఇన్ డైరెక్టుగా ఒప్పుకున్నారు. ఆ తరువాత నేను ఆ మున్సిపల్ లైనుకు కలపటానికి సిద్ధం చేసుకుంటున్నాను. కల చెదిరింది.

తెల్లవారి నేను శ్రీ మురళి గారి ఇంటికి వెళ్ళి పర్మిషన్ గురించి అడిగాను. ఆయన ఇదేవిధంగా తిరకాసు పద్ధతిలో ఒప్పుకున్నారు. నేను సిద్ధం చేసుకొనుచున్నాను. దీనికి అనుబంధంగా మరో కల క్రింది విధంగా కన్నాను.

**తేది 21-07-2015 కల :** ఈ కలలో మా ఇంటిలో స్వామివారి ఫంక్షన్ ఒకటి జరుగుచున్నది. చాలామంది జనాలు వచ్చారు. ఇంటిపైన, చుట్టుప్రక్కల తిరుగుచున్నారు. అనుకున్న దానికెంటె కొంచెం తక్కువ వచ్చారని భావించాను. కాని స్థలం సరిపోక అక్కడక్కడ తిరిగారు. ముఖ్యంగా కాలనీ వాసులైన తెలిసిన స్త్రీలు చాలామంది వచ్చారు. ఇంతే కల.

దీనర్థం మా కాలనీ వారు వస్తారో, రారో అని అనుమానించాను నేను. చాలామంది వచ్చెదరని స్వామివారు సూచించారు.

అనుకున్నట్లే తేది 27-07-2015 నాడు భజగోవిందం ఎంతో అద్భుతంగా జరిగింది. చాలామంది జనాలు వచ్చారు. ఎంతో సంతోషించాను. ఈవిధంగా కేవలం శ్రీవేంకటేశ్వరుని శరణు వేడుతూ ప్రయత్నిస్తే... ప్రతి పని జరిగి తీరుతుంది, అనుమానించవలసిన పని లేదు అని నిరూపించారు.

**13వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణకై నమో వేంకటేశాయ రథయాత్ర :** తేది 11-08-2015 సాయంత్రం, మా ఇంటినుండి తిరుమల శ్రీవారికి 13వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణకై "నమో వేంకటేశాయ" రథయాత్ర ప్రారంభమైంది. ఇది శ్రీశ్రీశ్రీ అంగలకుదురు శ్రీ రామానుజ దాస స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. కార్యక్రమంలో ఎంతోమంది పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. వర్షం రావటం వలన కొంత ఇబ్బంది కలిగింది. ఈ రథయాత్ర తేది 11-08-2014 నుండి 28-08-2014 వరకు హైదరాబాదులో తిరిగి ఆ తరువాత మహబూబ్ నగర్, కర్నూలు, గుంతకల్, అనంతపురం, కదిరి, మదనపల్లిలో తిరిగి తేది 04-09-2015 న తిరుపతి చేరింది. యాత్ర చాలా సంతోషంగా జరిగింది, ఆనందమే ఆనందం.

## 13వ జప సమర్పణ

తేది 05-09-2015 సాయంత్రం తిరుపతిలోని అలిపిరి వద్ద నున్న స్వామివారి పాదాల మండపముపై ఇట్టి 13వ పర్యాయం 7 కోట్ల జపాన్ని స్వామివారి పాదాలకు సమర్పించుట

జరిగింది. స్వామివారి పాదాలను పాలు, పెరుగు, తేనె, చక్కెర, నీరు మొదలగు వాటితో అభిషేకించి ఆ నీరును తలపై చల్లుకుని ఆనందించాము. చివరికి ఈ జపము వ్రాసినవారి కోరికలను తీర్చుమని ప్రార్థించాము. ఈ మొత్తం కార్యక్రమం రాత్రి 10 గంటలకు ఎస్వీబీసీలో ప్రసారమైనది.

తేది 06-09-2015 గోకులాష్టమి నాడు ఈ జపానికి తిరుపతిలోని ఎస్వీ డైరీ ఫాంలో ఉన్న శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్తూపము వద్ద జప హోమాదులు నిర్వహించాము. ఈ.ఓ శ్రీమాన్ సాంబశివరావు గారితో పాటు ఛైర్మన్ శ్రీమాన్ చదలవాడ కృష్ణమూర్తి, మరికొంతమంది అధికారులు వచ్చారు. యజ్ఞ పూర్ణాహుతి కావించి జపమును స్తూపములో సమర్పించారు. ఆ తరువాత 14వ పర్యాయంగా 7 కోట్ల జపాన్ని ప్రారంభించారు. వీరు వెళ్ళాక భక్తులు తలా కొంత జపాన్ని స్వామివారికి సమర్పించారు. పాదాల మండపము పైన మరియు స్తూపము వద్ద స్వామివారిని ప్రతి సంవత్సరం లాగ దర్శించుకుని ఆనందించాము. ఆ తరువాత కొండకు వెళ్ళి స్వామివారిని దర్శించుకుని ఇంటికి వచ్చాము.

## 13వ జప సమర్పణ లోని అనుభూతులు

ఈసారి నాకు పెద్దగా అనుభూతులు కలగలేదు, ఒక రెండు చిన్న కలలు తప్ప. ఒకసారి రథయాత్ర జరుగుచున్నట్లు, రథములోని స్వామివారు కనబడ్డారు. మరోసారి ఏదో కనబడ్డది కాని నాకు జ్ఞాపకము లేదు. ఇక నా భార్యకు మాత్రము చుట్టుకుని ఉన్న ఒక పాము, తన తలను పైకి లేపి అటు ఇటు చూస్తున్నట్లు కనబడ్డదట. స్వామివారు ఈ మధ్యన చాలా తక్కువగా కనబడుచున్నారు. బహుశా మమ్ములను ఒక దారిలో పెట్టుటకు, గతంలో ఇన్ని అనుగ్రహాలను ప్రసాదించారని భావించాను. ఏది ఏమైనా ఆయన కృపచే వారి సేవా భాగ్యము లభించినందులకు ధన్యవాదాలు అర్పించాను.

## కర్మఫలం అనుభవించుట

మేము వ్యాపారము పూర్తిగా మానివేశాము. ఇక దైవ చింతనతో జీవిస్తూ కిరాయిలపై ఆధారపడి బతకాలనే ఆలోచనలతో ఉన్నాము. ఈ సమయాన నిజానికి నా వద్ద ఎలాంటి డబ్బు లేదు. కొంచెం ఇబ్బందిగానే ఉంది, వచ్చే కిరాయిలు కూడా అంతంత మాత్రమే. కాని సరిపెట్టుకుంటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఏదైనా అనుకోని ఖర్చు వస్తే మాత్రం ఇబ్బందిగా ఉంటుంది. ఎట్లా అని ఆలోచించాను. ఇంతలో స్వామివారు నా ఆలోచనను గ్రహించి నీవు అన్ని కోరికలను చంపుకోవాలని, చక్కగా నీతి నిజాయితీగా బ్రతకాలని, ఎలాంటి చెడు ఆలోచన మనస్సులో రాకూడదని సూచించే ఒక అద్భుతమైన లీలను ఈవిధంగా చూపెట్టారు. ఈ సమయాన మేము అమెరికాలో నా పెద్ద కొడుకు వద్ద ఉన్నాము. ఆ సమయాన ఈ కల అర్థం పైవిధంగానే అనుకున్నాము. కాని దీని నిజమైన అర్థం – కర్మఫలం అనుభవించుట.

**తేది 06-11-2015 కల :** అది ఒక అడవి. నేను ఆ అడవికి కాపలా వాణ్ణి. అంటే దాని మంచి చెడులు చూసుకునేవాణ్ణి. అది నిర్జనమైన ప్రదేశము, పరులు ఎవ్వరూ రారు, చూడరు. ఒక కట్టెల వ్యాపారము ఉన్నది. నన్ను ఎవరో ఒకరు సహకరించమని అడిగారు. అంటే వారు ఆ అడవిలోని కట్టెలను కొట్టుకుపోతారు. నేను వారికి అడ్డు చెప్పకుండా సహకరించినట్లైతే నాకు వారు కొంత మొత్తం ఇస్తామని అన్నారు. నేను లాభానికి ఆశపడి లొంగిపోయాను. సరే అని మనసులో అనుకున్నాను. ఇంతలో ఆ కట్టెల వ్యాపారులు అక్కడి చెట్లను కొట్టాలని అనుకున్నారు. అంతే... వెంటనే ఈ విషయం అతి సూక్ష్మ మార్గం ద్వారా పోలీసు వారికి తెలిసిపోయింది. పోలీసు వారు నన్ను అరెస్టు చేయుటకు వారంట్ ఇష్యూ చేశారు. అరెస్ట్ కి వారంట్ ఇష్యూ అయిన విషయం నాకు తెలిసింది. నేనేమి చేయలేదు, నన్నెందుకు అరెస్ట్ చేస్తారని అనుకున్నాను. అసలు ఇది నిజమేనా? అని ఎం.ఆర్.ఓ ఆఫీస్ లో నాకు తెలిసిన ఒక వ్యక్తికి ఫోన్ చేసి అడిగాను. ఎందుకంటే ఎం.ఆర్.ఓ వారి కంప్లైంట్ ఆధారంగానే పోలీసువారు స్పందించారు. ఆయన నిజమే గవర్నమెంటుకి తెలిసింది, శాటిలైట్ సిస్టమ్ అలా ఉంది జాగ్రత్తగా ఉండు అన్నాడు. నేను భయపడ్డాను. కేవలం మనస్సులో లోభి అయితేనే ఈవిధంగా అవుతుంది, ఇక నిజంగా అయితే ఎలా ఉంటుందో? అని చాలా భయపడ్డాను. కాళ్ళు చేతులు వణికాయి, హృదయ స్పందన పెరిగింది. కాబట్టి ఇప్పటినుండి మనస్సులో కూడా చెడ్డ ఆలోచన రాకూడదు, లోభి కాకూడదు, ఇది నా ప్రభు ఆజ్ఞ అని కలలోనే భావించాను. ఇంతే కల.

నన్ను సన్మార్గమున పెట్టుటకు శ్రీవేంకటేశ్వరుడు చేసిన ప్రయత్నమిదని భావించి కోటి కోటి ప్రణామాలర్పించాను.

కాని ఇది నేను నా కర్మఫలం అనుభవించడానికి మరియు యోగ్యత సాధించుటకు సృష్టించిన సాధనంగా జరిగిందని తరువాత తెలుసుకున్నాను. భగవంతుని సాధనలో మనిషి తన కర్మఫలాన్ని కూడా అనుభవించవలసి ఉంటుంది. దానిని వివరిస్తున్నాను.

హైదరాబాద్ లోని కొండాపూర్ రాఘవేంద్ర నగర్ కాలనీలో నాకు 311 గజాల ప్లాట్ ఉన్నది. దీనిని 2006 సంవత్సరంలో కొన్నాము. ఇది 40X70 డైమెన్షన్ కలిగి ఉంటుంది. మా ప్రక్కవారిది కూడా ఇంతే సైజ్, ఇంతే విస్తీర్ణం. కాని వారు ప్లాన్ తప్పుగా అంటే 45X62'-6" గీసుకుని నా భూమి 5 అడుగులు ఆక్రమించి కాంపౌండ్ వాల్ కట్టుకున్నారు, మిగిలింది

వదిలేశారు. వారికి సరిపడా ఉన్నప్పటికీ ఇలా చేశారు. నేను గత 8 సంవత్సరాల నుండి దీనిని తీసివేయమని అడిగినప్పటికీ వారు తీయలేదు. మార్చి 2016 ప్రాంతములో ఈ గోడకు 2 కన్నాలు పెట్టుట జరిగింది. దీనితో నాపై పోలీస్ కేసు బుక్ అయినది. నేను కూడా వారిపై సివిల్ కేసు వేశాను. ఇలా నేను మూడు సంవత్సరాలు ముద్దాయిగా కోర్టుల చుట్టూ తిరుగుచూ నా కర్మఫలాన్ని అనుభవించాను. చివరికి క్రిమినల్ మరియు సివిల్ కేసు రెండు గెలిచాను. కాని ఇంప్లిమెంటేషన్ కేసు ఇంకా నడుస్తోంది.

## సదా స్వామి పాదారవిందాలను దర్శించే సాధన

ఇప్పటినుండి స్వామివారు నా అంతరంగాన్ని నిశితంగా పరిశీలించసాగారు.

గత కొన్ని సంవత్సరాల నుండి ప్రతి వైకుంఠ ఏకాదశి మరియు తొలి ఏకాదశి రోజులలో స్వామివారు తప్పక దర్శనమిచ్చేవారు, వారి లీలలను చూపేవారు. కాని గత 2 సంవత్సరాల నుండి ఇది జరుగుట లేదు, బాధ కలిగింది. అందుకని ఈసారి తప్పక కనబడమని ప్రార్థించి పడుకున్నాను. తేది 21-12-2015 వైకుంఠ ఏకాదశి రోజు భజగోవిందమును నాచారంలోని హెచ్.ఎం.టి నగర్ లో ఉన్న శ్రీవేంకటేశ్వర ఆలయంలో జరుపుటకు అన్ని ఏర్పాట్లు చేశాము.

**తేది 21-12-2015కల:** ఈ ఉదయం స్వామి కరుణించారు, దర్శనమిచ్చారు, కాని వారి నామము మాత్రమే కనబడ్డది. తెల్లని తిరునామము, అందులో కస్తూరి తిలకము కనబడ్డది. క్షణకాలం కనబడి మాయమైంది. మరియు నేను స్వామివారిపై కాకుండా ఇతరత్రా నా మనస్సును మళ్ళిస్తున్నానని, అది మంచిది కాదు అనే భావం నా మనస్సులోకి వచ్చేటట్లు స్వామివారు చేశారు. నేను కూడా స్వామి ఆజ్ఞానుసారం నడుచుకుంటానని అనుకున్నాను. కాని కొద్దిరోజుల పిదప నా మనస్సు మళ్ళీ ఇతరత్రా పరుగులు తీయును కనుక స్వామీ, మీరే నా మనస్సును మీ పాదారవిందములపై స్థిరంగా నిలిచే వరాన్ని ప్రసాదించమని ప్రార్థిస్తూ సాధన చేయసాగాను.

**దీనర్థం :** నేను స్వామివారికి బొట్టు పెట్టి మా ఇంటికి ఆహ్వానించాలంటే లేదా నా సంకల్పంలో గెలవాలంటే నా మనస్సు సదా స్వామివారి పాద పద్మాలపైనే ఉండాలి.

## మా అమ్మకు కృతజ్ఞతలను తెలుపు అవకాశం ప్రసాదించుట

డిసెంబర్ 2015 నాటి కలలో మా తండ్రి చెప్పినట్లు నేను హరినామ క్షేత్రం ఏర్పాటు చేస్తే... ఆయన సంతోషించుదునన్నాడు. దీనితో మా తండ్రి ఋణం తీర్చుకునే భాగ్యాన్ని స్వామివారు ప్రసాదించారని సంతోషించాను. ఇంతలో మరో ఆలోచన నా మనస్సులో ప్రవేశించింది. మా తల్లి ఋణం తీర్చుకున్నాను. బాగానే ఉంది, కాని నాకు ఇంత గొప్ప జన్మను ప్రసాదించినందులకు ఆమెకు కృతజ్ఞతలను తెలుపుట మరచిపోయాననే బాధ కలిగింది. వెంటనే స్వామివారిని ప్రార్థించాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మా అమ్మ బ్రతికి ఉన్న కాలములో ఆమె విలువ తెలియలేదు, మీకు సేవ చేసే ఇంతటి జన్మను ప్రసాదించినందులకు ఆమెకు నేను కృతజ్ఞతలను తెలుపుకోలేదు, దయచేసి మా అమ్మను ఒక్కసారి నా వద్దకు పంపి కృతజ్ఞతలను తెలుపుకొనే అవకాశమును ప్రసాదించుమని దీనాతి దీనంగా గత కొన్ని రోజులుగా వేడుకుంటున్నాను. స్వామివారు కరుణించారు. ఆ లీల ఈవిధంగా ఉంది.

**తేది 10-01-2016 కల :** ఈనాడు రెండు కలలు వచ్చాయి. మొదటి దానిలో 2008 సంవత్సరంలో చనిపోయిన మా అమ్మ హైదరాబాద్ లోని మా ఇంటి గుమ్మము ముందు నిలబడ్డది. ఆమె చనిపోవుటకు 30 సంవత్సరాల ముందటి వయస్సుతో ఉన్నట్లు ఉన్నది. మా తల్లిని చూచి నేను చాలా ఆనందించాను. పరిగెత్తి ఆమె వద్దకు వెళ్ళాను. నాకు ఇలాంటి జన్మను ప్రసాదించినందులకు ఆమెకు కృతజ్ఞతా పూర్వకంగా ఆమె రెండు పాదాలను పట్టుకొని మరీ మరీ మ్రొక్కాను. ఆదరంగా రెండు చేతులతో నమస్కరిస్తూ, పాదాభివందనం చేశాను. ఆమె మాత్రం ఏమీ మాట్లాడక మౌనంగా ఉంది. ఒకరకంగా నా కృతజ్ఞతలను స్వీకరించింది. ఇది మొదటి కల.

**రెండవ కల :** నేను, నా భార్య, కుమారులు, తల్లి అందరం ఒక పొడవైన హాలులో తలా ఒక మంచంపై పడుకున్నాము. నా తరువాత నా పెద్దకుమారుడు చి॥ వేదాంత్ ఒక మంచముపై పడుకున్నాడు, ఆ తరువాత కొంత స్థలం వదిలి వేరొక మంచంపై మా తల్లి కీ.శే. రుక్కమ్మ గారు పడుకుని ఉన్నారు. మధ్య రాత్రి నేను ఎందుకో లేచి చూచాను. అప్పుడు నా కుమారుడు లేచి చూచాడు. ఆ తరువాత మా తల్లి కూడా లేచి చూచింది. కల చెదిరింది.

ఇంతటి మహత్తరమైన జన్మను ప్రసాదించినందులకు నేను మా అమ్మకు కృతజ్ఞతలను తెలుపుకున్నాను. ఆమె స్వీకరించింది. మరియు ఆమె మా కుటుంబముతో పాటు ఇంకా ఉన్నదని, ఆమె ఆశీర్వాదాలు మా కుటుంబముపై ఉన్నవని ఈ రెండవ కల అర్థం. ఇదంతా శ్రీవేంకటేశ్వరుని కృప.

**ఒక వివరణ :** తిరుమల శ్రీవేంకటేశ్వరుడు, నన్ను సమస్త వికారాలను తొలగించుకొని, తగిన యోగ్యత సాధించుకొమ్మని ఎందుకు చెప్పుచున్నారు? వ్యాపారము వద్దన్నారు, ఇతరులతో మాట్లాడరాదన్నారు, నా బాధ్యతలను స్వీకరించారు, కర్మఫలం అనుభవించుమన్నారు. సదా స్వామివారిని ధ్యానిస్తూ ఉండమన్నారు. ఇదంతా ఎందుకు చేస్తున్నారు? దీనిని

తెలుసుకోవాలంటే... 2002 సంవత్సరంలో నాకు, స్వామివారికి మధ్యలో జరిగిన పందెం గురించి తెలుసుకొనుట ముఖ్యం. ఈ పందెం ప్రకారం, నేను మొత్తం 111 కోట్ల జపమును, (ప్రతి సంవత్సరం 70 వేల మంది భక్తులు వ్రాసిన 7 కోట్ల జపమును 2002 నుండి 2018 వరకు) సమర్పించాలి. దాని ఫలితముతో స్వామివారికి బొట్టు పెట్టి మా ఇంటికి ఆహ్వానించాలి. ఈ మొత్తం సేవలో ఒకటికంటే ఎక్కువ తప్పులు చేయకుంటే, స్వామివారు మా ఇంటికి వచ్చి, వారి పాద సేవాభాగ్యాన్ని ప్రసాదిస్తానన్నారు. ఇది పందెం. ఈ పందెం తరువాత నేను అల్పుడినని, మీరు మా ఇంటికి వస్తే... మీకు అవమానమని, వెనకడుగు వేసి పందెం గురించి పూర్తిగా మరచిపోయాను. కాని స్వామివారు మాట తప్పనివారు కాబట్టి దీనికి కట్టుబడి ఉన్నారు. మొదటి సంవత్సరం ఒక తప్పు చేశాను. మళ్ళీ ఈ తప్పు పునరావృతం కాకుండా 'నమో వేంకటేశాయ' రథాన్ని నిర్మించి త్రిప్పుచున్నాము. ఆ తరువాత ఒక్క తప్పు కూడా చేయలేదు. స్వామివారి అనుగ్రహాల ప్రభావముతో స్వామివారిని తృప్తి పరచాలని, ఎలాగైనా వారి ఋణం తీర్చుకోవాలని ఒక్క తప్పు కూడా లేకుండా సేవ చేయసాగాను. స్వామివారు కూడా నా సేవలో లోపం లేదని ఎన్నోసార్లు చెప్పారు. ఈవిధంగా 16 సంవత్సరాలు సేవ చేస్తే స్వామివారు తప్పక మా ఇంటికి రావలసి ఉంటుంది. అయితే... వారు మా ఇంటికి వస్తే... మేము వారిని పొందే యోగ్యత సాధించవలసి ఉంటుంది. భక్తుడు తగిన యోగ్యత సాధించేవరకు భగవంతుణ్ణి పొందలేడు. ఇది నియమం, కాబట్టి మమ్మల్ని సంస్కరించుకుని తగిన యోగ్యత సాధించుమని పదే పదే చెప్పుచున్నారు. ఒకరకంగా మొత్తం స్వామివారి శిక్షణ ఈ పందెం చుట్టే తిరుగుచున్నది. దీనిని గ్రహించని నేను పొరపాటు చేశాను. మరియు ఈ పందానికి హరినామ క్షేత్రానికి కూడా సంబంధం ఉన్నది.

**నా దశ:** స్వామివారి సమ్మోహన శక్తిని రుచి చూశాను. నా ఆరోగ్యము బాగు చేయుదునన్నారు. మా తండ్రి ఋణం తీర్చుకునే భాగ్యం ప్రసాదించారు. మా అమ్మకు కృతజ్ఞతలు తెలుపుకునే భాగ్యం లభించింది. నా మనస్సు సదా స్వామివారి పాదారవిందాలపై పెట్టుకుని సాధన చేయుమన్నారు.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**
**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**
**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,**
**హైదరాబాద్. ఫోన్: 040-27175050**





## దిశా నిర్దేశం ఇంగ్లీష్ వెర్షన్ 2వ సంపుటం పుస్తకావిష్కరణ

గోకులాష్టమి తేది 16-08-2025 రోజున టిటిడి ఈఓ శ్రీమాన్ జె.శ్యామలరావు గారు ''దిశా నిర్దేశం ఇంగ్లీష్ వెర్షన్ 2వ సంపుటము''ను టిటిడి డైరీఫాంలో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం ముందు ఆవిష్కరణ చేశారు. మరియు ఇలా పుస్తకావిష్కరణ చేస్తున్నందుకు చాలా సంతోషించారు. తరువాత వారిని పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు) దంపతులు సన్మానించారు.

**– ఎడిటర్, శ్రీవేంకటేశం**

# నవవిధ భక్తిమార్గాలు

– డా|| కూర్మాచలం శంకరస్వామి

# నరజన్మకు ముక్తి సోపానాలు

**"తను హృద్భాషల సఖ్యమున్, శ్రవణమున్, దాసత్వమున్, వందనా ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యము దైత్యోత్తమా!"**

నరజన్మకు ముక్తి కలగాలంటే భక్తిమార్గమే శరణ్యము. భక్తి యనగా భగవంతునిపై అమిత ప్రేమతత్త్వం. అలాంటి భక్తిమార్గాలు తొమ్మిది. 1. శ్రవణము 2. కీర్తనము 3. నామస్మరణం 4. పాదసేవనము 5. వందనము 6. అర్చనము 7. సఖ్యము 8. దాసత్వము 9. ఆత్మనివేదనములను తొమ్మిది భక్తి మార్గాలలో ఏ ఒక్కటినైనను అవలంబించినా ముక్తి కలుగుతుందని ప్రహ్లాదుడు తన తండ్రియైన హిరణ్యకశిపునితో చెప్పినట్లుగా పోతన కవి వర్ణించాడు. మానవులకు ఈ కలియుగ బాధలు తొలగి ముక్తి ప్రాప్తించాలంటే ఈ నవవిధ భక్తిమార్గాలలో ఏ ఒక్కటి సాధన చేసినా ముక్తికి సోపానమవుతుంది.

ఈ నవవిధ భక్తిమార్గాలను అవలంబించి ముక్తిపొందిన వారిలో ముఖ్యంగా 1. శ్రవణ భక్తిని అవలంబించిన పరీక్షిన్మహారాజు 2. కీర్తన భక్తిని పాటించి శుకమహర్షి 3. నామస్మరణతో ప్రహ్లాదుడు 4. పాదసేవనతో లక్ష్మీదేవి 5. వందన భక్తితో అక్రూరుడు 6. అర్చనతో పృథుమహారాజు 7. సఖ్యభక్తితో అర్జునుడు 8. దాసత్వ భక్తితో హనుమంతుడు 9. ఆత్మనివేదనముతో బలిచక్రవర్తి ముక్తిపొంది ధన్యులయ్యారని మన పురాణాలు బోధిస్తున్నాయి.

ప్రతి నిత్యము మానవులు భగవంతుని కథలను, అతని యొక్క దివ్యగాథలను శ్రవణం అనగా చెవులారా శ్రద్ధగా వినాలి. అతని కీర్తిని నోరారా పలకాలి. అనునిత్యం ఏ పని చేసినా, నిద్రపోవు వేళలో కూడా ఆ భగవంతుని నామస్మరణ చేయాలి. అతని పాద సేవలో తరించాలి. ఈ జన్మకు కారణమైన ఆ భగవంతునికి మరియు తల్లితండ్రులకు, గురువులకు, బుధులకు వందనములు, సాష్టాంగ నమస్కారాలు చేయాలి. నిత్యం ఆ భగవంతునికి షోడశోపచారములతో పూజించాలి. షోడశోపచారములు అనగా ఆ భగవంతుని ఆపాదమస్తకము 16 భాగాలను పూలతో, పండ్లతో అర్చించాలి. అప్పుడా వ్యక్తికి ఆ దేవదేవునిపై దాసత్వము కలుగుతుంది. ఈ దాసత్వ భావమే సఖ్యత్వము, స్నేహభావానికి



నాందిగా మారుతుంది. చివరకు భక్తుడు ఆ భగవంతుని కొరకు ఆత్మబలిదానానికైనా సిద్ధపడతాడు. ఇది ఒక అనిర్వచనీయమైన, అవిభాజ్యమైన ఆత్మ పరమాత్మ తత్త్వం. ప్రస్తుతం ఇక్కడ ఒక్కొక్క భక్తి గురించి సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

**1. శ్రవణము :**

భగవంతుని కథలు విని తరించిన వారిలో ప్రథముడు చంద్రవంశంలో చివరివాడైన పరీక్షిన్మహారాజు. ఈ రాజు ఒకనాడు వేటకు వెళ్ళి కొన్ని మృగాలను వేటాడి అలసిపోయి దాహార్తి కోసం ఆ సమీపంలో ఉన్న శమీక మహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ మహర్షి తపస్సులో ఉండటం చేత ఈ రాజు రాకను గమనించలేదు. రాజు ఎంత పిలిచినను పలకకపోవడంతో కలి ప్రభావితుడైన రాజు సహనాన్ని కోల్పోయి ఆ దగ్గరలో చనిపోయి పడివున్న సర్పాన్ని తీసి ఆ మహర్షి మెడలో వేసి తన రాజ్యానికి వెళ్ళిపోతాడు.

ఆ తర్వాత కొంత సమయానికి శమీక మహర్షి కుమారుడు వచ్చి తన తండ్రి మెడలో మృత సర్ప దేహాన్ని గమనించి

కోపో ద్రిక్తుడై తన తండ్రిని అవమానించిన వారు ఎవరైనను వారు ఈ బ్రహ్మాండాలలో ఎక్కడ దాగియున్నా వారం రోజులలో తక్షకుడు అనే కాలసర్పము చేత చచ్చు గాక! అని శపించాడు. అది యోగదృష్టితో గమనించిన శమీక మహర్షి తన పుత్రుడు, ముక్కోపియైన శృంగిని చూసి ఓరి పాపాత్ముడా! ప్రజలను పాలించు మహారాజును శపించి నీ తపశ్శక్తిని కోల్పోయావు అని మందలించి పరీక్షిత్తునకు జరిగినదంతయు వివరించి ముని వాక్కులు వెనుకకు తీసుకొనజాలవు కనుక తమకు మరణము తప్పదు. ఈ ఉన్న ఏడు రోజులు భాగవత కథామృతము విని తరించుము అని చెప్పి శమీక మహర్షి తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

తనవలన జరిగిన తప్పిదమునకు రాజు కూడా ఎంతగానో చింతించి మంత్రులను పిలిచి ఏడు రోజులలో భాగవతము చెప్పు పుణ్యపురుషుని వెదకమనగా వారు వ్యాసమహర్షి కుమారుడు శుకమహర్షి ఒక్కరే ఉన్నారని తెలుపగా, రాజు పరుగు పరుగున వెళ్ళి నైమిశారణ్యంలో ఉన్న శుకమహర్షి పాదాలపై పడి శరణు వేడగా శుకమహర్షి పరమానంద భరితుడై ఏడు పగళ్ళు, ఏడు రాత్రులు భాగవత ప్రవచనం చేయగా అది విని పరీక్షిత్తు ముక్తి పొందాడు.

**2. కీర్తనం :**

నవవిధ భక్తిమార్గాలలో కీర్తనము రెండవది. నోరారా భగవంతుని కీర్తిని గానం చేయడం లేదా పలకడం ఈ భక్తికి ప్రతీక. వేదవ్యాసుని పుత్రుడైన శుకమహర్షి అనునిత్యం ఆ సర్వేశ్వరుని యందే త్రికరణ శుద్ధిగా రమిస్తూ ప్రతి పుట్టలోనూ, ప్రతి చెట్టులోనూ, ప్రతి జీవిలోనూ ఆ పరమాత్మను దర్శిస్తూ, అతని కీర్తిని వర్ణిస్తూ మోక్షము పొందిన మహాత్ముడు. అంతేకాదు పరీక్షిత్తు మహారాజుకు భాగవత సప్తాహము చేసి ముక్తిని కల్పించిన సద్భక్తి శిఖామణి శుకమహర్షి. కీర్తన భక్తికి నారద మహర్షి కూడా ఒక ప్రతీక. నారదుడు అనునిత్యము హరికీర్తనలో మునిగి తేలే మహాత్ముడు. ఈ ఆధునిక కాలంలో కూడా త్యాగరాజు, క్షేత్రయ్య, పురందరదాసు, తులసీదాసు, అన్నమయ్య, రామదాసు మొదలైన భక్తకవులెందరో తమ కీర్తనల ద్వారా భగవంతుని మెప్పించి ముక్తిని పొందారు. ముఖ్యంగా పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమయ్య కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరునిపై 32 వేల సంకీర్తనములు రచించి ఆ ఆనంద నిలయునికే అంకితమిచ్చి ధన్యుడయ్యాడు.

**3. నామస్మరణం :**

నవవిధ భక్తిమార్గాలలో నామస్మరణం మూడవది. ఈ భక్తి మార్గానికి ప్రతీక ప్రహ్లాదుడు. ప్రహ్లాదుడు హిరణ్యకశిపుని కుమారుడు. జన్మతః హరిభక్తి పరాయణుడు. నారదమహర్షి అనుగ్రహముతో మాతృగర్భము నుండే హరినామ స్మరణ అలవరచుకొన్న భక్తాగ్రేసరుడు. పానీయములు తాగునప్పుడు, ఆహారము భుజించునప్పుడూ, చివరకు ఆటల వేళలలోనూ, నిద్రించు సమయములోనూ హరి చింతనామృతము గ్రోలడము తప్ప అన్యమెరుగని భాగవతోత్తముడు ప్రహ్లాదుడు. అతని తండ్రి హిరణ్యకశిపుడు అనునిత్యం దైవద్రోహి. తన తమ్ముడైన హిరణ్యాక్షుని ఆ శ్రీహరి వరాహరూపంలో వచ్చి సంహరించాడు. అందువల్ల హిరణ్యకశిపుడు ఆ శ్రీహరిపై ద్వేషం పెంచుకున్నాడు. దానితో తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి ఏ ప్రాణి చేత కాని, ఏ అస్త్రం చేత కాని, భూమి మీద కాని, ఆకాశంలో కాని, రాత్రి కాని, పగలు కాని, నరుల వల్ల కాని, జంతువుల వలన కాని మరణం పొందకూడదని వరాన్ని సంపాదించి ఆ అహంకారముతో కన్నూమిన్నూ కానకుండా దేవతలను, మునులను, వారి పత్నులను, యక్ష, కిన్నెర, నాగ, నభశ్చర మొదలగు దేవతలందరినీ హింసిస్తూ ఉండేవాడు. అటువంటి దైత్యుని కడుపున పుట్టిన ప్రహ్లాదుడు సద్గుణ సంపన్నుడు. నిత్యము నారాయణ స్మరణము తప్ప ఇతర విషయములపై మనస్సు లగ్నము చేసెడి వాడు కాదు. ఇది తండ్రియైన హిరణ్యకశిపునకు ఏమాత్రము నచ్చక మొదట కులగురువులను పిలిచి ఈ బాలునికి రాక్షసనీతి బోధించమని వేడుకున్నాడు. ఆ గురువులు శుక్రాచార్యుని కుమారులు. వారు ప్రహ్లాదుని తమ గురుకులానికి గొనిపోయి శతవిధాలా ప్రయత్నించారు. అయినా ప్రహ్లాదుడు హరినామ స్మరణ తప్ప గురుబోధలను వినలేదు. చివరికి హిరణ్యకశిపుడు శూలాలతో పొడిపించాడు. సర్పాలతో కరిపించాడు. ఏనుగులతో తొక్కించాడు. సముద్రంలో పారవేయించాడు. అగ్నిగుండంలో పడవేయించాడు. అయినా ఆ శ్రీహరి అనుగ్రహంతో ప్రహ్లాదుడు బ్రతకడంతో కోపోద్రిక్తుడైన హిరణ్యకశిపుడు ఎక్కడరా నీ హరి అని గర్జించాడు. ఆ శ్రీహరి ఇందుగలడందు లేడని సందేహము వలదు తండ్రీ! సర్వోపగతుండు ఎందెందు వెదకి చూసినా అందందే గలడు అనగా ఈ స్తంభమందున్నాడా అని గదతో స్తంభాన్ని కొట్టగా అందుండి శ్రీహరి నారసింహుని రూపంలో వచ్చి హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుని రక్షించాడు. దీనిద్వారా నామస్మరణ భక్తి ఎంతటి విశిష్టత గలదో అర్థమవుతుంది.

**4. పాదసేవనము :**

నవవిధ భక్తిమార్గాలలో పాదసేవనము ఒకటి. దీనికి ప్రతీక లక్ష్మీదేవి. సముద్రరాజ తనయ, చంద్రసహోదరి అయిన లక్ష్మీదేవి, వైకుంఠవాసియైన శ్రీమహావిష్ణువు యొక్క పాదపద్మముల యందే ఉండి ఆ స్వామి పాదసేవలో తరించిన ఇల్లాలు. అందరికీ ఆదర్శప్రాయమైనది. అసంఖ్యాక సంపదలకు నిలయమైన ఆ తల్లి అగణిత గుణగణ్యుడు, ఆదిపురుషుడైన స్వామిని నిరంతరం విడవకుండా పాదసేవ చేస్తూంటుంది.

ఇలాంటి పాదసేవ నిరంతరం ఎవరైతే ఆచరిస్తారో వారికి ముక్తి ప్రాప్తిస్తుందని లక్ష్మీదేవి ద్వారా అర్థమవుతుంది. అందుకే బ్రహ్మ కడిగిన పాదము, బ్రహ్మమే తానైన పాదము అని అన్నమయ్య ఆ వేంకటేశ్వరుని కీర్తించి వారి పాదపద్మములను సేవించి కైవల్యం పొందాడు. ఇలాంటి ఎందరో భక్తాగ్రేసరులు శ్రీవారి పాదములను కీర్తించి ధన్యులైన చరిత్రలు కోకొల్లలు. భగవంతుని పాదసేవయే కాదు, మనకు జన్మనిచ్చిన ప్రత్యక్ష దైవాలు తల్లితండ్రులు, జ్ఞానబోధ చేసిన గురువులు కూడా పాదపూజకు అర్హులే. అట్టి వారియెడల అమితమైన వాత్సల్యముతో పాదపూజలు చేసిన వారికి కూడా కైవల్య ప్రాప్తి లభిస్తుందని మన అష్టాదశ పురాణాలు బోధిస్తున్నాయి.

**5. వందనము :**

నవవిధ భక్తి మార్గాలలో వందన భక్తి మార్గము ఒకటి. ఈ భక్తిమార్గానికి ప్రతీక అక్రూరుడు. ఇతడు మధుర రాజైన కంసుని ఆస్థానంలో మంత్రి. కంసుడు శ్రీకృష్ణుని మేనమామ. దేవకి అష్టమ గర్భము వలన తనకు మరణం సంభవిస్తుందని అశరీరవాణి ద్వారా విన్న కంసుడు ఆ శ్రీకృష్ణుని సంహరించుటకు ఎన్ని ఉపాయములు చేసినను ఫలించకపోవుటచే చివరకు నమ్మకస్తుడైన అక్రూరుణ్ణి పిలిచి శ్రీకృష్ణ బలరాములను మధురకు తోడ్కొని రమ్మని గోకులమునకు పంపిస్తాడు. రాజాజ్ఞ ప్రకారం అక్రూరుడు నంద గోకులమునకు వెళ్ళగా ఎక్కడా కృష్ణుడు కానరాక, కృష్ణుడు నడయాడిన నేలమీద అతని పాదముద్రలు చూసి ఎంతగానో సంతోషించాడు. స్వయముగా వాసుదేవుని యందు పరమ భక్తిభావ సంపన్నుడైన అక్రూరుడు ఆ కృష్ణ పాదముద్రలపై సాష్టాంగ ప్రణామమును ఆచరించాడు. ఎర్రటి ఎండలో, ఇసుకలో ఉన్న పాదముద్రలపై అటూ ఇటూ దొర్లుతూ అనేక విధాలుగా స్తుతించాడు. ఆ భక్తికి పరవశించి భగవంతుడైన శ్రీకృష్ణుడే దర్శనమిచ్చి అతని కోర్కెలను తీర్చాడు.

**6. అర్చన భక్తి :**

నవవిధ భక్తిమార్గములలో అర్చన (పూజ) భక్తి ఒకటి. ఈ భక్తికి పృథు మహారాజు వంటి మహారాజులను ప్రతీకలుగా చెప్పవచ్చు. పరమాత్మ రూపాన్ని మనసారా స్మరిస్తూ ఆ పరమాత్మను ఆపాదమస్తకాన్ని అలంకరించి త్రికరణ శుద్ధిగా పూజ చేయడం అర్చన భక్తి అంటారు. షోడశోపచారములతో చేసే పూజలు భగవంతునికి ఎంతో ప్రియం. పాదౌ పూజయామి, గుల్ఫౌ పూజయామి, నాభి పూజయామి, జంఘే పూజయామి, కర్ణౌ పూజయామి, నేత్రే పూజయామి, కటిం పూజయామి, లలాటం పూజయామి, శిరః పూజయామి, అర్ఘ్యం పాద్యం, ఆచమనీయం సమర్పయామి, పుష్పం, పత్రం సమర్పయామి అంటూ ఒకచోట ధ్యానంగా కూర్చుని భగవంతుని రూపాన్ని తదేకంగా చూస్తూ, అతని నామాన్ని నోరారా పలుకుతూ చేసే కర్మను పూజ లేదా అర్చన అంటారు. భక్తితో తులసీదళాన్ని సమర్పించినా భగవంతుడు అనుగ్రహిస్తాడు. భక్తితో ఎంగిలి పండ్లను అర్పించినా భగవంతుడు స్వీకరిస్తాడు. నోములు, వ్రతాలు అన్నీ అర్చన భక్తి క్రిందకే వస్తాయి.

**7. దాస్యభక్తి :**

నవవిధ భక్తిమార్గాలలో దాస్యం ఒకటి. హనుమంతుడు దీనికి ప్రతీక. ఇంకా తులసీదాసు, పురందరదాసు, రామదాసు కూడా నిరంతరం భగవంతునికి సేవలు చేస్తూ తరించిన భక్తాగ్రేసరులు. రామబంటుగా ప్రసిద్ధి పొందిన హనుమంతుడు శ్రీరాముని పాదసేవలో నిమగ్నమై చిరంజీవి తత్త్వాన్ని పొందాడు. శ్రీరామచంద్రమూర్తి అరణ్యవాసంలో సీతాపహరణతో చింతిస్తున్న సమయంలో పరిచయమై, సీతాన్వేషణలో భాగంగా వేయి యోజనాల దూరంలో ఉన్న సముద్రాన్ని దాటి, అశోకవనంలో ఒంటరిగా దుఃఖిస్తున్న సీతమ్మను ఓదార్చి, లంకను కాల్చి, లంఖిణిని చంపి, సీత జాడను శ్రీరామునికి తెలిపి, రామలక్ష్మణులకు ఊరట కల్పించి, రామ రావణ యుద్ధ సమయంలో ఇంద్రజిత్తు చేతిలో లక్ష్మణుడు మూర్ఛనొందగా, సంజీవినిని తెచ్చి సౌమిత్రిని కాపాడి, శ్రీరామచంద్రుడికి నమ్మినబంటుగా కీర్తిపొందాడు హనుమంతుడు. అనునిత్యం రామనామ స్మరణతో కో యని పిలిచినా ఓ యని రక్షించువాడు ఆంజనేయుడు. నిజమైన దాస్యభక్తికి నిట్టనిలువు సాక్ష్యం హనుమంతుడే.

**8. సఖ్యభక్తి :**

నవవిధ భక్తిమార్గాలలో సఖ్యభక్తి ఒకటి. ఈ భక్తికి ప్రతీకలు పాండవ మధ్యముడు అర్జునుడు, కుచేలుడు. వీరి సఖ్యభక్తి అనితర సాధ్యమైనది. కృష్ణార్జునులు నరనారాయణులని ప్రతీతి. సఖ్యము అనగా చెలిమి, స్నేహం. స్నేహంలో త్యాగగుణం ఉంటుంది. ఆ స్నేహభావంతోనే శ్రీకృష్ణభగవానుడు ధర్మపరులైన పాండవుల పక్షాన కురుక్షేత్రంలో పాల్గొని, చంచల స్వభావంతో యుద్ధభూమిలో నైరాశ్యానికి గురైన అర్జునునికి గీతోపదేశం చేసి యుద్ధంలో పాండవులకు విజయాన్ని చేకూర్చాడు. అలాగే సాందీపని మహర్షి వద్ద శ్రీకృష్ణుడు, కుచేలుడు బాల్యమిత్రులు. శ్రీకృష్ణుడు కుచస్థలీ పురానికి రాజయ్యాడు. కుచేలుడు బ్రాహ్మణుడు. అష్టదరిద్రంతో బాధలో ఉన్నా, శ్రీకృష్ణుని నామస్మరణ, భక్తిభావాన్ని విడువలేదు. తన మిత్రుడు తన రాజధానికి వచ్చినప్పుడు సాదరంగా అంతఃపురానికి ఆహ్వానించి మిత్రుణ్ణి అక్కున చేర్చుకుని తన కరుణా తత్త్వాన్ని ప్రకటించాడు శ్రీకృష్ణ పరమాత్ముడు.

**9. ఆత్మనివేదన భక్తి :**

నవవిధ భక్తిమార్గాలలో అత్యంత ప్రముఖమైనది ఆత్మనివేదన భక్తి. ఈ భక్తికి ప్రతీక బలిచక్రవర్తి. ఆత్మ నివేదనమంటే

భగవంతునికి తనను తాను నిష్కల్మషంగా సమర్పించుకోవడం. వేరే ఇతరత్రా భవబంధాలపై మోహం పెంచుకోకుండా, జ్ఞాన, కర్మేంద్రియాలను అదుపులో పెట్టుకొని భగవంతునికి సమర్పించడం. అలా తనను తాను సమర్పించుకున్నవాడు బలి చక్రవర్తి. బలి చక్రవర్తి దైత్యోత్తముడు. అతడు ఇంద్రపదవి కోసం యాగం చేస్తుండగా విష్ణుమూర్తి వామన రూపంలో వచ్చి మూడడుగుల నేలను దానం కోరగా బలి చక్రవర్తి అతని కోరికను మన్నించి ఆ మూడడుగుల నేలను దానమిస్తానని మాట ఇచ్చాడు. బలిచక్రవర్తి కులగురువు శుక్రాచార్యుడు ఎంత వారించినా వినకుండా దానం చేశాడు. ఆ దానాన్ని గ్రహించిన వామనుడు ఒక అడుగు భూమిపై, ఒక అడుగు ఆకాశాన్ని ఆక్రమించి, మరొక అడుగు ఏది అనగా బలిచక్రవర్తి తన శిరస్సును చూపించగా వామనుడు మరో అడుగుతో అతణ్ణి పాతాళానికి తొక్కి మోక్షప్రాప్తి కలిగించాడు.

ఈ విధంగా నవవిధ భక్తిమార్గాలలో ఏ మార్గాన్ని అవలంబించినా ముక్తి కలుగుతుందని పైన పేర్కొన్న ఉదంతాల ద్వారా తెలుస్తోంది. భక్తికి వయసుతో సంబంధం లేదు. ఏ వయసు వారైనా సాధన చేయవచ్చు. నేడు కొంతమంది మొండి వాదనలతో వృద్ధాప్యంలోనో, అంత్య సమయంలోనో భగవంతుని పూజిస్తే చాలని వాదిస్తుంటారు. కాని భక్తికి వయసుతో పనిలేదని, ఏ వయసు వారైనా భగవద్భక్తి కలిగి ఉండవచ్చని అయిదు సంవత్సరాల ధృవుడు, ప్రహ్లాదుడు, ఎనిమిది వత్సరాల మార్కండేయుడు మొదలగు వారు నిరూపించారు. ఆరు మాసాలు విష్ణుమూర్తి కొరకు ఘోర తపస్సు చేసి ధృవుడు, ధృవ మండలానికి అధిపతి అయ్యాడు. నిరంతరం హరినామ స్మరణ చేసి, తన తండ్రి యైన హిరణ్యకశిపుడు పెట్టిన బాధలను భరించి ముక్తి పొందాడు ప్రహ్లాదుడు. అల్పాయుష్షుతో జన్మించిన మార్కండేయుడు శివుణ్ణి పూజించి చిరంజీవి అయ్యాడు. అందుకే చేతులారంగ హరిపూజ చేయాలి. నోరు నొవ్వంగా హరినామాన్ని ఉచ్చరించాలి. అప్పుడే మోక్షం సిద్ధిస్తుంది.

# తులసి మహాత్మ్యం



తులసి వ్రతము అమోఘమైన ఫలితాన్ని కలిగించు దివ్య వ్రతము. తులసిదళము నందు పుష్కర తీర్థము, గంగానది అనే పుణ్యనదుల పవిత్ర ఉదకాలు, శ్రీమన్నారాయణుడు సమస్తమైన దేవతలు నివసిస్తుంటారు. ఘోరపాపములు ఎన్ని చేసినవాడైనా తులసి మృత్తికను పూసుకుని చనిపోయినచో వానిని దూరం నుండి కూడా యమదూతలు చూడజాలరు. కేశవుణ్ణి గాని శివుణ్ణి గాని తులసి గుత్తులతో పూజించినచో పునర్జన్మ కలగదు. కార్తీకమాసంలో లక్ష తులసిదళ వ్రతమును ఆచరించి శ్రీహరిని పూజించువారికి సమస్త సంపదలు సమకూరును. తులసిని స్థాపించుట వలన, స్పృశించుట వలన, పెంచినందువలన, తులసిని గూర్చి చదివి తెలుసుకున్నా, మనో వాక్కాయ కర్మలచే ఆచరించిన సకల పాపములు హరిస్తాయి.

నర్మదా నదిని చూడడం, గంగానదిలో స్నానం చేయడం, తులసివనాన్ని సేవించడం ఈ మూడు పనులు సమాన ఫలితాన్ని కలుగజేస్తాయి. తులసివనాన్ని స్థాపించువారి సమస్త పాపములు హరించును. ఇష్టకామ్యార్థసిద్ధి కలుగుతుంది. యముని వలన భీతి కలుగదు.

యజ్ఞాలు, యాగాలు, పూజలు, వ్రతాలు సమస్తం కార్తీక మాసంలో చేయుట వలన రెట్టించిన పుణ్యాన్ని కలుగజేస్తాయి. తీర్థయాత్రలు దేహాన్ని, మనస్సుని పునీతం చేస్తాయి. వీటి వల్ల కలుగు పుణ్యఫలం అనంతం. కార్తీక మాసం నందు ఉసిరికపత్రి, ద్వాదశి తిథి యందు తులసిదళమును కోయనివారు, వాటితో పూజలు చేయనివారు చేయు పనులు నిరర్థకములు, నిష్ఫలములు. అట్టి అజ్ఞానులు ఘోర నరకముల పాలగుదురు.

తులసి దర్శనము కలుగనివారు ఆ సమయమున విష్ణుభక్తుని పూజించవలెను. అట్లొనర్చుట ప్రథమమగును. నారాయణ సన్నిహితుడగు భక్తుడు విప్రుడు శ్రీమన్నారాయణాంశ సంభూతుడగుట వలన వారిని పూజించుట పుణ్యప్రదము. తులసిమాలగాని, ధాత్రి మాల (ఉసిరిమాలను) గాని ధరించుట శ్రేష్ఠము. అట్టివారు కొన్నివేల కోట్ల సంవత్సరములు స్వర్గమునందు నివసించెదరు. ఈ మాలలను దానం చేసిన ధరించదలచిన తులసి దేవి, శ్రీహరిని స్మరించవలెను. సమస్త పుణ్యాలను కలుగజేసి సర్వపాపాలను హరించును ఈ తులసీదళం.

# తిరుప్పావై

**శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు**



## 25వ పాశురము

ఒరుత్తి మగనాయ్ పిఱన్దు, ఓరిరవిల్
ఒరుత్తి మగనాయ్ ఒళిత్తు వళర,
తరిక్కిలానాగి త్తాన్ తీంగు నినైన్ద,
కరుత్తై ప్పిళైప్పిత్తు కఞ్జన్ వయిత్తిల్,
నెరుప్పెన్ననిన్ఱ నెడుమాలే! ఉన్నై
అరుత్తిత్తు వన్దోమ్ పఱై తరుదియాగిల్,
తిరుత్తక్క శెల్వముమ్ శేవగముమ్ యాంపాడి,
వరుత్తముమ్ తీర్ న్దు మకిళిన్దేలో రెమ్బావాయ్.

**తాత్పర్యము** – తనను చతుర్బాహు స్వరూపముతో కుమారునిగా కనవలెనని కోరిన సాటిలేని దేవకీ దేవికి ఒక రాత్రి కుమారుడవై పుట్టి, అదే రాత్రి బాల చేష్టలను కనవలెనని తపమాచరించిన మరొక అద్వితీయమైన యశోదమ్మ యొక్క ముద్దుబిడ్డవై రహస్యముగా పెరుగుచుండ, ఆ వార్తను వినిన కంసుడు సహించలేక నీకు అపకారము చేయ తల్చగనే అతని యొక్క అభిప్రాయమును వ్యర్థమగునట్లు చేసి, ఆ కంసుని కడుపులో నీవే కారుచిచ్చు వలె అయి అతనినే సంహరించి, నిన్ను మాకనుగ్రహించిన, మాపై దీర్ఘ వ్యామోహము కలవాడా! నిన్నే మేము యాచింప వచ్చినాము. పఱై అను వాయిద్య విశేషమున్ను ఇచ్చినచో శ్రీలక్ష్మీ దేవి కూడా అభిమానించు నీ ఐశ్వర్యమును, ఆమె వినగోరు నీ యొక్క వీర చరితములనేకములను మేము పాడి, నిన్ను పొందుటకై ఇంతవరకు పడిన శ్రమలన్నిటిని మరచి ఆనందింతుము.

**విశేషార్థము**– ప్రాపంచిక వస్తువులను అనుభవించినట్లు భగవంతుణ్ణి పాంచభౌతిక శరీరంతో కదలాడే రూపంతో దర్శించ వీలులేదు. పరమ పదంలో దివ్యదేహంతో మాత్రమే అది సాధ్యమని ఉపనిషత్ చెప్తోంది. భగవంతుని గుణాల గొప్పదనం విని, అది ప్రేమగా మారి పొంది తీరాలనే ‘త్వర’, తీవ్ర వాంఛ కలిగిన వారికోసం రెండు రకాలుగా దర్శనమిస్తాడట. 1. అవతారం. 2. అర్చామూర్తి. అవతారంలో ఆయా సమయాలలో మాత్రమే కనిపిస్తాయి. తరువాత ఉండవు. అర్చామూర్తి ఆలయాల్లో ఎప్పుడూ అలానే ఉంటుంది. అవతారం మనుష్యుల లాగానే ఉన్నా దాని పరిపూర్ణ శక్తిని విగ్రహం అచేతనం లానే ఉన్నా దాంట్లోనూ పరిపూర్ణతను విశ్వసించగలగాలి. విశ్వాసం గల భక్తులనే సాధువులంటారు. కేవలం రంగు వస్త్రాలను దాల్చిన వారిని కాదు. వారి పరిత్రాణమే తన కర్తవ్యమని చెప్పాడు గీతలో. ‘పరి’ అంటే ప్రేమించిన భక్తుని మాత్రమే కాక అతని సంబంధులందరినీ కూడా కాపాడువాడని అర్థం. అలాంటి సాధువులకు ఈ ప్రాకృత శరీరంలో ఉన్నా భగవంతునితో చేరి ఉన్నట్లే తృప్తిగా ఉంటుంది అర్చామూర్తిగా చూస్తే. శారీరక ఆధి వ్యాధుల వల్ల కలిగే ఒడిదుడుకులు తమవనే భావన

మాని ఓ రిమితో అదీ భగవానుడు తనపై స్మరణ పోరాదని ఇచ్చాడన్నట్లు భావిస్తారు భక్తులు. వారిలో అభిమానం అహంభావములుండవు. విగ్రహంలోనివాడే నాలోనూ బయటా అంతటా కష్టాలు పెట్టేవారిలో కూడా ఉన్నాడు. ఒకనాడు తనలోంచి ఇంత సృజించినవాడే ఈవేళ ఇన్నిటిలోనూ ఉన్నాడు. ఆ కారణమే ఈ కార్య ప్రపంచమైందనే విశ్వాసంతో ఏ పలుకైనా వాని పాట గానే తలుస్తాడు. విగ్రహంలో ఆ తత్వాన్ని చూసి పొంగిపోతాడు. వీనికి పైకి తెలిసే శిల, లోహాలు కనిపించవు. అజ్ఞానదశ, ప్రేమవల్ల అణిగి చిన్నరూపులో కారణబ్రహ్మ సాక్షాత్కరిస్తాడు. ప్రేమతో పాడకుండా ఉండలేక పాడుతాడు. శరీర ధర్మం కనుక పనులు చేస్తాడు. క్రమంగా మనసులోని ఇతర రాగ ద్వేషాలు కడిగివేయబడతాయి. ప్రకృతి బంధం నామమాత్రంగా ఉంటుంది. అప్పుడు ఇక్కడ విభూతిలో దేనిని చూసినా ఆనందం, కృష్ణుడే వీరికి కనిపిస్తారు. ఆ విగ్రహాన్ని వదిలి వేరే మోక్షం వారు కోరరు. అత్ర బ్రహ్మ సమశ్నుతే ఇక్కడే బ్రహ్మానందమొందుతున్నారు అన్నట్లు ఉంటారు. ఇలాంటి వారితోటి విగ్రహంగా మాట్లాడుతాడు కూడా.

అవతారం విగ్రహం రెండూ కూడా 'దీపం' లాంటివి. కొందరు ఆ కాంతితో బాగుపడతారు. చాలామంది ఆ దీపాన్ని ఆర్పదలచి మిడతల వలె అనర్థాలు తెచ్చుకుంటారు. శిశుపాలుడు అలా నాశనమైనవాడే. అవతార విగ్రహాలు చూస్తే, ఇవా! ఇంత చేయగలవా! అంటూ సంశయం లేకుంటే చాలు. భగవద్గీతలో నాల్గవ అధ్యాయారంభంలోనే అర్జునుడీ సంశయాన్ని వెలిబుచ్చాడు.

**"అవరం భవతో జన్మ పరంజన్మ వివస్వతః"**

కథయే తద్విజానీయం? అంటూ 6 ప్రశ్నలు అడిగాడు.

1. కృష్ణా నువ్వూ మాలాగే పుడతావా?
2. నీ స్వభావాలన్నీ మాలాగే మరుగున పడతాయా పుడితే?
3. కర్మ మమ్మల్ని పుట్టించినట్లు నిన్నేది పుట్టిస్తుంది?
4. కర్మ పండితే మేం పుడతాం గద మరి నువ్వు?
5. నీ శరీరం మాలాగే పాంచభౌతికమేనా?
6. నువ్వు పుట్టి మాలానే కర్మ అనుభవిస్తావా?

అంటూ ఓ పరీక్షా పత్రాన్ని ఇచ్చాడు. తన అవతార రహస్యాన్ని వెలువరించాడక్కడ 4 శ్లోకాలలో.

1. నీలాగే నా జన్మ నిజమే. నాకు జన్మలెన్ని ఎలా గడుస్తాయో తెల్సు. నీకు తెలీదు. అంతే తేడా.

2. నేను విగ్రహంలో ఉన్నా, మనిషిగా ఉన్నా, మరెలా ఉన్నా అజత్వ, అవ్యయత్వ, సర్వభూతేశ్వరత్వములనే స్వభావాలు ప్రకాశిస్తూనే పుడతాను. ఎక్కడున్నా విశ్వాన్నంతా శాసించగలుగుతానని అర్థం.

3. నాకు కర్మలు లేవు. కనుక నా సంకల్పమే పుట్టుకకి కారణం, ఎవ్వడి శాసనమూ కాదు.

4. ధర్మాలు, మంచి పనులు చేసేవారు లోపించి, దుష్టులు పెరిగితే వారిని పీకేసి, ధార్మికతను పెంచడం అవసరమని, ఆ సమయంలో నేను పుడతాను.

5. పుట్టి నీలాగే ఉన్నా నాది పంచోపనిషణ్మయ దేహం. పాంచభౌతికం కాదు.

6. పుట్టాక సజ్జనులని పరివారంతో పాటు కాపాడుతా. వాళ్ళని బాధపెట్టే మూర్ఖులని నిర్మూలిస్తా. సజ్జనుల ద్వారా ధర్మాలన్నీ నా దగ్గర పర్యవసించేవని చెప్పిస్తా. ప్రతి యుగంలో, నేను తిరిగే రూపంలోనే ఉంటూనే ఉంటా. ఇది గొప్ప రహస్యం. విగ్రహంలో కూడా అంత శక్తితోటే ఉంటాననీ, నిజంగా ఎవడు నమ్ముతాడో వానికిక జన్మలు తొలగిపోతాయి. బ్రహ్మానందాన్ని పొందుతారు. నన్ను చేరుతారు సుమా! అన్నాడు. ఆండాళ్ "ఈ రహస్యం తెలుసుకున్నాం కనుక మమ్ము కాదనలేవు సుమా" అంటూ తన కోరిక చెప్తోంది ఈ పాశురంలో.

స్వామి విన్నాడు. ఏమర్రా 'పాట బాగా పాడారు. చలిలో ఇంతసేపు బాధపెట్టాను మిమ్మల్ని సరి. పఱై కాక ఇంకేం కావాలి?' అని అడిగాడు.

'మాకే శ్రమ లేదు, నీ నామ కీర్తనే బలాన్నిచ్చింది మాకు. ఇస్తానన్నావు కనుక 'పఱై' అన్నాం కాని, అసలు మాకు నీవే కావాలి' అన్నారు తెలివిగా.

'ఓ సమయం రావాలి. నియమాలు పూర్తి కావాలి. ఆటంకాలు పోవాలి' అన్నాడు.

'చాలు చాలు స్వామీ! ఏమేమి చేయాలో యశోదాదులే చేసుకున్నారు. మేమేమీ చేయం. అడ్డు తొలగించడం నీకు లెక్క కాదు. ఏమి చేయడం నీకు రాదు కనుక? అమాయకునిలా ఉన్నా, నీ అవతార రహస్యం మా దగ్గర దాచలేవు' అంటూ పాడింది ఆండాళ్.

"అద్వితీయురాలైన ఒక పడతికి పుట్టావు. అద్భుతమైన రాత్రి మరో అద్వితీయురాలి కొడుకై రహస్యంగా పెరిగావు. నాకెందుకులే, వస్తే చూద్దామని ఊరుకోలేని దుష్ట కంసుడు నీకు చెడు చేయాలని అనుకున్నాడు. వాడి కోరిక వాడి ముప్పుకు పుట్టింది. 'కృష్ణ మరణం' కోరాడు. కృష్ణుని చేతనే మరణించాడు. అసలు ఆ భయమే నిప్పుకణమై వాని పొట్టలో దొలిచింది. ఇదంతా ఎందుకు చేశావో తెల్సు. మా మీదుండే వెఱ్ఱి ప్రేమ చేతనే. అందుకే ఓ దీర్ఘవ్యామోహమా! నిన్నే మేం కోరి వచ్చాము. పఱై ఊరివారి కోసం ఇస్తానంటే నీ ఇష్టం. అమ్మకి తృప్తి కలిగే నీ సంపదలను, వీర చరితలను, ప్రేమతో, అమృతపానంలా పాడుతుంటే, శ్రమ ఏమీ తెలియకుండానే, ఎంత హాయిగా వచ్చి చేరామో తెలుసా!" అంటూ స్వామి అవతార రహస్యాన్ని పాడుతున్నారు.

సర్వలోకేశుని, సర్వనియంతని, పుట్టుక లేనివాణ్ణి, మాట వినే భవ్యుడైన కొడుకుగ కన్న దేవకీదేవి లాంటి స్త్రీ మరొకామె లేదు. కృష్ణుడు కూడా ఆమె సంబంధం కావాలనే.

"వసుదేవసుతం... దేవకీ పరమానందం కృష్ణం" అని పేరులో చేర్చేసుకున్నాడు. కాని ఆ తల్లి పేరు ఆండాళ్ ఇక్కడ చెప్పదు. భయమన్న మాట. కంసుడు వింటే ఏమైనా చేసేస్తాడని. ఇక్కడొక విచిత్రం చూడండి. దశరథుడు తపస్సు చేసి నలుగురు కొడుకులను కంటే, వసుదేవ, నందగోప దంపతులు నలుగురు తపస్సు చేస్తే ఒకే కొడుకై నలుగురినీ తృప్తి పరిచాడు.

జైలులో పుట్టావా? తల్లిపాలు త్రాగేందుకు నోచుకోలేదా! వెంటనే వానలో ఎందుకయ్యా స్వామీ అంత శ్రమపడ్డావు. ప్రయాణమా? ఏడవడానికి పండుగ చేసుకోవడానికి వీల్లేదా? 12 నెలలు గర్భవాసమా? ఏ కర్మా లేకపోయినా ఏనుగు కోసమో, ప్రహ్లాదుడి కోసమో వచ్చినట్లు ఆవిర్భవించవచ్చు కదా! అయినా మా మీద నీకు గల ప్రేమే కదా! ఇన్ని పాట్లు, మనిషి కంటే అన్యాయంగా పడేట్లు చేసింది? ఎన్నిసార్లు ఉపకారం చేసినా మరచిపోవడం మా తలలపైనా ఎంత తిట్టినా, మమ్మల్ని వదలలేక మళ్ళీ పుట్టి వెంటబడటం నీ తలపైన రాసి ఉన్నట్లుంది. నిన్ను పుట్టించిన ఆ రాత్రి ఎంత గొప్పదో కదా! దొంగలా నది దాటించింది ఆ రాత్రి. ఆ యశోద మరో అద్వితీయురాలు. కనకుండానే నీకు పాలిచ్చి తల్లి అయింది. దేవకికి ఈ భాగ్యం లేదు. కన్నవాళ్ళ కంటే పెంచినవాళ్ళే కద గొప్ప. రోటికి కట్టింది. పశువుల వెంట పంపింది. నీ వెన్నల దొంగతనాలన్నింటికి అండగా నిలిచింది. ఇంట్లో ఉన్నా లేవని చెప్పింది. పూతననే తల్లి అనుకున్నవాడివి. ప్రేమ కల యశోదను ఎంత ప్రేమించి ఉంటావు!

ఆమెకు ఆమె సాటి కదా! నీ పుట్టుకను ఇంత తారుమారు చేసి గుంభనంగా కథ నడిపిన నీకు చేతకానిదేమి ఉందయ్యా? ఎవరేది కోరితే వారికది ఇచ్చావే. కుబ్జ కోరిక తీర్చలేదూ? కంసుడు, గోటితో నీకాపద తలపెడితే సహించేవాడివే. పాపం మనస్సులో కూడా చెడు తలచాడు. అదీ వాడి మృత్యువైంది. రక్షించాలంటే నోటి మాట చూస్తావ్. శిక్షించాలంటే మనస్సు దాకా వెతికి, మంచి దొరక్కపోతే అప్పుడు శిక్షిస్తావ్. సరి. ఏమిటిలా పిచ్చివానిలా చూస్తావు? నీ ప్రేమ పిచ్చి ఎంత గొప్పదో మాకు తెలిసి వచ్చాం. మా కోసం పుట్టవద్దు. పెరగవద్దు. నదులు దాటవద్దు. ఇంతదూరం ఎవరడిగారని వచ్చావు? వచ్చినవాడివి నిన్ను దాచేసుకుంటావేం? నిన్ను చూపు మాకు నిన్నే ఇవ్వు. ఇంకేమీ వద్దు అన్నారు.

"నేనా? పఱైయా? ఏది కావాలా సరిగ్గా అడగండి" అన్నాడు. 'మా కోరిక తీర్చాలని ఇవ్వడం కాదు. నువ్వు ఇది తీస్కోండి అంటే కాదనేది లేదు మాకైతే నీవే. పఱై తీస్కొనండి అంటే కాదనలేం కనుక తీస్కుంటాం. నీ ఇష్టానికి అడ్డు రాలేం. అనుగ్రహించు' అంటూ పెద్దల కోసం పఱై, మా కోసం నీవూ కావాలన్నట్లు ప్రార్థించింది ఆండాళ్.

# 26వ పాశురము

మాలే! మణివణ్ణా! మార్గళినీరాడువాన్,
మేలైయార్ శెయ్ వనకళ్ వేండువన కేట్టియేల్,
ఞాలాత్తైయెల్లామ్ నడుంగ ముఱల్వన,
పాలణ్ణ వణ్ణత్తు ఉన్ పాఞ్చశన్నియమే,
పోల్వన శంగంగళ్ పోయ్ ప్పాడుడై యనవే,
శాలప్పెరుమ్ పఱైయే పల్లాం డిశైప్పారే,
కోలవిళక్కే కొడియే వితానమే,
ఆలినిలైయాయ్! అరుళేలో రెమ్బావాయ్.

**తాత్పర్యము** – ఆశ్రితుల యందత్యంత వ్యామోహము కలవాడా! ఇంద్రనీల మాణిక్యవర్ణుడా! మార్గశీర్ష మాసమున స్నానవ్రతము నాచరింపదలచితిమి. మా పూర్వులున్నూ ఈ స్నానవ్రతమాచరించి యున్నారు. వారాచరించిన విధానమును, అందులకవసరమగు పరికరములను నీవు దయచేసి వినునట్లైతే తెలిపెదము. భూమండలమునంతయు వణికింప జేయునంత పెద్ద ధ్వనినిచ్చు, పాలవలె స్వచ్ఛమై తెల్లనైన రంగుగల నీ యొక్క పాంచజన్య శంఖమునే పోలిన అనేక శంఖములు కావలయును. మంగళ గానములాలపించు గాయకులు కావలయును. ఒక మంగళదీపము కావలయును. పెద్ద గరుడధ్వజము కావలయును. విశాలమైన చాందినీలున్నూ కావలెను. ఇవన్నియు నీవివ్వగల్గినవే. లోకములను బొజ్జలో దాల్చి ఒక లేత మఱ్ఱి యాకుపై పవళించిన నీకు చేతకానిదేమి ఉన్నది తండ్రీ! కరుణించుమా!

**విశేషార్థము:** భగవంతుణ్ణి పొందడం మనకెంతో అదృష్టముండటం వల్ల జరుగును. అది మన భాగ్యమంటారు కొందరు. ఆండాళ్ కాదంటోంది. ఒక జీవుడు తనను చేరాడంటే అది తన భాగ్యమని, తన అదృష్టమని భగవంతుడు పొంగిపోతాడట. అల్లారుముద్దుగా పెరిగే ఒక్కగానొక్క కొడుకు కోపంతో ఇల్లు వదిలాడు. తిరిగి చాలా కాలానికి ఇల్లు చేరాడు. ఇది ఎవరి భాగ్యం క్రింద భావిస్తాము? పిల్లవానికేం? బాగానే ఉంటాడు. తిరిగి రావటం తమ అదృష్టమని పొంగిపోతారు. అలాగే పరమాత్మ కూడా ఒక్క జీవుడు తనవైపు తిరిగితే ఉప్పొంగిపోతాడట. ఉపనిషత్తులీ విషయాన్ని తెలిపాయి. అదే ఆండాళ్ వివరిస్తుంది.

నాకన్నీ వాసుదేవుడే. 'వాసుదేవస్సర్వమితి' అనే వాడొక్కడూ లేడే అని ఆనాడే దుర్లభమైపోయాడు ఈ జీవుడు అంటూ బెంగ

పెట్టు కుపోయాడు. అలాంటి వాడొకవేళ దొరికితే, వానికోసం 'యోగక్షేమం వహామ్యహం' అని స్వయంగా వాని – యోగం = ఏ వస్తువులు కొత్తగా సంపాయించాలో అవి, క్షేమం = లభించినవాటిని భద్రపరచుకొనుట అనే బాధ్యతలు నా భుజాల మీద మోస్తాను అన్నాడు కృష్ణుడు. అంటే ఒక భక్తుడి కోసం భగవానుడెంత మోహం వాచిపోయాడో కదా! అలాంటిది, ఇద్దరు భక్తులతో ఆండాళ్ తల్లి ఎదుట నిలిచేసరికి కృష్ణుడికి సంతోషంతో వ్యామోహం హద్దు మీరిపోయింది. పిచ్చివానివలె వీళ్ళనే చూస్తూ వీళ్ళ మాటలే ఇంకా వినాలని ఏదో అడుగుతున్నాడు.

'నా భక్తులు, శరణాగతులు నన్ను చేరితే ఇంకేమి కోరరే! మరి మీరు కోరుతున్నారా?' అని అడిగాడు. "స్వామీ! ఈ మార్గశీర్ష వ్రతం నీవాచరించమన్నావు కనుక మేం ఆచరిస్తున్నాం. వ్రతానికంగంగ కొన్ని పరికరాలు నీవిస్తానన్నావు కనుక మేం కోరుతున్నాము తప్ప మాకవి ప్రధానం కాదు. మార్గములలో కెల్ల శ్రేష్ఠమైన, ఉత్తమమైన మార్గం శ్రీకృష్ణుడే. "కృష్ణం ధర్మం సనాతనం" అతని దివ్యానుభూతియే గోపికలకు, నిస్స్వార్థ మహానుభావులకు పరమ ప్రయోజనము.

దానికేమి కావాలో కోరుతారు. ఇది ఆంతరంగికం. శ్రీకృష్ణుని ఈవిధంగా సేవించే అవకాశం ఆ ఊరి పెద్దలంతా కల్పించారు వీరికి. ఆ పెద్దలకు కావలసినవి బయటి పంటలు పండించే వర్షాలు. దానికోసమొక వ్రతం. ఆ వ్రతానికి పరికరాలైన వాయిద్య విశేషాలు కోరుతారు. అవైనా ఆయనిస్తానన్నాడు కనుక.

భగవద్భక్తులైనా భగవంతుని అభిమతానికి అడ్డు రానంతవరకు, అతని ఆజ్ఞలయిన కర్మలు మానరు. ఈ ప్రపన్నులు కర్మలను భగవత్కైంకర్యములుగా నిష్కామంగా ఆచరిస్తారు. అవి వారిని బంధించవు. తరింపచేస్తాయి. వాటివల్ల కలిగే సత్ఫలితాలు వీరు కోరరు కనుక ఆ ఫలమంతా లోకుల క్షేమానికే అవుతుంది. అదే ఆ గోపికలు చేసే ధనుర్మాసం కూడా. ఆ విషయమే తెలిసి, కావలసిన పరికరాలను జాగ్రత్తగా అడుగుతోంది ఆండాళ్. "ఓ వ్యామోహమా! గతంలో నీలో వ్యామోహం ఉందనుకున్నాం. కాదు నీకే భక్తవ్యామోహం అని తెలిసింది. నిన్ను చూచాక, మా ప్రేమలే గతంలో గొప్పవని, నీవు స్వతంత్రుడవు కనుక చూస్తావో, చూడవో అని పొరబడ్డాము. ఇపుడు తెలిసింది. మా కంటే నీకే ప్రేమ అధికమని. నీవు విభుడవు. నీకుండే ప్రేమ కూడా సాగరం లాంటిది. మేం అణుస్వరూపులం. మా ప్రేమలు నీటి బిందువులంతవి. సీత, హనుమ ద్వారా సందేశం పంపుతూ 'నెల రోజులు మాత్రమే ఇక బ్రతుకుతానని చెప్పు' అంది. అది విన్న రాముడు 'అయ్యో! నేను ఒక్క క్షణం కూడా ఆమెను వీడి బ్రతుకలేనే' అంటాడు. ఇది ఆయన వ్యామోహం. శ్రీరాముడెంత శరణాగతులెంత దుష్టులైనా రక్షించమని అడిగితే చాలు రక్షింప చేస్తాడని 'శరణాగత వత్సలుడనే' బిరుదు పొందాడు. అసలు రావణుడే వస్తే కాపాడుదామనుకున్నాడు రాముడు. విభీషణుడు వస్తే పోనీలే మనకా రావణుని కాపాడే భాగ్యం లేకపోతే మానే, కనీసం వాడి తమ్ముడినైనా కాపాడగలిగామని పొంగిపోయాడట. ఇదీ ఆయన రక్షణ వ్యామోహం. అలాగే ఇదే కృష్ణావతారానికంతటికీ సారమట. ఎంత అల్పులైనా వారిని వెఱ్ఱిగా ప్రేమించేస్తాడట. వారియందు వ్యామోహం పెంచేసుకుని లొంగిపోతాడని ఆండాళ్ బహిర్గతం చేస్తోంది. గోపికల యందుండే వ్యామోహమే మధురను రాత్రికి రాత్రి వదిలి పరుగున వచ్చేట్టు చేసిందట. ఆ వ్యామోహమే, వీరిని వదలాల్సి వస్తుందేమోననే బెంగయే రహస్యంగా పెరిగేట్టు చేసిందట తప్ప కంస భయం కాదు. ఇక దూత్యము, అర్జున సారథ్యము భక్త వ్యామోహం వల్ల చేసిన ఘన కార్యములే కదా!".

ఆళ్వార్లను పొందడానికి భగవానుడు ఇలాంటి పాట్లే పడతాడు వ్యామోహం చేత. ఈ గోపికల మాట "ఓ వెఱ్ఱి ప్రేమా!" అనేది విని ఆయన మరింత పిచ్చివాడై పోయాడట. కాని అది బయట పడరాదని 'మీకెలా తెల్సు?' అని గంభీరంగా మోహం పెట్టి అడిగాడు. 'మణివర్ణుడా! నీలోని ప్రేమ నీ దేహకాంతియే చెప్తోంది లేవయ్యా! దాచినా దాగని అందం. ఒకవేళ నీవు క్రూరుడవైనా, ఆ కాంతి వదలనివ్వదు. అలాంటిది ఇంత ప్రేమ కల నిన్ను ఎలా వదలగలరు? మణి వలె నీవు సులభుడవు. విలువ కలవాడవు. భక్తులకు కొంగు బంగారానివి. మణివలె నీవు హృదయంలో ఉన్నావంటే వారికి గౌరవాన్ని సంపాదించి ఇస్తావు. అమ్ముకునైనా బ్రతకవచ్చునన్నంతగా లొంగి ఉంటావు. ఆ అందం చూచే అమ్మ నీ పక్షం విడువనన్నది కదా! 'సరే లెండి! మా అమ్మ కూడా నన్నిలాగే మణితో పోల్చి పిలుస్తూ ఉంటుంది. ఇంతకీ ఏమి కోరి వచ్చారు?' అని అడిగాడు. "మార్గశీర్ష స్నానం కోసం వచ్చామయ్యా!". అలాగా! ఈ వ్రతానికేమి ప్రమాణమట్రా! శాస్త్రం చెప్పిందా? లేకపోతే చేయరాదు కదా! అన్నాడు. "శాస్త్రాలలో ఎక్కడుందో మాకు తెలియదు కాని, మా వ్రతానికి పెద్దల ఆచరణకే ప్రాధాన్యం ఇచ్చింది. "యధా తే తత్ర వర్తేరన్". బ్రహ్మవాదినో వదన్తి అవునా, నీవు కూడా శ్రీరామునిగా పుట్టినపుడు విభీషణుని రక్షించడానికి వేదాన్ని ప్రమాణంగా తీసుకోలేదు. ఓ పావురము చేసిన కృత్యాన్ని ఆధారంగా తీసుకున్నావు గుర్తుందా? గీతలో అదే చెప్పావు యద్యదాచరతి శ్రేష్ఠః జ్ఞాపకం లేదా? మేమూ ఆ పెద్దలు చెప్పిన వాటిని క్రమం తెలిసి ఆచరిస్తోంటే, విధులు కన్పించకున్నా, ఆ ఆచరణయే బాగుపడ కోరేవారికి ప్రమాణమని మేమూ అంగీకరించాం. గోపికలే మన ఆండాళ్ కి ఆదర్శం. వాళ్ళు శాస్త్రాలు చదవలేదు, కాని వాళ్ళ ఆచరణ వేదాలు చదివిన చతుర్ముఖ బ్రహ్మని కూడా పరవశింపచేసి, 'నాకీ బ్రహ్మ పదవి కంటే ఈ గోపికల పాద రజస్సునైతేనే ఆనందంగా ఉండేదనుకున్నాడు'. ఆ గోపికలు

చేశారు మాకదే ప్రమాణం తెలుసా? అంది ఆండాళ్. వీరి మాటలు విని ముఖాలు, వక్షోజాలు, నడుముల అందాలు చూస్తూ ఆనందిస్తున్నాడట. మాటలు వింటున్నాడట. ఆయన చూపులు చూసి అసలు మాటలు వింటున్నాడా అని అనుమానం వేసింది వీరికి. 'ఏమిటీ నీ ఉపవాసం అయిపోయిందా?' అని అడిగారు.

భక్తుల జ్ఞానము నేత్రాలలో, అధరాలలోను తెలుస్తుంది. నేత్రాలు జ్ఞానానికి, నోరు దైవీ వాక్కు అనురాగానికి ప్రతీక కదా! అలానే హృదయంలో పుట్టే భక్తికి ప్రతీక వక్షోజ సౌందర్యం. సన్నని నడుము విషయ వైరాగ్యానికి ప్రతీక. ఒక భక్తునిలో ఈ మూడే చూస్తాడు భగవానుడు అనుగ్రహించడానికి. అవి వీరికున్నాయి. వీటిని కలిగించేది ఆయనే. ప్రయోజనం ఆయనకే.

వింటున్నానర్రా! మీ శ్రమను గమనిస్తున్నాను. అందమైన మాటలు వింటున్నాను. చెప్పండి మీ వ్రతం ప్రమాణమే. కోరండి ఏమేమి కావాలో అన్నాడు. చాలా జాగ్రత్తగా కోరింది.

"భూమినంతను అదరగొట్టు గొప్ప ధ్వనికల తెల్లని పాలవంటి నీ పాంచజన్యాన్ని పోలిన అనేక శంఖాలు కావాలి". ఆ పాంచజన్యం స్వామికి మాత్రమే ఉంటుంది. అనేకం ఎలా లభిస్తాయి? అంటే ఆయన రూపమే కావాలని వీరి కోరిక. సారూప్యమని, సాయుజ్యమని భగవదనుభవం రెండు రకాలు. సాలోక్యం, సామీప్యం అని మరో రెండు రకాలు గతంలో లభించాయి. ఈ పాశురంలో సమాన రూపాన్ని కోరుతోంది. విన్నాడు స్వామి. సరి సరి, చెప్పండి మీ కోరిక దుర్లభంగా ఉందే. అన్నీ చెప్పాక చేతకాదనేద్దామని వింటున్నాడు.

"స్వామీ పెద్ద మధ్యభాగం కల చాలా పెద్ద పఱై అనే వాయిద్యం కావాలి". ఎంత పెద్ద పొట్ట అయితే అంత పెద్ద శబ్దం వస్తుంది కదా! "యాత్ర స్నానం కోసం వెడుతున్నాం, మేళ తాళాలుండాలి" అన్నట్టు అడుగుతున్నారు. "మంగళం పాడువారు కావాలి", "గుత్తి దీపం కావాలి", "నీ ధ్వజం వంటి ధ్వజం కావాలి", "ధరించిన అలంకారాలు మంచుపడి చెరగకుండా పైన కప్పుగా ఒక చాందినీ కావాలి". నీపై వానపడక కాపాడే ఆదిశేషుని కప్పు వంటిది కావాలన్నారు. లోకాలను ధ్వనించే తెల్లని శంఖమే 'అపౌరుషేయ వేదసారమైన ప్రణవము'. దాని అర్థం శరీరంలోని భావ దోషాలను అదరగొట్టును. 'చాలా పెద్ద పఱైయే 'నమః' అనే త్యాగాన్ని, శుద్ధిని ధ్వనించు పదము'. 'గాయకులు భాగవత గోష్ఠికి మంగళం పాడు ఆళ్వార్లు కావచ్చు'. 'నిత్యమంగళదీపం లక్ష్మీదేవి'. 'జెండా గరుత్మాన్ వేద ప్రతిరూపం'. 'చాందిని ఆదిశేషువు. స్వార్థం లేని సేవ'. ఈ చిహ్నాలు సారూప్యాన్ని సూచిస్తాయి. అన్నీ విని నా శంఖం లాంటివి మరి లేవు. అంచేత ఇవన్నీ వీలు పడవన్నాడు. స్వామీ లోకాలన్నీ మ్రింగి వటపత్రంలో పరుండి, మళ్ళీ అన్ని లోకాలు ఎలా పుట్టించావు? నీకేమి చేతకాదు? అఘటిత ఘటనా సమర్థుడా! నీ కృప ఉంటే అవుతాయి. ఎలాగో మాకు తెలీదు. కృపయే మాకాధారమంతే అని ప్రార్థించి ఆరు వస్తువులను ఇవ్వాలి మరి అని అడుగుతున్నట్లు అన్నీ కలిగిన నువ్వే రావాలి అని అడుగుతున్నారు.

# 27వ పాశురము

**కూడారై వెల్లుమ్ శీర్ గోవిన్దా! ఉందన్నై**
**ప్పాడి పఱైకొణ్డు యామ్ పెఱు శమ్మానమ్,**
**నాడు పుకళుమ్ పరిశినాల్ నన్గాగ,**
**శూడగమే తోళ్ వళైయే తోడే శెవిప్పూవే,**
**పాడగమే యెన్ఱనైయ పల్ కలనుమ్ యామణివోమ్,**
**ఆడైయుడుప్పోమ్ అదన్పిన్నే పాల్ శోఱు**
**మూడ నెయ్ పెయ్దు ముళంగై వళివార,**
**కూడియిరున్దు కుళిర్ న్దేలో రెమ్బావాయ్.**

**తాత్పర్యము** – తన ఉనికిని సహించలేనట్టి శత్రువులైనట్టి వారిని జయించెడి కళ్యాణ గుణములు కల గోవిందుడా! నిన్నే కీర్తించి పఱై అను వాయిద్యమును పొంది నీచే పొందింపబడు పెద్ద సమ్మానమును లోకులందరునూ ప్రశంసించు రీతిలో నుండవలెను. అట్లే ప్రశంసించు రీతిలో చేతి కంకణములు, భుజముల ధరించు భుజకీర్తులు, కర్ణాభరణములు, కర్ణ పుష్పములు, పాదముల ధరించు అందియలు, ఇవేకాక మాకు తెలియని ఇంకనూ అనేక ఆభరణములను మేము నీచే ధరింపచేయ బడవలయును. పట్టు వస్త్రములను ధరింతుము. ఆపైన క్షీరాన్నము మునుగునట్లు పోసిన నేతిని, మోచేయి గుండా జారుచుండగా నీతో కలిసి కూర్చుని హాయిగా చల్లగా ఆరగింప చేయ బడయవలయును. ఇదే మా వ్రతఫలము.

**విశేషార్థము** – "ఆలిన్ ఇలైయాయ్" వటపత్రశాయీ అంటూ, దేనినైనా ఎలాగైనా మార్చగల భగవంతుని అమోఘశక్తిని పాడింది ఆండాళ్. లోకం కోరకుండానే ప్రళయసాగరం నుండి కాపాడటానికి వటదళశాయి అయ్యాడు స్వామి. కేవల కృపతో చేశాడాపని. అదే తమకీ ఆధారమన్నది. ఇక వీరి కోరిక తీర్చక తప్పదనుకున్నాడు. కనీసం 3 శంఖాలు కావాలన్నారు కదా! తన పాంచజన్య శంఖాన్నిచ్చేశాడు. 6వ పాశురంలో కోవెలలో ఊదే పిలుపు శంఖం ఒకటుంది కదా! అది తెప్పించి ఇచ్చాడు ఆలోచించి, పశువులు దూరంగా పోతే పిలవడానికని తన చెంగులో ధరించే కొమ్ము బూరా ఒకటుంది అదీ ఇచ్చాడు. ఇవే వీరు కోరేవి. అతని సంబంధముంటే చాలు.

'పఱై అడిగారు కదా! నేను త్రివిక్రముడిగా భూమి కొలిచినపుడు, ఆ విజయాన్ని చాటుతూ జాంబవంతుడు మ్రోగించిన ఒక ఢంకా ఇచ్చాడు'. 'పెరుం పఱై, పెద్దది

కావాలన్నారు. ఆ జాంబవంతుడే శ్రీరామ విజయాన్ని చాటుతూ, రావణవధ కాగానే మ్రోగించిన పెద్ద బాజా ఒకటుంది'. అదీ తెప్పించి ఇచ్చాడు. చాలదు 'చాలా పెద్ద పఱై గద మాక్కావాలి?' ఆలోచించాడట. 'ఆ! నేను ఘట నృత్యం చేస్తూ నడుముకు కట్టుకు తిరిగి వాయించే బాజా ఒకటుంది' అంటూ దాన్ని తెప్పించాడు. వీళ్ళ కోరిక దాన్ని గురించే కదా! పుచ్చుకున్నారు. కేవలం భక్తగోష్ఠికే మంగళం పాడే 'శఠగోపులని' పంపాడు. దీనికి, పురుషకార భూతురాలయిన 'అమ్మ'ను పంపాడు. ఆమెయే కదా 'శ్రీరంగహర్మ్యతల మంగళ దీపరేఖ' తైలం అక్కర్లేని తిరుగాడే దీపం! జెండాకు గరుడుని పంపాడు. చాందిని క్రింద ఆదిశేషుని వెళ్ళమన్నాడు. పుట్టగానే యమున దాటేటప్పుడు ఆయనే కదా పడగలతో కాపాడినది! కాని ఆదిశేషుడు వెళ్ళనన్నాడు. స్వామి ఆలోచించి, చాందినికి తన పట్టు పీతాంబరాన్నే ఇచ్చాడు. ఇదీ వీళ్ళు కోరుకునేది.

ఆండాళ్ గోష్ఠి శ్రీకృష్ణుని స్వభావం కనిపెట్టేశారు. నిన్నటి పాశురంలో కొన్ని అడిగారు. ఈరోజు మరికొన్ని సత్కారాలు అడుగుతారు. ఇక వీళ్ళేమి అడిగితే అవన్నీ చేయక తప్పదు. ఆయన స్వాధీనం తప్పింది. వీళ్ళ చేతికి లొంగిపోయాడు. భక్తపరాధీనుడు గదా! ఎదిరించిన రావణుడి దగ్గర పరాక్రమం చూపాడు కాని, దాసోహమని వచ్చిన విభీషణుని కనుసన్నల్లో 'సముద్రాన్ని శరణువేడు'అంటే ఉపవాసం చేస్తూ మరీ చేసేవాడు. ఆయనకి రాజ్యమిచ్చేవరకు తృప్తి లేక విభీషణ పట్టాభిషేకం అయ్యాక 'విజ్వరః ప్రముమోద హ' జ్వరం తగ్గి ఆనందించాడే! అంటాడు వాల్మీకి మహర్షి. దుష్టవాలిని చంపాడు కాని, లొంగివచ్చిన సుగ్రీవుడిని రక్షకుడనుకున్నాడు. చివరికాయన చేతనే పట్టాభిషేకం చేయించుకున్నాడు. రావణుడే వచ్చి ఉంటే ఆయనకే లొంగిపోయేవాడు స్వామి. మన అదృష్టం చేత శ్రీరాముడు రావణునికి లొంగిపోయేట్టు తలవంచి రాలేదు రావణుడు. ధనుస్సు పట్టి యుద్ధానికి వచ్చాడు తగుదునమ్మా యని. నాకీ పిల్లవాడు లెక్కా? చూస్తానన్నాడు పరశురాముడు. శ్రీరాముని పరాక్రమానికి జితుడై ధనుస్సు రాముని చేతిలో పెట్టి బ్రతికించమని ప్రార్థించి వెళ్ళిపోయాడు చివరికి. నిజానికి పరశురాముడు ధనుస్సు తోటే రామునికి నమస్కరించి ఉంటే శ్రీరాముడే పరశురామునికి లొంగిపోయి ఉండేవాడట.

ఈనాడు ఆండాళ్ అతని సౌలభ్య కళ్యాణ గుణాలను పాడి సాయుజ్య మోక్షాన్ని అర్థిస్తోంది. తైత్తిరీయోపనిషత్ 'సోశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితేతి' అంటూ వర్ణించింది దీనినే. పరమాత్మతో పరమ సామ్యాపత్తి నందిన జీవుడు పరమాత్మలో సమస్త కళ్యాణ గుణములను పరమాన్నము వలె అనుభవించును. ఎట్లా? శ్రీమద్భాగవతంలో శ్రీకృష్ణుడు గోపికలతో చల్దులారగించినట్లు, మన ఆండాళ్ చల్దులెందుకని అద్భుతమైన పరమాన్నము ననుభవించే ఉపనిషత్ప్రక్రియను నిరూపిస్తోంది. ఇక్కడ నుండి మూడుసార్లు 'గోవింద' అంటారు. వాని అనుగ్రహానికి ఆ పేరు చెప్తే చాలట.

''నీతో చేరని వారిని నీ గుణాలతో జయించే గోవిందా! నిన్నే పాడి 'పఱై' అనే వాయిద్యమును పొంది మేము గొప్ప సమ్మానము నందవలెను. దానిని లోకమంతా బాగు బాగని కీర్తించాలి. అందుల కవసరమైన కంకణములు, భుజకీర్తులు, కర్ణాభరణములు, కర్ణపుష్పములు, పాదాభరణములు ఇంకా ఏవో మాకంత బాగా తెలియవు. నీకు తెలిసిన ఆభరణాలన్నీ నీవు అమ్మతో కలిసి అలంకరిస్తే మేం ధరించాలి. నీవు అనుగ్రహించిన నూతన వస్త్రములు ధరిస్తాం. ఆపై పరమాన్నము నారగించాలి. ఆకలి తీరడానికి నేమీ కాదు. నీతో కలిసి మేమంతా ఆరగించాలి. అది నేతిలో మునిగి ఉండాలి. అందరూ కలిసి ఆరగిస్తూంటే మోచేతి గుండా స్రవిస్తూ ఉండేటంత భోగ్యంగా, రుచిగా ఉండాలి. కలిసి అనుభవించిన ఆ ప్రసాదము వల్ల మాలోని ఇంతకాలపు తాపములన్నీ తొలగి అందరి మనసులూ చల్లబడాలి. మళ్ళీ ఎడబాటు కలుగనట్లు చేరాలి. నోరార పాడాలి. చేతులారా సేవించాలి. మనస్సుతో ఆనందించాలి''.

ఆ అన్నమే జీవులు. ఉపనిషద్గోవులందించే పాలే భగవంతుని దివ్య కళ్యాణగుణాలు. దానిలో వీరు పూర్తిగా కలిసిపోవాలి, విడదీయలేనంతగా. అది ప్రీతివల్ల కలుగును. ఆ ప్రీతియే తీపి. పాలంతా కలిసినట్లే నేయియే స్నేహము. ప్రీతి నిండిన ఆ స్నేహమే అధికంగా ఉండి, దాని వల్ల చేసే కైంకర్యములు, మోచేతి గుండా కారునట్లు, అందరికీ దర్శనీయం కావాలి. గుణ విశిష్టుడైన భగవానునికి వీరు సేవలందించాలి. పరమాన్నము వలె, కైంకర్యరుచి నిండిన జీవులను తన ఆనందానికై పరమాత్మ అనుభవించాలి. పరమాన్నము ననుభవించు ఫలభోక్త స్వామియే కావాలి అంటారు.

భగవంతుణ్ణి అతిగా ప్రేమించి కొందరు దూరంగా ఉంటారు. ద్వేషించి కొందరు, ఉదాసీనులై కొందరు దూరమౌతారు. అతి ప్రేమ వల్ల ఆళ్వార్లు, స్వామికెక్కడ తమ దోషాలంటుతాయోనని దూరం కాబోయారు. 'గోపికలు నాకిష్టమైన వెన్న దాచి ఎంత దోషం చేశారో, మీరూ దూరమైతే అదే దోషం సుమా' అంటూ తన సౌశీల్యాది గుణాలు చూపి దగ్గరకు చేర్చుకున్నాడు. ద్వేషించిన దుర్యోధన, రావణాదులను తన శౌర్య పరాక్రమాదులతో మెప్పించి జయించాడు. ఉదాసీనులుగా ఉన్నవారిని తన సౌందర్యాదుల చేత, అర్చామూర్తిగా ఉన్నప్పుడు అలంకారములు, వీధ్యుత్సవాలు మొదలగు వాటిచేత ఆకర్షించి జయిస్తాడు. భగవంతుని గొప్ప గుణాలు అజ్ఞానులను సర్వజ్ఞులుగా మారుస్తాయట. సర్వజ్ఞుల మూర్ఛిల్ల చేస్తాయి.

ఆయన పేరు గోవిందుడు. చేసిన ఉపకారానికి కృతజ్ఞత

చెప్పుకున్నా ఫర వాలేదట. అహంకారం లేకుంటే అదే చాలనుకుంటాడట. గోవులా మాత్రం కలిగి ఉన్నాయనే వాటి వెంట పడతాడట. నాల్క ఉన్నందుకు పాడగల్గుతున్నాం మేము. దేవకీ పుత్రరత్నమా! నిన్నాశ్రయించిన వారికి ఫలం తప్పదని మేమెఱుంగుదుమంటారు వీరు. వీరు కృష్ణుడికంటే ఫలం వేరే ఏదీ కోరరు. అలాంటి వారిని తానే అమ్మతో కలిసి స్వయంగా సమ్మానం చేస్తాడు. శ్రీరామునికి ఇంద్రుడు పంపిన ముత్యాలహారం సీత మెడలో వేస్తే అది తీసి అమ్మ స్వయంగా హనుమను పిలిచి అతని కంఠసీమను అలంకరించింది. అలాంటి గౌరవం వీరు కోరేది. కృష్ణుడే పరమ ప్రయోజనము కలవారు తమకంటూ ఖ్యాతి, లాభ పూజలు కోరరు. కానీ ఆండాళ్ అవి కోరటం స్వామి కీర్తి లోకమంతా తెలియాలనే. ప్రేమించే వారికే వ్రతం ఇంత బాగా జరిగిందని ఆనందం వేయాలి. ద్వేషించే వారికి, లోకుల ప్రయోజనాలు తీరుస్తోంది గదా అని ద్వేషం తగ్గాలి. అంతా కలిసి పరస్పర భగవత్ప్రేమతో సుఖించాలని ఆండాళ్ ఆకాంక్ష. ఇలాంటి వీళ్ళని అలంకరించకుండా ఆయనుండలేడు. అంగీకరించక వీరుండలేరు. అలంకారం చేసేటపుడు క్రమం చెప్తున్నది. ముందు పాణిగ్రహణం చేయాలి. భుజములు పట్టి దరి చేర్చుకొనునపుడా భుజములు అలంకృతములౌతాయి. రాగాభివృద్ధికై ప్రణయ కలహంలో పాదం స్పృశిస్తే పాదమలంకృతమౌతుంది. వానికే సర్వాత్మనా చెంది ఉన్నపుడే దేహమున వస్త్రమే నూతనమై శోభిల్లుతుంది. అపుడనుభవించేది పరమాన్నం. ముముక్షువు తరించేటప్పుడు ఆచార్యాశ్రయణలో దీక్ష కట్టి, భుజముపై స్వామి చిహ్నములు ధరించి, సదాచరణ పాదాభరణముగ దాల్చి, చేసే కైంకర్యముతో భగవత్సాయుజ్య దివ్యానుభవం కలుగుననే ఉపనిషద్రహస్యాన్ని ఆండాళ్ ఈ నాటి సమ్మానం ద్వారా అతి సుందరంగా పాడింది. ఆభరణములు ధరించము అంటే పెట్టడు కాని బ్రతిమాలుతాడు. ప్రణయి కద! ధరిస్తామంటే చాలు ప్రీతితో అన్నీ అనుగ్రహిస్తాడని చెప్పింది.

### వేదవతి - పద్మావతి - లక్ష్మి - కరవీరలక్ష్మి - వ్యూహలక్ష్మి - అలమేలు మంగ

## వీరందరూ వేరు వేరా, లేక అందరూ ఒకరేనా?

ఈ దేవేరులందరికీ శ్రీవేంకటేశ్వర వృత్తాంతమే కేంద్ర బిందువు. ఆకాశరాజుకు పద్మములో లభించిన పద్మావతిగా పేరుపొందిన కన్య పూర్వజన్మలో వేదవతి. ఈ వేదవతి విష్ణువును భర్తగా పొందాలని తపస్సు చేసింది. అయితే తపోనిష్ఠలో నున్న ఆమెను చూచి రావణుడు మోహించి తనను వివాహమాడమని అడగగా, ఆమె తిరస్కరించగా, ఆమె జుట్టును పట్టుకుని బలాత్కరించబోతే ఆమె యోగబలముతో అగ్నిప్రవేశము చేస్తుంది. ఈమెనే 28వ కలియుగములో ఆకాశరాజు కూతురు పద్మావతిగా అవతరించి శ్రీనివాసుని వివాహమాడింది.

భృగుమహర్షి విష్ణు వక్షస్థలాన్ని కాలితో తన్నినప్పుడు కోపించిన ఆదిలక్ష్మి భూలోకానికి వచ్చి కొల్హాపురము చేరి కరివీరలక్ష్మిగా కొలువబడుతోంది. పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణానికి ఈమె కూడా వచ్చి వెళ్ళిపోయిందట. శ్రీనివాసుడు లక్ష్మి కోసము అన్వేషిస్తుంటే ఆమె కొల్హాపురము నుంచి పాతాళంలోని కపిల మహర్షి వద్దకు వెళ్ళింది. విష్ణువు ఆమె కోసం తీవ్రమైన తపస్సు చేస్తున్నాడని తెలుసుకుని, ఈమెను అనునయించి శ్రీహరి చెంతకు వెళ్ళమన్నాడు. సరేనని ఆమె దివ్యదేహముతో తిరుచానూరు పద్మసరస్సులో పద్మనాళములో ప్రవేశించి కార్తీక శుక్ల పంచమి నాడు ఆవిర్భవిస్తుంది. ఆ



వ్యూహలక్ష్మితో పాటు అక్కడ వీరలక్ష్మి కూడా అవతరిస్తుంది. ఈ వ్యూహలక్ష్మి శ్రీనివాసుని వక్షస్థలముపై నిత్యానపాయినిగా ఉన్నది. వీరలక్ష్మి తిరుచానూరులో పద్మావతిగా కొలువై ఉంది. ఈమె అలర్మేల్ మంగై అని, మనము అలమేలు మంగతాయారుగా కొలుస్తున్నాము. కనుక వీరందరూ లక్ష్మీదేవి విశిష్టాంశలే.

**శ్రీమతే రామానుజాయ నమః**

# పితరులకు ఆనంద దాయకం
# మహాలయం

: చిల్లర
సీతారామారావు

ధర్మ ప్రాధాన్యత కలిగిన దేశం భారతదేశం. ఇక్కడ ధర్మసంబంధమైన కర్మలకు అధిక ప్రాధాన్యత ఉంది. శాస్త్రానుసారం ప్రతి వ్యక్తి మూడు రుణములను కలిగి ఉంటాడు. ఆ రుణములను తప్పనిసరిగా తీర్చుకోవడం ఆ వ్యక్తి బాధ్యత. దేవరుణం, ఋషిరుణం, పితృరుణం అనునవి ఆ మూడు రుణాలు. దేవతల వల్ల మానవులకు జీవితం లభించింది. కనుక వారిని భక్తి శ్రద్ధలతో అర్చించి దేవ రుణములను తీర్చుకోవాలి. తమ ప్రవచనములు, ఉపదేశములు మున్నగు వాటిద్వారా మానవోన్నతికి సహాయపడుతున్న ఋషులను భక్తి శ్రద్ధలతో స్మరించుకుంటూ, అర్చిస్తూ వారి రుణమును తీర్చుకోవాలి.



జన్మనిచ్చిన తల్లితండ్రులు తమ సంతానం కోసం చేసే త్యాగం విలువ కట్టలేనిది. జన్మనిచ్చి, పాలిచ్చి, పోషించే తల్లితండ్రులు నిస్వార్థ భావంతో సంతానము కొరకు అనేక కష్టాలు అనుభవిస్తూ, తమ సంతానానికి, వారి జీవితానికి తగిన యోగ్యతను కల్పిస్తారు. అందువలన మహనీయులైన ఆ తల్లి తండ్రులకు శ్రద్ధాభక్తులతో సేవలు అందించాలి. వారి మరణానంతరం మహాలయ పక్షము, పితృపక్షములలో వారిని స్మరించుకుంటూ శ్రాద్ధ కర్మలాచరించి పితృరుణం తీర్చుకోవాలి. శ్రాద్ధకర్మలతో వారిని తృప్తి పరచడం వలన సుఖము, సమృద్ధి లభిస్తాయి. తల్లితండ్రుల గోత్ర నామములను ఉచ్చరిస్తూ మంత్ర పురస్సరముగా అర్పించిన అన్నము వారికి చేరుతుంది అని శాస్త్రము చెబుతున్నది. సూర్యుడు కన్యారాశిలో ప్రవేశించగానే పితరులు తమ వారిని తలుచుకుంటూ శ్రాద్ధ స్థలమునకు చేరుకుంటారు. శ్రాద్ధకర్మను నిర్వర్తిస్తే ఆనందించి దీవించి వెళతారు. శ్రాద్ధకర్మను నిర్వర్తించకపోతే దీవించడానికి బదులు శాపమునిచ్చి వెళ్ళిపోతారు. తమ పితృదేవతలకు శ్రాద్ధ కర్మ చేయని వ్యక్తికి పితృరుణ విముక్తి లభించదు. తత్ఫలితముగా అతనికి మరుసటి జన్మమున పితృదోషం తగులుతుంది. అందువలన ప్రతి వారసుడు పితరులకు శ్రాద్ధ కర్మలను నిర్వర్తించాలి.

"శ్రద్ధయాదీయతే శ్రాద్ధం"

శ్రద్ధగా చేయబడేది శ్రాద్ధం. శ్రాద్ధం గురించి పరాశర స్మృతి ఈ విధంగా పేర్కొన్నది.

శ్లో ॥ "దేశకాలేచ పాత్రేచ విఘ్నాహ విషాచమత్
తిలైర్దర్భైమంత్రేచ్ఛ శ్రాద్ధౌస్యాచ హృదయాయుతమ్"

దేశ, కాల, పాత్రాదులు పరిస్థితులను అనుసరించి పితరులకు శ్రద్ధతో తిలలు, దర్భ, నీరు సమర్పించడమును శ్రాద్ధము అంటారు. పితరులను సంతృప్తి పరచుటకై శ్రద్ధతో చేయు పూజ, తర్పణము, పిండదానం, బ్రాహ్మణ భోజనం మున్నగువాటిని శ్రాద్ధము అని అంటారు. శ్రాద్ధము అంటే పితృదేవతల పట్ల మనకు గల శ్రద్ధా భావమును వ్యక్తీకరించడమే. సూర్యుడు కన్యారాశిలో ఉన్నప్పుడు మహాలయ పక్షమునందు పదహారు రోజులు యజ్ఞము వలె పవిత్రమైనవి. ఈ పదహారు రోజులు గాని, లేదా ఏదైనా ఒక రోజు గాని పితరుల నిమిత్తము శ్రాద్ధము చేయాలి. అలా చేసినచో పితరులు సంవత్సరము వరకు సంతుష్టులవుతారని స్కాందపురాణము పేర్కొనుచున్నది.

భాద్రపద మాసము బహుళ పాడ్యమి మొదలుకొని ఆశ్వయుజ పాడ్యమి వరకు గల పదహారు రోజులను మహాలయ పక్షము అని పిలుస్తారు. మహాలయము అంటే గొప్ప వినాశము. లేదా మరణము. తమ పెద్దలు మరణించిన తిథిని బట్టి, ఆయా తిథులలో తర్పణ, శ్రాద్ధ కర్మలు చేయాలి. పితరులనుద్దేశించి చేయు శ్రాద్ధము కనుక మహాలయ పక్షమును పితృపక్షము అని అంటారు. పితృశబ్దము తండ్రిని సూచిస్తుంది. తన వంశమున మరణించిన స్త్రీ పురుషులందరూ పితరుల క్రిందనే పరిగణనలోకి తీసుకుంటారు. శ్రీకృష్ణుని కథనం ప్రకారం పితృదేవతలను పూజించేవారు పితృలోకమునకు వెళుతారు.

పితృపక్షములో పితృదేవతలను స్మరించుకుంటూ వారికి శ్రాద్ధ కర్మలు చేయాలి.

శ్లో ॥ "సంస్కృత వ్యంజనాద్యంచ పయోదధి ఘృతాన్వితమ్
శ్రద్ధయాదీయతే యస్మాత్ శ్రాద్ధం తేన ప్రకీర్తితామ్"

వండిన స్వచ్ఛమైన పక్వాన్నము, పాలు, పెరుగు, నెయ్యి మొదలగు వాటిని శ్రద్ధతో పితృదేవతలకు సమర్పించాలి. దీనినే శ్రాద్ధము అంటారు. దేశ, కాల, పాత్రానుసారం నువ్వులు, దర్భలు, జలముతో ఇవ్వబడిన దానము శ్రద్ధగా తీసుకోబడుతుంది. శాస్త్రోక్తముగా విద్యుక్తముగా పితరులను సంతృప్తి పరచడానికి ఇవ్వబడిన దానమే శ్రాద్ధము. పితృపక్షములో తర్పణములిస్తే పితరులు సంతృప్తి చెందుతారు. పితృదేవతలకు తర్పణములు విడవడము వలన లభించు ఫలితము ఎంతో ఉన్నతమైనదని మహర్షుల ఉక్తి. పితృదేవతల ప్రీతి కొరకు అర్పించు తిలాంజలిని తర్పణము అని అంటారు. తర్పణములను ఇంటి బయట ఆవరణ యందు గాని, తులసికోట దగ్గర గాని విడవాలి.

శ్లో ॥ "ఆయుః ప్రజాః ధనం విద్యా స్వర్గం మోక్షం సుఖానిచ
ప్రయచ్ఛంతి తదా రాజ్యం పితరః శ్రాద్ధ తర్పితాః"

పితరులు శ్రాద్ధకర్మకు సంతృప్తి చెంది, శ్రాద్ధకర్తకు దీర్ఘాయువు, సత్సంతానము, ధనము, విద్య, సమస్త భోగభాగ్యాలు, మరణానంతరం స్వర్గం, మోక్షం లభించాలని దీవిస్తారు. పితరుల దీవెనల వల్ల శ్రాద్ధకర్త పితృ ఋణమునుండి విముక్తులవుతాడు.

సంవత్సరమునకు పన్నెండు అమావాస్యలు వస్తాయి. ఈ అమావాస్యలలో శ్రేష్ఠమైనది మహాలయ అమావాస్య. మహాలయ అమావాస్య నాడు పితరులకు శ్రాద్ధము చేసినప్పుడు, తర్పణ సహితముగా చేయాలి. పితృదేవతలకు తర్పణములను అన్ని వర్ణాలవారూ గతించిన తమ తల్లి తండ్రులకు ఉత్తమ గతులు లభించాలని కోరుకుంటూ విడవవచ్చును. అమావాస్య నాడు శ్రాద్ధము చేయడం వలన సమస్త లాభములు కలుగుతాయి. ఇహ లోకమున సమస్త కోరికలు నెరవేరుతాయి. మరణానంతరం స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. అమావాస్యనాడు తల్లితండ్రులు మరణించిన తిథిని తెలియనివారు కూడా శ్రాద్ధకర్మ లాచరించవచ్చును. అమావాస్య నాటి శ్రాద్ధకర్మకు పితరులు సంతుష్టులవుతారు.

శాస్త్రము ననుసరించి శ్రాద్ధము రెండు రకాలు. మొదటిది తిథి శ్రాద్ధము. రెండవది పార్వణ శ్రాద్ధము. వ్యక్తి మరణించిన తిథి నాడు ప్రతి సంవత్సరము చేయు శ్రాద్ధము తిథి శ్రాద్ధము. పితృపక్షములో జరుపు శ్రాద్ధము పార్వణ శ్రాద్ధము. శ్రాద్ధకర్మ లాచరించడం వలన మానసికానందము కలుగుతుంది. సుఖశాంతులు లభిస్తాయి. శ్రాద్ధకర్మల రోజున దానములు చేయడము పుణ్యప్రదాయకము. శ్రాద్ధకర్మల వలన మేఘములు వర్షిస్తాయి. పంటలు బాగా పండుతాయి. శ్రాద్ధ కర్మల వలన బ్రాహ్మణులు సంతృప్తి చెందుతారు. అతని ద్వారా పితృదేవతలకు తృప్తి లభిస్తుంది. పితరులకు పుత్రుల ద్వారా నిర్వర్తించబడిన శ్రాద్ధము ద్వారా భోజనం లభిస్తుంది. శ్రాద్ధము నిర్వర్తించిన వారికి ఆయువు, బలము, కీర్తి, విద్య, మరణానంతరము ఉత్తమ గతులు ప్రాప్తిస్తాయని స్కాందపురాణం పేర్కొనుచున్నది.

మహాలయ పితృపక్షములలో పదహారు రోజులు శ్రాద్ధకర్మలను ఆచరించాలి. ఈ పదహారు రోజులు నిత్యము శ్రాద్ధకర్మలను ఆచరించడం వలన లభించు ఫలితములను బ్రహ్మ, వాయు పురాణములు ఈవిధముగా తెలియజేస్తున్నాయి. పాడ్యమినాడు శ్రాద్ధ కర్మ లాచరించడం వలన ధనసంపద, ద్వితీయనాడు శ్రాద్ధకర్మ లాచరించడం వలన రాజు (అధిపతి), తృతీయ నాడు శ్రాద్ధకర్మ లాచరించడం వలన శత్రు నాశనము, చతుర్థి నాడు శ్రాద్ధకర్మలు ఆచరించడం వలన ధర్మప్రాప్తి, మనో రథములు నెరవేరుట, శత్రువ్యూహము అవగతమగుట,

పంచమినాడు శ్రాద్ధకర్మ ఆచరించుట వలన లక్ష్మీదేవి అను గ్రహము, పుత్రార్థులకు పుత్ర సంతానము, షష్ఠినాడు శ్రాద్ధకర్మలు చేయడం వలన దేవతలు, పితరుల అనుగ్రహ ప్రాప్తి, సమాజమునందు గౌరవ ప్రతిష్ఠలు, సప్తమినాడు శ్రాద్ధకర్మలాచరించడం వలన యజ్ఞఫల ప్రాప్తి, అష్టమినాడు శ్రాద్ధకర్మలు ఆచరించడం వలన సకల సౌభాగ్యాలు, ధనప్రాప్తి, మంచిబుద్ధి, నవమినాడు శ్రాద్ధము చేయడం వలన అమితమైన సంపదలు, అనుకూలవతియైన భార్య, దశమినాడు శ్రాద్ధము చేయుట వలన శ్రీమహాలక్ష్మి అనుగ్రహ ప్రాప్తి, పశుసంపదాభివృద్ధి, ఏకాదశి నాడు శ్రాద్ధకర్మలాచరించడం వలన సర్వపాపముల నుండి విముక్తి, వేదజ్ఞాన ప్రాప్తి, కుటుంబాభివృద్ధి, ద్వాదశినాడు శ్రాద్ధ కర్మలాచరించడం వలన రాష్ట్రాభివృద్ధి, నిత్య జయము, అన్నపానాదులకు లోటు లేకపోవడము, త్రయోదశినాడు శ్రాద్ధకర్మలాచరించడం వలన ధనప్రాప్తి, పశుసంపద, పుష్టి, దీర్ఘాయువు, మేధ ప్రాప్తిస్తాయి. చతుర్దశి, అమావాస్య నాడు యుక్తవయసులో మరణించినవారికి, హతాన్మరణము చెందినవారికి శ్రాద్ధకర్మలాచరించాలి.

గయ, ప్రయాగ, గంగ, కురుక్షేత్రము, నర్మద, శ్రీపర్వతము, ప్రభాసము, సాలగ్రామ తీర్థము (గండకి), కాశీ, గోదావరి, పురుషోత్తమ క్షేత్రము మున్నగు తీర్థములు శ్రాద్ధ కర్మలకు ఉత్తమమైనవి.

**శ్లో ॥ అర్చితానాయ మూర్తానాం పితౄణాం దీప్త తేజసామ్**
**నమస్యామి సదా తేషాం ధ్యానినాం దివ్య చక్షుషామ్"**

పూజ్యులు, త్రిమూర్తులు, అత్యంత తేజోవంతులు, ధ్యానులు, దివ్యదృష్టి సంపన్నులు అయిన పితరులకు నమస్కారం.

మహాలయ పక్షము, పితృపక్షములలో తల్లితండ్రులకు శ్రాద్ధకర్మలు నిర్వర్తించి, పితృ రుణమును తీర్చుకుంటూ, జీవితమును సార్థకము చేసుకుందాము.

# 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ







శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో తిరుమల శ్రీవేంకటేశ్వరునికి తేది 16-08-2025 గోకులాష్టమి నాడు 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ జరిగింది. తేది 15-08-2025 నాటి సాయంత్రం ఈ జపమును అలిపిరి పాదాల మండపం పైన స్వామివారి పాదాలకు సమర్పించి, జపం వ్రాసిన వారి కోరికలను తీర్చుమని ప్రార్థించి సమర్పించడం జరిగింది. ఆ తరువాత గోకులాష్టమి నాడు తేది 16-08-2025 ఉదయం టిటిడి డైరీఫాంలో గల శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం వద్ద జప హోమాదులు నిర్వహించాము. టిటిడి ఈఓ శ్రీమాన్ జె.శ్యామలరావు గారు యజ్ఞ పూర్ణాహుతి కావించి, జపం వ్రాసిన వారి కోరికలు తీర్చమంటూ మరోసారి ప్రార్థించి స్థూపంలో సమర్పించారు. ఆ తరువాత 24వ పర్యాయంగా 7 కోట్ల జపానికి శ్రీకారం చుట్టి వెళ్ళిపోయారు. ఆ తరువాత భక్తులు తలా కొంత జపాన్ని స్థూపంలో సమర్పించుటతో కార్యక్రమం ముగిసింది.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 369. నాగ్నజితీ విభవే నమః

నగ్నజిత్తు కోసల దేశపు రాజు. ఇతని కుమార్తె నాగ్నజితి. ఈమెకు సత్య అను పేరు కలదు. ఆమె మిక్కిలి సౌందర్యవతి. నగ్నజిత్తు దగ్గర వాడి అయిన కొమ్ములు గల ఏడు ఎద్దులు కలవు. అవి మిక్కిలి మదించి యున్నవి. వీరుల వాసన సోకినంతనే అవి కయ్యమునకు కాలు దువ్వుచు వారి మీదికి విజృంభించుచుండును. వాటిని భుజబలముతో పట్టుకొని కట్టివేసిన వానికి నా కుమార్తెను ఇచ్చి వివాహము చేయుదునని నగ్నజిత్తు ప్రకటించెను. ఆమెను వివాహమాడుటకై పెక్కుమంది రాజకుమారులు కోసలపురికి వచ్చి (దీనికే అయోధ్య అని మరొక పేరు కలదు) ఆ ఎద్దులను పట్టుకొనలేక విఫలులై సిగ్గుతో మరలి వెళ్ళిరి.

తన వృషభములను జయించిన వానికి రాజకుమారి యగు నాగ్నజితి భార్య యగును అను వార్త విని కృష్ణుడు మిక్కిలి సౌందర్యవతి యగు నాగ్నజితిని వివాహమాడదలచి కోసలదేశపు రాజధాని అయోధ్య చేరినాడు. కృష్ణుని రాకకు నగ్నజిత్తు సంతోషించి స్వాగత మర్యాదలు జరిపినాడు. రాజు చేసిన అతిథి మర్యాదలకు సంతుష్టుడైన కృష్ణుడు రాజా! నేను నీ మైత్రిని గోరుచు నీ కుమార్తె యగు నాగ్నజితిని అర్థించుచున్నాను అని అన్నాడు. అందుకు నగ్నజిత్తు రాజా కృష్ణా నా కన్యను కోరువారు పెక్కురు కలరు. కాని వారిలో నీ యంతటి వీరుడు, గుణవంతుడు ఎవడున్నాడు? కాని కృష్ణా! నా కన్యను కోరువారిలో శౌర్య పరాక్రమములను పరీక్షించుటకై నేను ఒక ప్రతిజ్ఞ చేసి యున్నాను. అది ఏమనగా నా వద్ద ఏడు ఎద్దులు కలవు. అవి మిగుల పొగరుబోతువి. మదించినవి. వీటిని నిగ్రహించటం అసాధ్యము. వీటిని అదుపు చేయుటకై పెక్కురు రాజకుమారులు ప్రయత్నించి భంగపడిరి. కృష్ణా! నీవు ఈ వృషభములను నిగ్రహించినచో నా కుమార్తె నాగ్నజితికి నీవే తగిన వరుడవు కాగలవు అని పలికినాడు.


నగ్నజిత్తు ప్రతిజ్ఞను వినిన పిమ్మట కృష్ణుడు ఉత్తరీయమును నడుముకు బిగించి, సులభముగా వాటిని పట్టుకొన్నాడు. అంత ఆ వృషభముల గర్వమంతయు అణగిపోయెను. అవి బలహీనములయ్యెను. అప్పుడు కృష్ణుడు వాటిని త్రాళ్ళతో బంధించి వాటిని అనాయాసముగా లాగెను. పిమ్మట కృష్ణుని శౌర్య సాహస పరాక్రమములకు నగ్నజిత్తు విస్మితుడై తన కుమార్తె నాగ్నజితిని కృష్ణునికి సంతోషముతో సమర్పించినాడు. నాగ్నజితి చిరకాలము నుండియు కృష్ణుడు తనకు భర్త యగుటకై అభిలాష పడుచుండెను. ఆమె కోరిక నేటికి నెరవేరింది. నగ్నజిత్తు కృష్ణ నాగ్నజితులకు వైభవముగా వివాహము చేసి అనేక కానుకలతో నవ వధూ వరులను వీడుకొలిపి ధన్యుడైనాడు.

**అర్థో హి కన్యా పరకీయ ఏవ**
**తామద్య సంప్రేష్య పరిగ్రహీతుః**
**జాతో మమాయం విశదః ప్రకామం**
**ప్రత్యర్పిత న్యాస ఇవాంత రాత్మా**

కన్య ఎప్పటికీ పరకీయ. పరుల సొమ్ము. ఆడబిడ్డ. ఈడ బిడ్డ కాదు. ఇల్లడ (దాపుడు ధనము). ఆ ధనమును జాగ్రత్తగా కాపాడి తగిన వరుడు లభించినపుడు గృహస్థుడు ఆ ఇల్లడను వానికి అప్పగించి ప్రశాంతిని పొందినట్లు నగ్నజిత్తు తన కుమార్తెను – సత్యను – కృష్ణునికి అప్పగించి ప్రశాంతిని పొందినాడు. నాగ్నజితి జన్మనామము సత్య.

నాగ్నజితి భర్తయైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

## 370. కిరీట కుండల ధరాయ నమః

తన హోదాకు తగిన కిరీటమును, కుండలములను ధరించినవాడు కృష్ణుడు.

కిరీట కుండలధారియైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 371. కల్ప పల్లవ లాలితాయ నమః

కల్పవృక్షపు క్రొత్త చిగుళ్ళతో లాలింపబడినవాడు విష్ణువు. విష్ణుదేవునికి కల్పవృక్షమునకు అవినాభావ సంబంధము కలదు. కల్పవృక్షము ఆశ్రితుడు కోరిన వస్తువులిచ్చెడు దేవ వృక్షము. ఈ కల్ప వృక్షములు అయిదు దేవలోకమున కలవు. అవి 1. మందారము 2. పారిజాతము 3. సంతానము 4. కల్పవృక్షము 5. హరి చందనములు.

కల్పవృక్షము పాల సముద్ర మథనములో పుట్టింది.

''ఛాయాయాం పారిజాతస్య హేమ సింహాసనోపరి ఆసీన మంబుద శ్యామం'', ''వైదేహీ సురద్రుమతలే హైమే మహా మంటపే'' ఇత్యాది ధ్యాన శ్లోకములు విష్ణు దేవునికి కల్పవృక్షమున గల సంబంధమును తెలుపుచున్నవి. వీటి వలన విష్ణుదేవుడు కల్పవృక్షపు నీడలో కూర్చుని యుండు వాడని తెలియుచున్నది. గజేంద్రుడు శరణాగతి చేసి ఆర్తనాదము చేసినపుడు విష్ణుదేవుడు మందార కల్పవృక్ష వనములోని సరమున ఉన్నాడు.

అన్ని విష్ణు దేవాలయ ఉత్సవములందు కల్పవృక్ష వాహన ఉత్సవము తప్పక జరుగును. కల్పవృక్షము తన నీడలో కూర్చుని యుండు విష్ణువును మిక్కిలి ఆదరముతో లాలించునని భావము.

కల్పవృక్ష లాలితుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

ఈ నామముచే కృష్ణుడు సత్యభామ కోరికను మన్నించి దేవలోకము నుండి పారిజాత కల్పవృక్షమును భూమికి తెచ్చి ద్వారకలో సత్యభామ గృహము యొక్క పెరటిలో నాటి ఆమెను లాలించిన సంగతి వ్యంజితము.

## 372. మిత్రవిందాధిపాయ నమః

మిత్రవింద అవంతీ దేశాధీశుని చెల్లెలు. ఈమె స్వయంవరమున కృష్ణుని వరించి వివాహం చేసుకొన్నది. కృష్ణుని అష్ట మహిషులలో మిత్రవింద అయిదవ మహిషి.

మిత్రవిందాధిపుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 373. అభయాయ నమః

భయము లేనివాడు. అభయుడు. ఆశ్రితులకు భయము లేకుండా చేయువాడు కృష్ణుడు – విష్ణువు. అభయుడు అయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 374. స్వమూర్తి కేళి సంప్రీతాయ నమః

''అజాయ మానో బహుధా విజాయతే'' అన్నట్లు పుట్టుక లేని వాడయినను (అభవుడు అయినను) విశ్వ కళ్యాణము కొరకు దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకై అవతరించిన నానా మూర్తులతో కేళి సలుపుతాడు. అట్లు చేసి సంతోషించువాడు విష్ణువు.

స్వమూర్తి కేళి సంప్రీతుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

ఆ వీర్యవంతుణ్ణి, ఆ వాయుపుత్రుణ్ణి అలా తాళ్ళతో కట్టారో లేదో బ్రహ్మాస్త్ర బంధం వదిలిపోయింది. వేరొక బంధం వేస్తే ఆ అస్త్ర శక్తి పోతుంది. ఆ బంధం పోయిందని గ్రహించాడు ఇంద్రజిత్తు. తన శక్తి వృథా. తన ఘనకార్యం వృథా. అంతా బూడిదలో పోసిన పన్నీరైందనుకున్నాడు ఇంద్రజిత్తు. రాక్షసులు బుద్ధిహీనులు. వానరుడు తాళ్ళని తెంచుకోగలడు. మనపై దాడి చేయగలడు. అపుడు కర్తవ్యం ఏమిటి – ఆలోచనలో పడ్డాడు ఇంద్రజిత్తు.

బ్రహ్మాస్త్ర బంధం నుంచి విముక్తి లభించిందని తెలుసుకున్నాడు హనుమంతుడు. ఏమీ తెలియని వాడిలా ఉన్నాడు. రాక్షసులు కట్టెలు తెచ్చారు. కొడుతున్నారు. పిడికిళ్ళతో పొడుస్తున్నారు. రావణుని దగ్గరకు లాక్కుపోతున్నారు. రాక్షస రాజును చూడొచ్చు – అది ఆంజనేయుని సంకల్పం. అందుకే బాధల్ని సహిస్తున్నాడు.

అది సభా భవనం. సపరివారంతో ఉన్నాడు రావణుడు. ఇంద్రజిత్తు నడిచాడు. తండ్రిని చూశాడు. హనుమని చూపించాడు.

'అశోకవనం ధ్వంసం చేసింది వీడే' – అన్నాడు రావణునితో. చూశారు సభలోని రాక్షసవీరులు.

ఇతడెవరు? ఎవరివాడు? ఎక్కడనుంచి వచ్చాడు? ఎందుకు వచ్చాడు? వచ్చిన పనేమిటి? ఎవరిని ఆశ్రయించి వచ్చాడు? పరస్పరం చర్చించుకుంటున్నారు.

మరికొందరు తమలో తాము అనుకొంటున్నారు ''చంపాలి వీణ్ణి. కాల్చాలి. తినాలి''.

అందరినీ చూశాడు హనుమంతుడు. రాక్షసరాజుని పరిశీలనగా చూశాడు. కన్నులు ఎర్రబారి ఉన్నాయి. రోషంతో ఉన్నాడు. గుడ్లురుముతున్నాడు. రావణుని పాదాల సమీపంలో ఉన్నారు సచివులు. వాళ్ళు వృద్ధులు. చూశాడు వాళ్ళని. వానరుని వివరాలు తెల్సుకోండి – ఆదేశించాడు రావణుడు.

## రావణుడు

అశోకవనం పాడు చేస్తే – రావణుడే వస్తాడనుకున్నాడు హనుమంతుడు. అతడే తనని పిలిపించుకున్నాడు కదా – ఔరా అన్నట్లు ఆశ్చర్యపోయాడు మారుతి. చూశాడు రావణుణ్ణి. రోషం వచ్చింది. కన్నులెర్ర చేశాడు.


రావణుని కిరీటం చూశాడు. అది బంగారుతో చేయబడింది. మేలిముత్యాలు చుట్టబడి ఉన్నాయి. ధగధగ లాడుతోంది కిరీటం. జాతి వజ్రాలు, మణులు పొదిగిన స్వర్ణాభరణాలు చిత్ర విచిత్రంగా ఉన్నాయి. వెల కట్టలేని పట్టువస్త్రం ధరించాడు. ఎర్రచందనపు పూతలున్నాయి శరీరమంతా. విశాలనేత్రాలు భయంకరంగా కనిపిస్తున్నాయి. దర్శనీయంగా ఉన్నాడు. పదునైన పలువరుస

తళ తళ లాడుతోంది. పెదవులు వేలాడుతున్నాయి. పది తలలతో ఉన్నాడు. మందర పర్వతంలా తేజరిల్లుతున్నాడు. నల్లని కాటుక కొండలా ఉన్నాడు. వక్షః స్థలంలో ముత్యాల హారాలు, రత్నాల హారాలు వేలాడుతున్నాయి. కొంగలు కమ్మిన నల్లని మేఘంలా ఉన్నాడు. చందన చర్చలు చేసిన భుజకీర్తులు, దండ కడియాలు అలంకరించబడి ఉన్నాయి. అయిదు తలల పాముల్లా ఉన్నాయి చేతులు. స్ఫటిక మణులు, నవరత్నాలు పొదిగిన కంబళి సింహాసనం మీద పరచబడి ఉంది. దాని మీద కూర్చుని ఉన్నాడు రావణుడు. అందమైన భామలు సింహాసనం చుట్టూ నిలుచుని ఉన్నారు. వింజామరలు చేతపట్టారు. రాక్షస రాజుకి సేవలు కావిస్తున్నారు.

దుర్ధర్షుడు, ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, నికుంభుడు – నలుగురు మంత్రులు. బలదర్పితులు. మంత్రాంగ నిపుణులు. రావణుని చుట్టూ చేరి ఉన్నారు. నాలుగు సముద్రాల మధ్య భూమండలంలా – దేవతల మధ్య దేవేంద్రునిలా – మేరు శిఖరంలా – ఆకాశంలోని నీలమేఘంలా ఉన్నాడు రావణుడు.

రాక్షసులు తనని బాధిస్తున్నా రావణుని చూశాడు హనుమంతుడు. పరమాశ్చర్య పడ్డాడు. అతని తేజస్సుకి ఆకర్షితుడైనాడు. ఆలోచించాడు.

**అహో! రూప మహోధైర్యమ్ అహో సత్త్వ మహోద్యుతిః |**
**అహో రాక్షస రాజస్య సర్వలక్షణ యుక్తతా ||**



ఆహా ఏమి రూపం. ఏమి ధైర్యం. ఏమి బలం. ఏమి తేజస్సు. ఈ రాక్షస రాజు సర్వ లక్షణ శోభితుడు. వీడిలో అధర్మం లేకపోతే ఇంద్రునితో కూడా ముల్లోకాలని ఏలగలవాడు. వీడు చేసిన పనులు భయంకరం. హింసాత్మకం. లోకనింద్యం. ఆ పనులతో దేవతలు, దానవులు, సర్వలోకాలు భయపడుతున్నాయి. వీడికి కోపం వస్తే సర్వ జగత్తుని సముద్రంలో ముంచేట్లు ఉన్నాడు. ప్రళయం సృష్టించేట్లు ఉన్నాడు. నిజంగా వీడు అంతటి సమర్థుడే – అలా ఆలోచించాడు హనుమంతుడు.

## ప్రహస్తుని ప్రశ్నలు

గోరోజన రంగు కన్నులున్నవాడు హనుమంతుడు. లోకాల్ని ఏడిపించే రావణుడు చూశాడతణ్ణి. కోపోద్రిక్తుడైనాడు. అయితే మహా తేజోవంతునిగా ఉన్నాడు కపీశ్వరుడు. వెంటనే సంశయచిత్తుడైనాడు. ఆలోచించసాగాడు.

పూర్వం కైలాసం వెళ్ళాను నేను. పరమేశ్వరుని దర్శనం కాలేదు. కోపించాను. కైలాస పర్వతాన్ని కదిలించాను. అపుడు చూశాడు నందీశ్వరుడు. శపించాడు నన్ను. ఆ నందీశ్వరుడే ఈ వానర రూపిగా వచ్చాడా? సాక్షాత్ నందీశ్వరునిలా ఉన్నాడు. లేదా బాణాసురుడు ఈ రూపంలో వచ్చి ఉండొచ్చు.

అయినా మనసు దిటవు చేసుకున్నాడు రావణుడు. చూశాడు ప్రహస్తుణ్ణి. అంటున్నాడు "వీడు దురాత్ముడు. ఎక్కడి నుంచి వచ్చాడు? ఎందుకు వచ్చాడు? కారణమేమిటి? వనభంగం చేశాడు. రాక్షస స్త్రీలని భయపెట్టాడు. వీడి ఉద్దేశమేమిటి? ఈ దుర్మతిని అడిగి తెలుసుకో. లంకా నగరానికి ఎలా వచ్చాడు? ఎందుకు యుద్ధం చేశాడు తెల్సుకో.

ఒక వానరునితో మాట్లాడటం – తనలాంటి రాజుకు తగదని భావించాడు రావణుడు. అందుకే ప్రహస్తుణ్ణి అడగమంటున్నాడు. కాని నేరుగా రావణునికే బదులిస్తున్నాడు హనుమంతుడు.

విన్నాడు ముఖ్య సచివుడు ప్రహస్తుడు. రాజాజ్ఞ అనుసరించాడు. అడుగుతున్నాడు "వానరా! ఊరడిల్లు. భయపడకు. నీకు శుభం కలుగుతుంది. నిన్నెవరు పంపారు? ఇంద్రుడా, కుబేరుడా, యముడా, వరుణుడా? వాళ్ళు కాదంటావా? మరి విష్ణువు పంపిన దూతవా? నీ రూపం చూస్తే వానరుడవే. అయితే ఇంత అద్భుత తేజస్సు ఉంది నీలో. అది వానరులకి ఉండదు. ఈ లంకాపురికి ఎందుకు వచ్చావు? ఎవరు పంపినా సరే నిన్నేమీ చేయం. భయపడకు. నిజం చెప్పు. నిన్ను వదిలేస్తాం. అబద్ధం చెబితే నీ ప్రాణాలు దక్కవు".

విన్నాడు హనుమంతుడు. చెబుతున్నాడు. "ఇంద్ర యమ వరుణులు ఎవ్వరూ పంపలేదు. కుబేరుని మిత్రుణ్ణి కాదు. విష్ణు దూతను కాదు. నేను నిజంగా వానర జాతి వాణ్ణి. నాకు నేనే లంకకు వచ్చాను. నీ కోసం వచ్చాను. నీవు రాజువి. నీ దర్శనం

దుర్లభం. అందుకే వనం పాడు చేశాను. రాక్షసులు నాతో యుద్ధం చేశా రు. ఆత్మరక్షణ కోసం నేను పోరాడాను. యుద్ధంలో వాళ్ళు చనిపోయారు. ఏ అస్త్రం, ఏ పాశం నన్ను బంధించదు. ఏ అస్త్రమైనా నన్ను బాధించదు. అది నాకు బ్రహ్మదేవుడు ఇచ్చిన వరం. రాక్షసరాజుని చూడాలని ఆశ. అందుకే బ్రహ్మాస్త్రానికి లొంగాను. ఎపుడో అస్త్ర బంధం విడిపోయింది. అయినా రాక్షసులు కొట్టారు. సహించాను. కేవలం నిన్ను చూడాలని వచ్చాను. నేను ఒక రాజ కార్యం కోసం వచ్చాను. అమిత తేజోవంతుడు, అప్రమేయ బలుడు రాముడు. ఆ రాముడు నన్ను దూతగా పంపాడు. నీకు హితం చెబుతాను విను.



## హనుమ హితవు

మహాబలుడు రావణుడు. చూశాడు హనుమంతుడు. దశాననునితో అంటున్నాడు. అతని గొంతులో తొట్రుపాటు లేదు. స్వరంలో శాంతం తొంగి చూస్తోంది.

రాజా! సుగ్రీవుడు నీకు సోదర సమానుడు. ఆ వానర రాజు నీ క్షేమ సమాచారాలు అడిగాడు. అతడు పంపగా వచ్చాను. సుగ్రీవుని సందేశం విను. అది ధర్మ సమ్మతం. శ్రేయోదాయకం. దశరథుడు ఒక మహారాజు. ఇంద్రునిలా తేజశ్శాలి. లోకబంధువు. ఆ రాజు పెద్ద కొడుకు రాముడు. ధర్మ మార్గానువర్తనుడు. తండ్రి గారికి చాలా ఇష్టుడు. పిత్రాజ్ఞానుసారం దండకారణ్యానికి చేరాడు. అతని తమ్ముడు లక్ష్మణుడు. భార్య సీత. ఇద్దరూ రాముణ్ణి అనుసరించారు.

సీతాదేవి మహాసాధ్వి. ఆమె విదేహరాజు జనకుని కూతురు. దండకలో అపహరింపబడిందామె. సీతను వెతుకుతున్నారు అన్నదమ్ములు. అలా ఋష్యమూక పర్వతం దగ్గరికి వచ్చారు. సుగ్రీవునితో కలిశారు. సీతాదేవిని వెతికిపెడతాను – అది సుగ్రీవుని ప్రతిజ్ఞ. వానర రాజ్యానికి నిన్ను రాజుని చేస్తాను – అది రాముని ప్రతిజ్ఞ. వాలి సుగ్రీవులు యుద్ధం చేస్తున్నారు. వాలిని చంపాడు రాముడు. సుగ్రీవుని రాజుని చేశాడు. వాలి నీకు తెల్సు. ఆ బలశాలి వాలిని ఒక్క బాణంతో చంపాడు రాముడు.

సత్య ప్రతిజ్ఞుడు సుగ్రీవుడు. సీతాన్వేషణకు వానరులను పంపాడు. దశ దిశల్లో ఆమెను వెదుకుతున్నారు. అందులో నేను ఒకణ్ణి. నా పేరు హనుమంతుడు. వాయుదేవుని పుత్రుణ్ణి. నూరు యోజనాల సముద్రం దాటాను. ఇక్కడికి వచ్చాను. వెదికాను. సీతాదేవిని చూశాను. నీ రక్షణలో ఉందామె.

నీవు ధర్మార్థాలు తెలిసినవాడవు. తీవ్ర తపస్సు చేశావు. వరాలు పొందావు. మహా ప్రాజ్ఞుడవు. పర భార్యలను బంధించడం తగదు నీకు. అది ధర్మవిరుద్ధమైన పని. అధర్మ కార్యాల వల్ల అపాయాలు సంభవిస్తాయి. అపాయాలు రావటమే కాదు నీ సర్వస్వాన్ని సమూలంగా నాశనం చేస్తాయి.

రాజా! రామునికి కోపం వస్తే లక్ష్మణుడు కోపోద్రిక్తుడవుతాడు. అన్నదమ్ముల కోపాగ్ని బాణాలకు ఎవ్వరూ నిలువజాలరు. రామునికి అపరాధం చేసినవాడు సుఖపడటం ఉత్తది. నీవు చేసింది పాడుపని. అది అధర్మం – అని నీతో చెప్పమన్నాడు సుగ్రీవుడు. అందుకే పంపాడు నన్ను. ఆలోచించుకో. సీతాదేవిని రామునికి సమర్పించు.

సీతా దర్శనం నాకు లభించింది. అది నా అదృష్టం. నేను వెళ్తాను. రామునికి చెప్తాను. మిగిలిన పని రాముడే చేస్తాడు. సీతమ్మ శోక పరాయణగా ఉంది. ఆమె నీ వశంలో ఉందనుకున్నావు. ఆమె నీ ప్రాణాలు తీసే తాచుపాము అని తెల్సుకోలేకున్నావు. జఠరాగ్ని బాగా ఉందిలే అని విషాన్నం తింటే జీర్ణం కాదు. ఆలోచించుకో. దేవాసురులెవ్వరూ ఆ సాధ్విని స్వాధీనం చేసుకోలేరు.

రాజా! నీవు ధర్మాన్ని ఆచరించావు. అనేక కష్టాలకి ఓర్చావు. తపస్సు చేశావు. ఫలితంగా చావులేని వరం పొందావు. ఆ వరాన్ని చేతులారా నాశనం చేసుకోవద్దు. ఆ వరం ఉందని గర్వపడుతున్నావు. సుగ్రీవుడు దేవత కాదు. అసురుడు కాదు. రాక్షసుడు కాదు. దానవుడు కాదు. యక్షుడు కాదు. గంధర్వుడు కాదు. పన్నగుడు కాదు. వానర మాత్రుడు. సుగ్రీవునితో నీకు చావు తప్పదు. దాన్నెలా తప్పించుకుంటావో చెప్పు.

రాజా బాగా విను. ధర్మం అధర్మాన్ని హతమారుస్తుంది. కాని అధర్మం ధర్మాన్ని జయించదు. నీ తపో ఫలాన్ని, సత్కర్మ

ఫలాన్ని, ధర్మ ఫలాన్ని ఇపుడు అనుభవిస్తున్నావు. అతి త్వరలో అధ ర్మ ఫలాన్ని అనుభవిస్తావు. తప్పదు. అయితే ఏకకాలంలో అనుభవిస్తానంటే కుదరదు. ధర్మఫలం మరణం లేకపోవటం. చంపబడటం అధర్మఫలం. వెంటాడుతుంది నిన్ను. అయితే సీతమ్మను రామునికి అర్పించు. రాముణ్ణి శరణు పొందు. అపుడు అధర్మఫలం నశిస్తుంది. ఆలోచించుకో.

రాజా! జనస్థానంలో రాక్షసులు ఏమైనారు? రాముడు ఒక్కడే వాళ్ళని చంపాడు. వాలిని ఒక్క బాణంతో చంపాడు రాముడు. అది తెల్సుకో. రామ సుగ్రీవుల స్నేహం తెల్సుకో. నీవు ఏమవుతావో ఆలోచించుకో.

రాజా! నీ గుర్రాలు, నీ ఏనుగులు, నీ రథాలు, నీ లంక అన్నింటిని నేను ఒక్కణ్ణే చాలు – నాశనం చేస్తాను. కాని రామాజ్ఞ లేదు. సీతాపహరణం చేసినవాణ్ణి నేనే చంపుతాను – అ రాముని ప్రతిజ్ఞ. అది కూడా మా వానర భల్లూకాల ముందు శపథం చేశాడు. అందుకే నీ జోలికి రాను నేను. రామునికి అపకారం చేస్తే – వాడు సాక్షాత్తు ఇంద్రుడైనా ఉండటం ఉత్తది. ఇక నీలాంటి వాడి మాట చెప్పాలా? సీతాదేవి ఎవరనుకున్నావు? నిన్ను, లంకారాజ్యాన్ని నాశనం చేసే కాళరాత్రి. అది తెల్సుకో. సీత స్వరూపంలో ఉన్న కాలపాశాన్ని నీకే నీ మెడకు చుట్టుకున్నావు. అది తెల్సుకో. ఇక నీ క్షేమం ఎలానో ఆలోచించుకో.

సీతాదేవి తేజస్సు మండుతోంది. రాముని కోప జ్వాలలు దానికి తోడైతే ఇంకా ప్రజ్వలిస్తాయి. బురుజులతో వీధులతో ఉన్న లంకాపురి దగ్ధమవడం చూస్తావు నీవు. నీ మంత్రులు, మిత్రులు, ఆత్మీయులు, సోదరులు, కొడుకులు, హితులు, నీ ఐశ్వర్యాలు, నీ భార్యలు వేయేలా నీ బంగారు లంకను చేతులారా నాశనం చేసుకోకు.

నేను రామదాసుణ్ణి. ఏమైనా చేయ సమర్థుణ్ణి. కాని దూతగా వచ్చాను. హితోపదేశం చేయటం నా విధి. నేను వానరుణ్ణి. రాముడు మానవుడు. నీవు రాక్షసుడవు. నేను మధ్యవర్తిని. పక్షపాత బుద్ధి లేదు నాకు. సత్యం చెప్పాను. అబద్ధం ఆడను. నా మాట విను.

**సర్వాన్ లోకాన్ సుసంహృత్య సభూతాన్ సచరా చరాన్ ।**
**పునరేవ తథా స్రష్టుం శక్తో రామో మహాయశా!"**

యశస్వి రాముడు. రుద్రుడై సర్వ లోకాలు చరాచరాలు అన్నింటినీ సంహరించగలడు. తిరిగి సృష్టించగలడు. దేవ, అసుర, ఇంద్ర, నర, యక్ష, రాక్షస, విద్యాధర, గంధర్వ, నాగ, సిద్ధ, కిన్నెర సర్వప్రాణుల్లో ఎవ్వరూ రామునితో పోరాడలేరు. రాముడు విష్ణుతుల్య పరాక్రముడు. అతని పట్ల ఘోర అపరాధం చేశావు. నీవు ఇక జీవించడం దుర్లభం. రాముడు నీ మీదకి యుద్ధానికి వస్తే – బ్రహ్మ కాని, రుద్రుడు కాని, ఇంద్రుడు కాని, ముగ్గురూ ఏకమైనా నిన్ను రక్షించలేరు.

అది హనుమంతుని హితోపదేశం. నిర్భయంగా చెప్పాడు. సహేతుకంగా చెప్పాడు. విన్నాడు రావణుడు. కాని అవి అప్రియంగా తోచాయి. కోపంతో గుడ్లురిమాడు. "మహా కపిని చంపండి" – అది రాక్షసరాజు ఆజ్ఞ.

కొసరి కొసరి అన్నం వడ్డించే వాళ్ళని – కసిరి కసిరి మంచి చెప్పేవాళ్ళని – విసిగించి విసిగించి మేలు కోరే వాళ్ళని దూరం చేసుకుంటే – ఇక జీవితంలో అలాంటివాళ్ళు మళ్ళీ దొరకరు. మళ్ళీ చూడలేం.

ముఖప్రీతి కోసం ప్రియంగా మాట్లాడేవారు కోకొల్లలు. కాని హితం కోరి అప్రియమైన మాటలు పలికేవారు వుండరు. వినేవారు ఉండరు అంటాడు మారీచుడు రావణునితో (అరణ్య – 37 సర్గ – 2 శ్లోకం).

## దూతను చంపరాదు

వానరుణ్ణి చంపండి – ఆజ్ఞాపించాడు రావణుడు. విన్నాడు విభీషణుడు. వానరుడు ఒక దూత. అతణ్ణి చంపరాదు. అది విభీషణుని ఆలోచన. అతడు కార్యా కార్య జ్ఞాని. అన్నని చూస్తూ అంటున్నాడు. రాజా! క్షమించు. కోపించకు. శాంతించు. నా మాట విను. మంచి చెడ్డలు తెలిసినవారు, సజ్జనులైన రాజులు దూతను చంపరు. అది రాజ ధర్మానికి విరుద్ధం. లోక వ్యతిరేకం. నీలాంటివారు చేయతగింది కాదు. నీవు కృతజ్ఞుడవు. రాజధర్మ కోవిదుడవు. యుక్తా యుక్తాలు తెలిసిన వాడవు. సర్వప్రాణి కోటి తత్వ విశారదుడవు. పరమార్థ వేత్తవు. నీలాంటి జ్ఞానులు ఇలా ఆజ్ఞాపించరాదు. కోప పరవశులు కారాదు. అలా చేస్తే నీ శాస్త్ర పాండిత్య పరిశ్రమ వృధా శ్రమే. ఆలోచించు. దూతకు తగిన దండన విధించు.

విన్నాడు రావణుడు. రోషావేశం తగ్గలేదు.

**న పాపానాం వధే పాపం వధ్యతే శత్రు సూచన**

పాపాత్ముల్ని చంపటంలో పాపం లేదు. వీడు పాపాచారుడు. వీణ్ణి చంపాల్సిందే అన్నాడు.

విన్నాడు విభీషణుడు. రావణుని మాటలు అధర్మమూలంగా ఉన్నాయి. రోషపూరితంగా ఉన్నాయి. సజ్జన సమ్మతం కానివిగా ఉన్నాయి. బుద్ధిమంతుడు విభీషణుడు మళ్ళీ అంటున్నాడు.

లంకేశ్వరా! శాంతించు. కోపగించకు. ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా, ఏ పరిస్థితుల్లోనైనా దూతను వధించరు. అది తగదంటారు పెద్దలు. ఈ వానరుడు ప్రబల శత్రువే. సందేహం లేదు. రాక్షస వీరుల్ని చంపాడు. సేనా నాయకుల్ని చంపాడు. మంత్రి పుత్రుల్ని చంపాడు. మన అక్ష కుమారుణ్ణి చంపాడు. మనకు చెప్పలేనంత అపకారం చేశాడు. అయినా దూతను చంపరాదంటారు పెద్దలు.

**(సశేషం)**

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



## 35వ శ్లోకం

నమామి నారాయణ పాదపంకజం
కరోమి నారాయణ పూజనం సదా ।
వదామి నారాయణ నామ నిర్మలం
స్మరామి నారాయణ తత్త్వ మవ్యయమ్ ॥

మన కులశేఖరాళ్వార్లు పూర్వపు శ్లోకంలో ఈ సంసార సాగరమున పడి అల్లాడుతున్నామని తమను ఉద్ధరింపమని ప్రార్థించి ఈ శ్లోకమున తన యొక్క నైచ్యత్వమును, నారాయణుడి యొక్క పరత్వమును తెలుపుట కొరకు నారాయణుని పాద పంకజములకు నమస్కారమని అంటూ ప్రారంభం చేశారు.

'మ' కారానికి, 'అ' కారానికి వివరణ నారాయణాయ అనే పదం. నారాయణ అనగానే రెండు పదాలు నారము మరియు అయనము. నారాయణ అన్న పదాన్ని కూడా రెండు సమాసాలతో విడదీయవచ్చు.

**నారములంటే ఏమిటి ?**

ప్రపంచం అంటే ఎన్నో వస్తువులతో కూడుకొని ఉంది. పంచభూతాలు ఉన్నాయి. ఎన్నో రకాల శరీరాలు ఉన్నాయి. ఆ శరీరాల్లో మట్టి శరీరాలు కొన్ని ఉన్నాయి, జల శరీరాలు ఉన్నాయి, తేజస్ శరీరాలు కొన్ని ఉన్నాయి, వాయు శరీరాలు కొన్ని ఉన్నాయి, దివ్య శరీరాలు కొన్ని ఉన్నాయి. ఇన్ని రకాల శరీరాలు కల వస్తువులు ఎన్నో ఈ ప్రపంచంలో ఉన్నాయి కదా! మన శరీరాలు మట్టి శరీరాలు. దేవతలు తేజస్ శరీరాలు కలిగినటువంటి వారు. ఇవన్నింటికి పేరు 'నార' అని, అంటే నశించక ఎప్పుడూ ఉండేవి. ప్రతి వస్తువు నశించడం లేదు, కేవలం మార్పు చెందుతుంది. కేవలం ఈ శరీరాలే కాదు మనందరినీ మోస్తూ ఉండే భూమి ఉంది, భూమితో పాటు గోళాలు ఉన్నాయి. ఈ గోళాలు ఎన్ని కోట్లో మనం చెప్పలేం. ఏ గోళంలో ఏమి ఉన్నాయో! తెలియదు. అవన్నీ కూడా నిలబడి ఉన్నాయి. అవన్నీ కూడా నారములే. కనుక నార అనే ఒక్క పదానికి మన దగ్గరి నుండి ప్రారంభిస్తే ఈ చుట్టూ ఉండే విశ్వాంతరాళలో ఎన్ని రకాల వస్తువులు ఉన్నాయో! తిరిగేవి కావచ్చు, తిరగనివి కావచ్చు, ప్రకాశించేవి కావచ్చు, ప్రకాశం లేనివి కావచ్చు, ప్రాణం ఉన్నవి కావచ్చు, లేనివి కావచ్చు ఏవైనప్పటికీ కూడా వీటన్నింటికీ పేరు నారములు. సంస్కృత భాష అట్లా పేరు చెబుతుంది.

అయితే ఈ నారములన్నింటికీ అయనము, అంటే ఆధారం "నారాయణ". నారములనే పదార్థాలకి ఆధారం. ఈ సకల చరాచర వస్తు జాలానికి ఆధారమైన వాణ్ణి నారాయణ అంటారు. నారములకి అయనం లేదా నారములని అయనంగా కల్గి ఉన్నాడో ఆయనే నారాయణ అని రెండు రకాలుగా చెప్పవచ్చు."

సమస్త వేదమునకు సారభూతములైన ఉపనిషత్తులు నారాయణుడే పరంబ్రహ్మ అని ఉద్ఘోషిస్తాయి.

"అంతర్ భహిష్య తత్ సర్వం వ్యాప్య నారాయణ స్థితః
నారాయణ పరం బ్రహ్మ తత్వం నారాయణ పరః
నారాయణ పరో జ్యోతిః ఆత్మా నారాయణ పరః"

"నారాయణ పరం బ్రహ్మ" తాను పెద్దదై ఉండి, అంతటా తనను మించి పెంచదగినది మరొకటి లేనిది ఏది అంటే – అది నారాయణ. తత్త్వం అంటే వాస్తవికమైన వస్తువు లేక పారమార్థికము అని అంటారు. అట్లా తెలుసుకోదగినవి ఎన్నో ఉన్నా, వాటిల్లో తెల్సుకోవాల్సిన "పరం" తత్వం ఏది అంటే, అది

నారాయణ.

"పరో జ్యోతిః" ప్రకాశకములు అయిన వాటన్నింటికి ఉత్తమ ప్ర కాశాన్ని కలిగించ గలిగినది నారాయణ తత్వమే. 'ఆత్మా' అంటే వ్యాపించినది. ఆప్నోతి ఇతి ఆత్మ. ఆప్నోతి లేక ప్రాప్నోతి అన్నా పొందుట అని అర్థం. అందులోంచి ఏర్పడ్డ పదం ఆత్మ. వ్యాపించినది అని అర్థం. ఈ వ్యాపించిన వాటిల్లో ఎక్కువగా వ్యాపించినది ఏది అంటే, అది నారాయణ.

ఇట్లా నారాయణ అంటే ఏమిటో తైత్తిరీయం అనే ఉపనిషత్తులో మంత్రపుష్ప భాగం తెలుపుతుంది. అనేకమైన ఉపనిషత్ ప్రమాణములు దేవతా ప్రణామములు కలవు.

"న షడక్షభిః గ్రాహ్యం అషఢక్షీణం" ఈ నామములో ఉండే రహస్యార్థములు 'అషఢక్షీణం' అంటే మూడవ వారికి తెలియకుండా రహస్యముగా ఉపదేశింప తగినది కనుక ఇంతకు మించి వ్యాఖ్యానించుట ఆచార్య ఉల్లంఘన. అలాంటి పరమచేతనుడైన పరమాత్మ అయినా శ్రీమన్నారాయణుడే పరం. "తిరుప్పావై" దివ్య ప్రబంధంలో మన గోదా మాత "నారాయణనే నమక్కే పరైతరువాన్" అంటూ తెలియజేస్తారు. అటువంటి శ్రీమన్నారాయణుని పాద పద్మములకు నమస్కరిస్తాను. నారాయణుని సదా పూజిస్తాను. నారాయణుని నిర్మలమగు నామమును కీర్తిస్తాను. శాశ్వతమగు నారాయణ తత్వమును స్మరిస్తాను అంటూ కులశేఖరాళ్వార్లు పరతత్త్వమును చూపిస్తూ వారి యందు కలిగి ఉండాల్సిన దాస్యత్వమును నైచ్యాను రూపకముగా శ్రీవైష్ణవ లక్షణమును చూపిస్తున్నారు.

అలాగే భద్రాద్రి రాముణ్ణి తన ఇష్టదైవంగా జీవితాంతం సేవించి తరించిన భక్త శిఖామణి "తూము లక్ష్మీనరసింహదాసు". భద్రాచల రామదాసే కర్మలేశం అనుభవించడానికి తూము నరసింహదాసుగా జన్మించారని కొందరి భావన.

కర్ణాటక శాస్త్రీయ సంగీత వాగ్గేయకారులెందరో తమ భక్తి భావావేశం ద్వారా జాలువారిన ఎన్నో భక్తిరస ప్రధానమైన కీర్తనలతో పరమాత్మని స్తుతించి తరించి విన్న వారిని కూడా తరింపచేసి, చేస్తూ ఉన్న ధన్యజీవులు, పుణ్యజీవులు. వారి కీర్తి ఆచంద్రతారార్కం. అయితే కొంత మంది వాగ్గేయకారుల రచనలు బాగా జన ప్రాచుర్యం పొంది భావితరాల వారికి కూడా అందింపబడ్డాయి. ఉదాహరణకి అన్నమయ్య, శ్రీభద్రాచల రామదాసు, సంగీత త్రిమూర్తులు, మైసూరు వాసుదేవాచారి వీరందరి రచనలు సామాన్యుల దగ్గర నుండీ సంగీతశాస్త్ర పండితుల వరకూ అందరికీ పరిచయమే.

అయితే కొందరు వాగ్గేయకారులు మాత్రం అమృతతుల్యమైన కీర్తనలు రచించినప్పటికీ అవి అజ్ఞాతంగా ఉండిపోయాయే, కానీ బహుళ జనాదరణ పొందలేదు. ఇలా జరగడానికి చాలా కారణాలు ఉండవచ్చు. ఆ వాగ్గేయకారునికి శిష్య ప్రశిష్యులు లేని యెడల వాటి ప్రచారానికి అవకాశం ఎక్కువగా ఉండదు. ఆ వాగ్గేయకారుని సమకాలీనులైన ఇతర వాగ్గేయకారులతో కానీ, మహరాజులతో కానీ సంబంధాలు అధికముగా లేని యెడల కూడా వారి రచనలు జనంలోకి రావడానికి అవకాశం తక్కువే. ఇలా కారణాలు ఏవైనా వారు, వారి రచనలు కూడా అజ్ఞాతంగా ఉండిపోతాయి. ఇలాంటి కోవకి చెందిన శ్రీరామ భక్తాగ్రేసరులు, ఉత్తమ వాగ్గేయకారులు "శ్రీ తూము లక్ష్మీనరసింహ దాసు" గారు.

వీరు 1770-1833 కాలానికి చెందిన వారు, త్యాగరాజ స్వామి సమకాలీనులు కూడా. జీవించి నంతకాలం ఆ శ్రీరామచంద్రమూర్తే శ్వాసగా, ఆయన పైనే ధ్యాసతో నిరంతర రామనామ సంకీర్తనా కైంకర్యంతో కాలం గడిపిన ధన్యులు. భద్రాచల రామదాసు వలె భద్రాద్రి రామునిపై పెక్కు సంకీర్తనలు రచించి శ్రీరామునిలో ఐక్యమైన శ్రీరామ సంపూర్ణ అనుగ్రహ సంపన్నులు, వాగ్గేయకార శిఖామణి శ్రీనరసింహదాసుల వారు.

శ్రీ నరసింహదాసుల వారు నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని, గుంటూరు జిల్లాలోని, పొన్నూరు గ్రామం లోని పుణ్య దంపతులైన శ్రీ తూము అప్పయ్య దీక్షితులు, వెంకమాంబ దంపతులకు మంగళగిరి నరసింహస్వామి అనుగ్రహంతో 10-12-1790 నాడు మొదటి సంతానంగా జన్మించారు. ఆ స్వామి అనుగ్రహ వరప్రసాదం కనుక తల్లితండ్రులు నరసింహదాసు అని నామకరణం చేసారు. కాలక్రమేణా కృష్ణదాసను మరొక కుమారుడు, లక్ష్మీబాయమ్మ అనే కుమార్తె కూడా వీరికి కలిగారు.

తండ్రిగారు అప్పయ్యదీక్షితుల వారు గొప్ప సంస్కృత పండితులు కావటం చేత ఎందరో పండితులు, విద్వాంసులు వీరి ఇంటికి వస్తూ ఉండేవారట. వారు చిన్న వాడైన నరసింహదాసు భాషా జ్ఞానాన్ని, పాండిత్యాన్ని, తెలివితేటలను, చూసి ఆశ్చర్యపోయేవారట. బాల్యంలోనే సంగీతంలో, సంస్కృత, ఆంధ్రభాషలలో అపారమైన అనితర సాధ్యమైన ప్రతిభాపాటవాలు ప్రదర్శించే వారట మన నరసింహదాసుల వారు.

కేవలం ఎనిమిదేళ్ళ వయసులో రామునిపై కీర్తనలు రచించి పాడుతూ ఉంటే ఆ బాలుని ప్రతిభా పాటవాలకి అందరూ ఆశ్చర్యపోయేవారట. వీరి లయజ్ఞానం అపారం. కంజీర వాయిద్యాన్ని అద్భుతంగా వాయించే వారట. ఇక సాహిత్యపు లోతుల్లోంచి వచ్చిన వీరి భాషాజ్ఞానం అద్భుతంగా ఉండేదట. భగవంతునిపై ఆయనకున్న భక్తిని ప్రదర్శించడానికి భాషని ఎంతో అద్భుతంగా ఉపయోగించేవారట. ఆ పిన్న వయసులోనే భద్రాచల రామునిపై "నమో నమో దాశరథే" అన్న అద్భుతమైన కీర్తనని రచించి, స్వరపరిచి అందరినీ ఆనందపరచడమే కాదు ఆశ్చర్యపరిచారు కూడా.



గుంటూరు రెవెన్యూ శాఖలో ఉదరపోషణార్థం ఓ చిన్న ఉద్యోగాన్ని కూడా ఎంతో పవిత్రంగా, పనే దైవంగా చేస్తు ఉండేవారు. అదే సమయంలో వారికి లక్ష్మీబాయ్ గారితో వివాహం జరిగింది. కొన్నాళ్ళకి తండ్రిగారు అప్పయ్య దీక్షితులు గారు మరణించాక "పంచ సంస్కార దీక్ష"ని దామోదరం కేశవదాసు గారి దగ్గర స్వీకరించారు. ఈ దీక్షని స్వీకరించిన వారు భగవత్ రామానుజులు ప్రతిపాదించిన విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని అనుసరించి భుజాలపై శంకు, చక్రాలు ధరించి, నుదుటిపై నామాన్ని ధరించి విష్ణుదాసులుగా మారి జీవితం సాగించారు.

ఇదంతా జరిగాక రామునిపై భక్తి పతాకస్థాయికి చేరుకుని ఇక నిరంతర రామనామ ధ్యానంలోనే గడుపుతూ అలౌకిక ఆనందాన్ని పొందుతూ ఉండేవారట. ఆ ఆనందానుభూతి కోసం చేస్తున్న ఉద్యోగాన్ని కూడా వదిలి పెట్టేసరికి లౌకిక పరమైన జీవితానికి చాలా ఇబ్బందులు సహజంగానే కలిగాయి మరి. కుటుంబ పోషణ కూడా చాలా కష్టంగా మారింది.

అయితే కష్టాలు ఎదురౌతున్న కొద్దీ రామచంద్ర మూర్తిపై విశ్వాసం ఇంకా దృఢపడుతూనే వచ్చింది. గొప్ప వాళ్ళెవరైనా ధన సహాయం చేస్తామన్నా కూడా ఈ కష్టాలు రాముణ్ణి చేరడానికి సోపానాలు అనేవారట. రామనామమే తన సర్వస్వంగా భావించి ఈవిధంగా జీవితం గడుపుతూ ఉత్తమ వాగ్గేయకారులందరివలె ఎన్నో పుణ్య క్షేత్రాలు దర్శిస్తూ తీర్థయాత్రలు చేసారు. ఈ తీర్థయాత్రలో భాగంగా శ్రీరంగం, కంచి మొదలైన క్షేత్రాలను దర్శించి ఆయా దేవతామూర్తులపై కూడా ఎన్నో కీర్తనలు రచించారు.

1818-19లో శ్రీరంగంలోని రంగనాథుని దర్శించి

**"చంద్ర సూర్యద్యుతుల మించు శంఖ చక్ర**
**ముఖర ద్వివ్యాయు ధోత్కరములు కరముల**
**దనరగా గంటి నిటువంటి ఘనతరారురాంగు**
**నంగ దూరుని శ్రీరంగశాయి గంటి"** అని పద్యం చెప్పి ధన్యులైనారు.

కంచిక్షేత్రం దర్శించిన తరువాత మద్రాసు దగ్గర ఉన్న తిరువొత్తియ్యూర్ కు చేరుకోగా అక్కడ సద్గురు త్యాగరాజస్వామి వారి శిష్యులైన వీణకుప్పయార్ గారి ఇంటివద్ద నున్నారని తెలుసుకుని వారిని దర్శించి, వారి కీర్తనలు విని ఆనందపరవశులై త్యాగరాజస్వామిని ప్రశంసిస్తూ పద్య రచన చేసి వారి మెప్పును కూడా పొందిన ధన్యజీవి. ఈ ఇద్దరు రామభక్తాగ్రేసులు కలుసుకున్న ఆ క్షణం ఎంత మధురమైనదో. వీరిద్దరికీ ఒకేసారి తన ఇంట ఆతిధ్యం ఇచ్చిన వీణ కుప్పయ్యార్ గారు ఎంత పుణ్యం చేసుకున్నారో.

ఈ తీర్థయాత్రల తరువాత ఓ శుభదినాన రామదర్శనం కలిగి, శ్రీరామచంద్రమూర్తి ఆజ్ఞ మేరకు ఇక అన్నీ విడిచిపెట్టి భద్రాచలం చేరి ఇక తన శేషజీవితం అంతా ఆ శ్రీరాముని సేవలో గడిపిన అపర రామదాసు శ్రీనరసింహదాసు. మనం అందరం రాముడిని చూడడానికి భద్రాద్రి వెళ్ళాలను కుంటాము కాని రాముడు నరసింహదాసు తన దగ్గర ఉండాలని పిలిపించుకున్నాడు. ఈ ఒక్క నిదర్శనం చాలు ఆయన కారణజన్ముడని నమ్మడానికి.

భద్రాచల రామదాసు వలె ఆయన బాటలోనే రామునిపై సుమారు 134 కీర్తనలు రచించారు. వీరి కీర్తనలలో రామభక్తి, పారమార్థచింతన, వేదాంత తత్వము మాత్రమే కలిగినవి కాక సీతారాముల సంకీర్తనా కైంకర్యానికి ఉపయోగించే ఉత్సవ సాంప్రదాయ కృతులైన మేలుకొలుపు, లాలిపాటలు, మంగళ హారతులు వంటివి కూడా ఉన్నాయి. ఇప్పటికీ ఆంధ్రదేశంలోని భజన కూటములలో, సాంప్రదాయ కుటుంబాలలో వినబడుతూ ఉంటాయి. వీరు స్వనామ ముద్రకారులు. నేటి తరం వాగ్గేయకారులైనటువంటి శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు వీరి కీర్తనలను చాలా ఆలపించగా వాటి క్యాసెట్లు కూడా విడుదలయ్యాయి.

వీరు భద్రాచలంలో శ్రీరాముని సేవకే తన జీవితం అంకితం చేసారు. రామదాసుల వారి అనంతరము శ్రీ తూము లక్ష్మీనరసింహ దాసుల వారు అప్పటి నిజాము ప్రభువును కలుసుకుని తానీషా వారు కంచర్ల గోపెన్నకి ఇచ్చిన, పాడైన దాస శాసనం తిరిగి వ్రాయించి నైజాము ప్రభువు చేత తిరిగి సీతారాముల వారి కైంకర్యానికి, నిత్యోత్సవాలకు గాను వార్షిక నిధిని చేయించారు. తన మిత్రుడైన వరద రామదాసుగారితో కలిసి భద్రాచలంలో ఉన్న శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్ర మూర్తికి దశవిధ ఉత్సవాలను ఏర్పాటు చేసిన ఘనుడు. వీరు ఏర్పాటు చేసిన ఉత్సవ సాంప్రదాయాలే నేటికీ భద్రాద్రిలో శ్రీరామచంద్ర మూర్తికి కొనసాగుతున్నాయి.

రామునిపై అమృతతుల్య మైన కీర్తనలు రచించడమే కాక

శ్రీ భద్రాచల క్షేత్ర వైభవ అభివృద్ధిలోను ముఖ్య కారకులైన ఈ అజ్ఞాత వాగ్గేయకారులు, అపర రామదాసు శ్రీ తూము లక్ష్మీనరసింహదాసు గారు. రాబోవు కాలములో వీరి కీర్తనలు కూడా అన్నమయ్య, రామదాసు, త్యాగరాజస్వామి వంటి వారి రచనల వలె బహుళ జనాదరణ పొంది ఆచంద్రతారార్కం నిలవాలని ఆకాంక్షిద్దాము.

ఇతని తెలుగు భాషా మాధుర్యానికి మురిసిపోయిన తమిళకవి సుబ్రమణ్య భారతి వింటే తెలుగు పాటే వినాలని అన్నారట. ఈయన రచించిన కీర్తనలు నేటికి భజన కూటములలో, సాంప్రదాయాలు పాటించే ఇళ్లలో నేటికీ వినబడుతున్నాయి. వీరు మిత్రబృందంతో, కుటుంబసమేతంగా పుణ్య క్షేత్రాలు దర్శించారు. శ్రీరంగం, కంచి దేవుళ్లపై పాటలు పాడారు. చివరకు భద్రాచలం చేరుకుని తన నిత్య సంకీర్తనలతో స్వామిని సేవిస్తూ స్వామిలో ఐక్యం అయ్యాడని చెబుతారు.

ఈయన తన శిష్యుడైన వరద రామదాసు కలసి తమ సంపదను రామసేవకు అర్పించారు. వరద రామదాసు కూడా గొప్ప రామభక్తుడు. ఈయన క్షయవ్యాధితో మరణించినపుడు ఈయన భౌతిక కాయాన్ని గోదావరి నదిలో నిమజ్జనం చేసారు. ఈయనను నిమజ్జనం చేయటానికి వెళ్లిన తోటి వారు కూడా గోదావరిలో మునిగి దేహత్యాగం చేసారు.

గోదావరి ఒడ్డున చేరి ఈ దృశ్యాన్ని తిలకిస్తున్న వేలాది జనావళికి పాండవుల మహాప్రస్థానం స్ఫురించింది. మృత కళేబరాల కోసం వెదకగా వరదరామదాసు, నరసింహదాసుల శరీరాలు తప్ప మిగిలిన వారివి మాత్రమే లభ్యమయినాయి. అశేషజనం ఆశ్చర్యంతో చూస్తుండగా ఆ సమయంలో దివ్య తేజస్సు ఒకటి వినీలాకాశంలో వింతకాంతు లీనింది.

తూము నరసింహదాసు రచించి గానం చేసిన కొన్ని పాటలు:

**భజన చేసే విధము తెలియండి మీరు జనులారా....**

**కావేటి రంగా నను గావవేరా....**

**వందనమిదే శ్రీరంగా....**


**వరదుని గంటి కంచి వరదుని గంటి.....**

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

# తొండమనాడు ప్రసన్న వేంకటేశ్వరుడు

**– శ్రీమతి వెలమకన్ని పద్మావతి**

తిరుమల ఆలయాన్ని నిర్మించిన తొండమాన్ చక్రవర్తి, పద్మావతీ దేవి తండ్రి అయిన ఆకాశరాజుకు స్వయంగా సోదరుడు. తొండమాన్ చక్రవర్తి తిరుమల రాయడైన శ్రీనివాసునికి పరమభక్తుడు. నిత్యమూ తిరుమల వెళ్ళి స్వామిని సేవించి, అర్చించి వివిధ సేవలలో పాల్గొనేవాడు. వృద్ధాప్య కారణంగా క్రమంగా శరీరంలో శక్తి సన్నగిల్లడంతో "నిత్యం తిరుమలకు రావడం కష్టంగా ఉన్నదం"టూ స్వామికి మొరపెట్టుకున్నాడు. తన కోటలో కొలువై తాను చేసే సేవలు స్వీకరించాలని వినమ్రంగా ప్రార్థించాడు. శ్రీదేవి భూదేవీ సమేతంగా వేంకటేశ్వరుడు తొండమానుడి ఇంట్లో ప్రత్యక్షమయ్యాడు. తిరుమల ఆలయాన్ని నిర్మించిన తొండమానుడు అదే ఆకృతిలో "తొండమనాడు"లో శ్రీవారికి ఆలయాన్ని నిర్మించాడట. ఆలయం సమీపంలోన ఒక పెద్ద తటాకాన్ని తవ్వించాడు. తిరుమల లోని ఆకాశగంగ, అలాగే కపిలతీర్థం నుంచి నీరు వచ్చి ఈ తటాకంలో చేరుతుంది. ఆలయ సేవలకు ఈ జలాన్ని వినియోగిస్తారు. ఈ తొండమనాడు ఆలయం 9-10 శతాబ్దాల మధ్య నిర్మించబడిందని చరిత్రకారుల భావన. ఈ ఆలయం లోని విమానం తిరుమల లోని ఆనంద నిలయ విమానాన్ని పోలి ఉంటుంది. మహా మండపం, ముఖమండపం, అంతరాలయం దాటిన తరువాత గర్భగుడిలో స్వామి కూర్చున్న భంగిమలో, యోగముద్రలో దర్శనమిస్తారు. ఇరువైపులా కొలువైన శ్రీదేవి



– భూదేవి భక్తులకు ఆశీః పరంపరలు అందిస్తారు. ఇలా యోగముద్రలో ఆసీనుడై ఉన్న స్వామి, శంఖు – చక్రాలతో, అభయ హస్తంతో, యోగముద్రతో అలరారుతూ ఉంటాడు. సాధారణంగా స్వామి నిలువెత్తున నిలబడి భక్తులకు దర్శనమిస్తాడు. కానీ యోగముద్రతో – ఆసీన భంగిమతో ఈ ఆలయంలో మాత్రమే కనిపిస్తాడు.

వివాహం కానివారు ఈ ఆలయాన్ని దర్శిస్తే వివాహం అవుతుందనీ, వైవాహిక జీవితంలో సమస్యలు ఎదుర్కొంటున్నవారు ఈ ఆలయాన్ని దర్శిస్తే ఆ సమస్యలు సమసిపోతాయన్నది – భక్తుల విశ్వాసం. ఈ తొండమనాడు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాళహస్తికి 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అలాగే తిరుపతి పట్టణానికి 36 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. తిరుపతి నుంచి శ్రీకాళహస్తి నుంచి తొండమనాడుకు బస్సు సదుపాయం ఉంది.

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## శ్రీవామనపురాణాంతర్గతం

### ప్రయాగ మాహాత్మ్యం

యచ్ఛరీరం త్రయో వేదాః యచ్చేష్టాథర్వణః స్మృతః ।
యదఙ్గాని షడఙ్గాని తస్మై వాగాత్మనే నమః ॥

**- వామనపురాణం, అధ్యాయం 20, శ్లోకం 1.**

మూడు వేదాలు ఎవనికి శరీరంగా ఉన్నాయో, ఎవని చర్యలు అథర్వవేదమని చెబుతారో, ఆరు వేదాంగాలు (1. శిక్ష 2. వ్యాకరణం 3. ఛందస్సు 4. నిరుక్తం 5. జ్యోతిషం 6. కల్పము) ఎవనికి అవయవములో అట్టి ప్రణవస్వరూపుడైన శబ్దబ్రహ్మకు నమస్కరిస్తున్నాను.

పూర్వమొకనాడు మిథిలాధిపతియైన జనకచక్రవర్తి తన కులగురువు, పురోహితుడు, మహానుభావుడు, సకలశాస్త్ర విశారదుడు, తత్త్వదర్శి అయిన శతానందుల వారితో ఇలా అన్నాడు –

పూజ్య గురువర్యా! నా బిడ్డ సీత వివాహ యుక్తవయస్కు రాలైంది. నాకు ఆమె వివాహ విషయం తలచుకుంటే చాల బాధ కలుగుతున్నది. ఈ బాధ ఎలా నివారణవుతుంది? వివాహానికి విఘ్నాలు తొలగాలంటే ఎవరిని ఆరాధించాలి? రాక్షసరాజు, కుబేరుని సోదరుడు, దుర్మార్గుడైన రావణుడు సీతను అపహరిస్తాడేమోనని నాకు బెంగగా ఉంది. మహాత్మా! ఎవరిని ఆరాధిస్తే నా కుమార్తెకు తగిన, ఉత్తమ వంశంలో పుట్టిన, శ్రేష్ఠమైన వరుని, నాకు తగిన అల్లునిగా పొందగలను? నాకు 'ఊర్మిళ' అనే మరొక కుమార్తె ఉంది. నా చిన్న తమ్మునికి మాండవి, శ్రుతకీర్తి అనే ఇద్దరు సౌశీల్య, సౌందర్యాలు గల బిడ్డలున్నారు. ఈ నలుగురు పిల్లలకు తగిన వరులను బ్రహ్మదేవుడు ఎక్కడ పుట్టించాడోనని నేను విచారిస్తున్నాను.

మీరు ఆధ్యాత్మజ్ఞానం కలవారు. లోకంలోని విషయాలు కూలంకషంగా తెలిసినవారు. యోగి పుంగవులు. దివ్యదృష్టి కలవారు. మాకు కుల గురువులు, మా వంశ పురోహితులు. కావున మీరే నాకు దిక్కు. మీరు వేదశాస్త్ర పురాణములు తెలిసినవారు. కాలజ్ఞానం కలవారు. కాలానుగుణమైన ధర్మముల నెరిగినవారు. బాధలలో ఉన్నవారి బాధలను పోగొట్టేవారు. దుఃఖించే వారి దుఃఖాన్ని నివారించేవారు. సుఖాలలో ఉన్నవారి గర్వాన్ని పోగొట్టేవారు. సంసారసాగరమనే దుఃఖాన్ని నశింపజేసే మీరే నాకు పరమగతి.

విషయభోగలాలసులు, కామక్రోధాలు గలవారు అయిన

రాజులనేక మంది, (కోట్లకొలది) కన్యామణుల కొరకై వస్తున్నారు. ఓ బ్రహ్మవిదగ్రణీ! ఒంటరివాడనైన నేను వాళ్ళందరితో ఎలా యుద్ధం చేయగలను? కన్యలనివ్వలేదని వాళ్ళంతా నాపై కోపంతో ఉన్నారు. ఇంతకాలం నేను సుఖంగా రాజ్యపాలన చేశాను. ఇప్పుడు నేను విచారగ్రస్తుడనయ్యాను. ఓ తపోధనా! నేను వృద్ధుడను. సంతానవంతుణ్ణి. నాకు అజుడు, వివిక్తుడు, విమలుడు, విష్ణుభక్తుడనే నలుగురు కుమారులున్నారు. వీళ్ళందరూ చిన్నపిల్లలు. వారికి ఉపనయనం చేశాను. కాని ఇంకా వారు అస్త్రవిద్యా కోవిదులు కాలేదు. మా తమ్ముడికి విచికిత్సుడు, వికర్తనుడు, ప్రతర్దనుడు అనే ముగ్గురు పిల్లలున్నారు. వాళ్ళు కూడా చిన్నపిల్లలే.

ఓ తపోధనా! మా మగపిల్లలు చిన్నవారు. ఆడబిడ్డలు రత్నాలవంటి వారు. నేనా ముసలివాణ్ణి. అందువలన విచారిస్తున్నాను. నేను ఈ మోహం నుండి ఏ ఉపాయంతో బయటపడగలను? ఓ బ్రహ్మర్షీ! నేను ఎవరిని శరణు వేడవలెను? నా భవిష్యత్తు ఏమవుతుందో? మీరే చెప్పండి. పూర్వం మనువు మొదలైన వారు ఏ విధంగా ఈ సంసారసాగరాన్ని తరించారు? ఆ రాజులు ఇహలోకంలో దుఃఖాన్ని ఎలా దాటారు? ఆ విషయాన్ని నాకు తెలియజేయండి. ఓ తపోధనా! లోకంలో మానవుడు ఎవరిని ధ్యానిస్తే భుక్తిని, ముక్తిని పొందుతాడు. ఆపదలనుండి రక్షించేవాడెవరు, ఆ దేవుని గురించి చెప్పండి స్వామీ! అని వేడుకొన్నాడు.

అంతట శతానందులవారు జనకమహారాజుతో 'రాజా! మానవులు ఎవరిని శరణుపొంది దుఃఖరహితులై సుఖంగా ఉంటున్నారో అటువంటి భక్తాభీష్ట వరప్రదుడైన లక్ష్మీపతిని గురించి చెబుతా. ఆ దేవదేవుని ఆశ్రయించి నీవు ఈ దుఃఖసాగరాన్ని దాటగలవు. పూర్వం నేను ఒకసారి వాల్మీకి మహర్షిని దర్శింపగోరి చంపకారణ్యము నుండి తమసా నదీతీరానికి వెళ్ళాను. ఆ మహర్షి నా రాకతో సంతోషించి నాకెదురేగి స్వాగతించి అర్ఘ్యపాద్యాది ఉపచారాలతో నన్ను పూజించాడు. నేను కూడా ఆ ముని సత్తమునికి నమస్కరించాను. ఆయన శిష్యులు నాకు నమస్కరించి గౌరవించారు.

మధ్యాహ్న కాలములో చేయవలసిన స్నాన సంధ్యాది కార్యక్రమాలు నిర్వర్తించి వాల్మీకి మహర్షితోపాటు భుజించి భరద్వాజాది ఇతర మునులతో పాటు ఆ సుందరమైన వాల్మీకి ఆశ్రమంలో ఆ మహర్షితో పాటు మేమంతా విశ్రమించాం. మేమంతా ఆ యా సందర్భానికి తగిన విషయాలను ప్రాచీన చరిత్రలను చెప్పుకొంటూ పరస్పరం సంతోషంగా కలిసి మాట్లాడుకుంటూ ఆనందంగా ఉన్నాం.

ఇంతలో స్వర్గలోకం నుండి నారదమహర్షి అక్కడికి విచ్చేశాడు. ఆయన స్వచ్ఛమైన స్ఫటికము వలె తెల్లగా ఉన్నాడు. ఆ మహాత్ముడు 'మహతి' అనే వీణను ధరించి ఉన్నాడు. ఆ దేవర్షిని చూచి వాల్మీకి మహర్షితో పాటు నేను ఆయన శిష్యులు అందరం ఆసనముల నుండి లేచి ఆయనకు అంజలి ఘటించాము.

సంతోషంతో వాల్మీకి మహర్షి తన శిష్యులతో పాటు ఆయనను యథావిధిగా పూజించాడు. "ఓ నారద మహర్షీ! ఇదిగో పాద్యం. ఇది అర్ఘ్యం. ఇది ఆసనం. ఇవి రుచికరాలైన కందమూల ఫలాదులు. వీటిని స్వీకరించండి. స్వామీ! తపోధనా! మీరు చాలాకాలానికి మా ఆశ్రమానికి విచ్చేశారు. మీకిదే మా స్వాగతం" అని వాల్మీకి మహర్షి శిష్యులతో పాటు ఈ విధంగా నారదమహర్షిని ఆరాధించి, నమస్కరించాడు.

అంతట నారదమహర్షి చాలా సంతోషించి కృష్ణాజినంపై కూర్చొని ఆ కందమూల ఫలాదులను భుజించి తన మార్గాయాసాన్ని పోగొట్టుకొని వాల్మీకి మహర్షిని యిలా కుశల ప్రశ్నలడిగాడు – 'ఓ మహర్షీ! నీ తపస్సు నిర్విఘ్నంగా జరుగుచున్నదా? మానసిక, వాచిక, శారీరకములనే త్రివిధ తపస్సు వృద్ధి పొందుతున్నదా? నీ ఆశ్రమంలోని వృక్షాలు సకాలంలో ఫలాలను ఇస్తున్నాయా? మీ ఆహ్నిక క్రియలకు దర్భలు, సమిధలు సులభంగా దొరుకుతున్నాయా?' అని నారద మహర్షి ప్రీతితో అడుగగా వాల్మీకి మహర్షి యిలా అన్నాడు.

ఓ మునిశ్రేష్ఠా! మీ అనుగ్రహం వలన మాకంతా శుభమే జరుగుచున్నది. మూడు కాలాలలోను త్రివిధమైన తపస్సు వృద్ధి చెందుతున్నది. ఓ కాలజ్ఞానీ! ఇంద్రుని ఆజ్ఞచేత మా ఆశ్రమంలోని వృక్షాలు అకాలంలో కూడా ఫలిస్తున్నాయి అని చెప్పగా విని మహాతేజస్సంపన్నుడైన నారద మహర్షి చాలా సంతోషించాడు.

వారంతా ఆయన చుట్టూ చేరి అంజలి బద్ధులైనారు. ఆ వనవాసు లందరూ ఆయన రాకతో సంతోషించి అక్కడకు వచ్చి కూర్చున్నారు. అంతట వాల్మీకి మహర్షి నారద మహర్షి అనుమతితో కృష్ణాజినంపై ఆసీనుడై చేతులు జోడించి వాక్యవిశారదుడైన ఆయన నారదమహర్షిని యిలా అడిగాడు.

'మహర్షీ! ఈ ముల్లోకాలలోని వైష్ణవక్షేత్రాల్లో ఏది శ్రేష్ఠమైనది? భూలోకంలో ఏది శ్రేష్ఠమైనది? బ్రహ్మలోక పర్యంతం అన్ని విశేషాలను మీరు చూశారు కదా! ఏ తీర్థంలో అన్ని తీర్థాలు కలుస్తాయి? ఏ పుణ్యక్షేత్రాల్లో నివసించేవారి పుణ్యం అనంతమని, కీర్తించబడుతుంది? పురుషోత్తముడైన విష్ణుభగవానుడు శ్రీదేవి భూదేవులతో ఏ పుణ్యక్షేత్రంలో నివసిస్తున్నాడు? త్రిలోక పావనమైన ఆ దివ్యక్షేత్రాన్ని గురించి మాకు తెలియజేయండి'.

వాల్మీకి మహర్షి ఈ విధంగా అడుగగా దేవర్షి నాదరులవారు వాల్మీకి మహర్షితో 'ఓ మహర్షీ! వాల్మీకీ! నీవు సర్వలోకాల హితమును కోరి చక్కగా అడిగావు. నీవడిగిన విషయాన్ని నేను చెబుతాను. సావధానంగా విను. పూర్వం హిమాలయాల్లో జయశీలుడైన షణ్ముఖుడు (కుమారస్వామి) తన తండ్రియైన

మహేశ్వరుని యిదే ప్రశ్న యిలా అడిగాడు. 'తండ్రీ! త్రిలోచనా! నేను దేవా సుర సంగ్రామంలో తారకుడనే మహాసురుని సంహరించి మీ పాద పద్మముల సన్నిధికి వచ్చాను. బ్రహ్మహత్య వలన కలిగిన ఆకలి నన్ను తీవ్రంగా బాధిస్తున్నది. కావున నేను ఏ తీర్థంలో స్నానంచేసి భుజించాలో ఆ తీర్థాన్ని గురించి నాకు తెలియజేయండి.

స్కందుడు ఈ విధంగా ప్రార్థించగా శివుడు 'కుమారా! ఒక్కసారి నారాయణ' అని ఉచ్చరిస్తే మానవుడు మూడు వందల కల్పాలు గంగాది సర్వతీర్థాలలో స్నానం చేసిన ఫలితం వస్తుంది' అని చెప్పాడు. అది విని 'సరే' నన్నాడు స్కందుడు. తండ్రితోపాటు భోజనం చేసి ఆ తరువాత సర్వలోకాలకు శుభాన్ని కలిగించే తండ్రియైన శంకరుని యిలా అడిగాడు.

'తండ్రీ! మీరు శ్రీమన్నారాయణుడు పాపాలన్నింటిని పోగొడతాడని చెప్పారు. ఆయన్ని ఏవిధంగా ఆరాధించాలి? భూలోకంలో ఆయన ఎలా దర్శనమిస్తాడు? ఆయన్ని ఎక్కడ సేవించాలి? ఏం చేస్తే ఆయనకు ప్రీతి కలుగుతుంది' అని అడుగగా శంకరుడు తన కుమారుడైన స్కందునితో యిలా చెప్పాడు – 'ఏ దేవదేవుని మునీశ్వరులు తమ హృదయాల్లో ఆరాధిస్తున్నారో, యోగులు ధ్యానిస్తున్నారో, జ్యోతిర్మయుడు, ఓంకార స్వరూపుడు, ఊహింపనలవి కాని రూపం కలవాడు. ఆదిత్యమండల మధ్యవర్తి, అంతము లేనివాడు, ఆదిపురుషుడు, అయిన శ్రీమన్నారాయణుని పూజిస్తున్నారో అట్టి దేవదేవుని గూర్చి చెబుతాను విను.

పూర్వం నేను దక్షయజ్ఞంలో దక్షుని శిరస్సు ఖండించాను. ఆ శిరస్సు బ్రహ్మహత్యాదోషం వల్ల నా చేతికే అతుక్కుంది. నేను ఆ కపాలంచేత పట్టుకొని జితేంద్రియుడనై స్వర్గంలో సంచరిస్తూ భిక్షాటన చేశాను. కాని కుమారా! ఆ బ్రహ్మహత్య దోషం పోలేదు. దాని నుండి బయటపడే ఉపాయం కనబడ లేదు. నేను మేరుపర్వతం పైన ఉన్న బ్రహ్మసరోవర తీరంలో ఘోర తపస్సు చేయనారంభించాను. ఒకనాడు చతుర్ముఖ బ్రహ్మ ఆ సరస్సులో స్నానం చేయడానికి వచ్చి తపస్సు చేస్తున్న నన్ను చూశాడు. ఆయన్ను చూచి నేను లేచి నిలబడి నమస్కరించాను. పితామహుడు నా చేతిలోని కపాలాన్ని చూసి 'ఇదేమిటని' అడిగాడు. అది విని నేను 'బ్రహ్మదేవా! ఏమని చెప్పమంటావు? నేను దక్షుని సంహరించి అతనిచేత శపించబడ్డాను. ఈ బ్రహ్మహత్యాదోషము నుండి బయటపడే ఉపాయం కనబడుట లేదు. నా అదృష్టం కొద్దీ మీరు దర్శనమిచ్చారు. ఎక్కడ ఏ కర్మనాచరిస్తే నాకు శాపవిముక్తి కలుగుతుందో దయచేసి తెలియజేయండి' అని అడుగగా బ్రహ్మదేవుడు నాతో యిలా అన్నాడు –

'శంకరా! మహాదేవా! నీవు విచారించవద్దు. నీకు బ్రహ్మహత్య దోషం పోయే ఉపాయం చెబుతాను విను. పూర్వం గంగా యమునల సంగమ స్థానంలో మూడు వందల ధనువుల విస్తీర్ణం గల పవిత్రమైన మాధవక్షేత్రంలో మాధవుని ప్రీతి కొరకై నేను అనేక యజ్ఞాలు చేశాను. అప్పుడు ఆ యజ్ఞవేదిక నుండి భక్తవత్సలుడైన మాధవుడు శంఖచక్రగదాపాణియై, శ్రీ వత్సాంకితుడై చతుర్భుజుడుగా ఆవిర్భవించాడు. నేనాయనకు చేతులు జోడించి నమస్కరించి 'అనుగ్రహించండి' అని ప్రార్థించాను. అంతట ఆయన ప్రసన్నుడై 'బ్రహ్మ' నీవు చేసిన యజ్ఞాలతో నేను సంతుష్టుడనయ్యాను. నీవు చాలా గొప్పయజ్ఞాలు చేశావు. నీ వలన నేను సంప్రీతుడనయ్యాను. అందువలన పాపరహితుడవైన ఓ బ్రహ్మదేవా! నేటి నుండి ఈ క్షేత్రం 'ప్రయాగ' గా ప్రసిద్ధమవుతుంది. ఈ యజ్ఞవేదియందు నేను నిత్యం నివసిస్తాను.

**యత్తద్బ్రహ్మన్నిదం క్షేత్రం ప్రయాగాఖ్యం గమిష్యతి ।**
**అస్యాం వేద్యామహం నిత్యం సన్నిధానం కరోమి తే ॥**

**- వామనపురాణం, అ.20 శ్లో.61.**

'నేటి నుండి స్త్రీలుగాని, పురుషులు గాని పాపం చేసిన వారెవరైనా ఈ క్షేత్రపాలకుడైన నన్ను దర్శించి సేవిస్తే అన్ని పాపముల నుండి విముక్తులవుతారు' అని మాధవుడు నాకు వరం ప్రసాదించి నా అభీష్టాన్ని నెరవేర్చి ఈ పవిత్రమైన ప్రయాగ క్షేత్రంలో లక్ష్మీదేవితో కూడ నివసిస్తున్నాడు. మహాదేవా! నీవు కూడా ఆ పుణ్యక్షేత్రానికి వెళితే నీ బ్రహ్మహత్యాదోషం నశిస్తుంది అని నాతో పలికి బ్రహ్మదేవుడు సత్యలోకానికి వెళ్ళాడు. అంతట నేను సంతోషించి ప్రయాగ క్షేత్రానికి వెళ్ళాను. ఆ క్షేత్రంలో ప్రవేశించిన వెంటనే ఆ బ్రహ్మహత్య నానుండి విడివడి ఐదు క్రోసుల దూరానికి వెళ్ళి గట్టిగా ఏడుస్తూ ఎటో వెళ్ళిపోయింది. ఆ కపాలం నా చేతి నుండి జారిపోయింది. నా మనస్సు ప్రసన్నమైంది.

అప్పుడు నేను ఆ ప్రయాగ క్షేత్రంలోని నదీ సంగమస్థానంలో స్నానంచేసి మాధవుణ్ణి దర్శించి, నమస్కరించి ఆ క్షేత్రాన్ని నాకిమ్మని మాధవుణ్ణి ప్రార్థించాను. అంతట జనార్దనుడు నన్ననుగ్రహించి ఆ మాధవక్షేత్రాన్ని నాకు ప్రసాదించి 'నన్నక్కడ తపస్సు చేయమని చెప్పి శంఖ చక్ర గదాధారియై లక్ష్మీదేవితో కూడి వైకుంఠానికి వెళ్ళాడు. నేనక్కడ తపస్సు చేసి బ్రహ్మహత్యా దోషాన్ని పోగొట్టుకొని పార్వతీదేవితో అక్కడే విహరిస్తూ ఉన్నాను. కుమారా! షణ్ముఖా! లక్ష్మీసహితుడు, మనోహరమైన రూపం కలవాడు, పుట్టుక లేనివాడు, శ్రీహరి, నీలమేఘశ్యాముడు, పీతాంబరధారి, ఎఱ్ఱని పాదపద్మములు గలవాడు అయిన శ్రీమన్నారాయణుని ధ్యానిస్తూ, అర్చిస్తూ నేనక్కడ ఉంటున్నాను. అని మహేశ్వరుడు తన కుమారుడైన షణ్ముఖునికి ప్రయాగ క్షేత్రమాహాత్మ్యాన్ని తెలియజేశాడు.

## వేంకటాద్రి వైభవం

నారదమహర్షి వాల్మీకితో 'మహర్షీ! కుమారుస్వామి తన తండ్రి, తత్త్వదర్శి యైన పరమేశ్వరుడు చెప్పిన మంగళప్రదములు, పాపపరిహారకములు అయిన మాటలు విని సంతుష్టుడై మరల తండ్రిని యిలా అడిగాడు – తండ్రీ! నాకు కూడా తపస్సు చేయటానికి యోగ్యమైన శుభప్రదమైన క్షేత్రాన్ని గురించి తెలియజేయండి. ప్రభూ! ఎక్కడ తపస్సుచేసి ఆ తపస్సుకు విఘ్నాలు కలుగవో అటువంటి పుణ్యక్షేత్రాన్ని గురించి తెలియజేయండి. సంసారదుఃఖాన్ని పోగొట్టే ఓ దేవదేవా! యోగీంద్రులచే నమస్కరించబడే దివ్యచరణార విందములు కలవాడా! వంద్వాతీతుడా! ఆనందైక స్వరూపా! శంకరా! అటువంటి ఉత్తమమైన వైష్ణవ క్షేత్రాన్ని గురించి నాకు తెలియజేయండి. మీరాజ్ఞాపిస్తే నేనక్కడకు వెళ్ళి తపస్సు చేస్తాను.' అని ప్రార్థించగా పరమశివుడు సంతుష్టుడై పార్వతీదేవిని చూచి కర్తవ్యపరాయణుడైన కుమారునితో 'నాయనా! పుత్రా! దేవతల దుఃఖాన్నిపోగొట్టిన ఓ స్కందా! పూర్వం 'వృషుడ' నే ధర్మదేవతచేత పూజింపబడిన 'వృషాద్రి' అనే ఒక గొప్ప పర్వతమున్నది. నీవు నెమలి వాహనాన్నధిరోహించి అక్కడకు వెళ్ళి తపస్సు చేయి'. అని ఆజ్ఞాపించగా షణ్ముఖుడు మరల తండ్రినిలా అడిగాడు.

'తండ్రీ! మీరు 'వృషాద్రి' అనే మహాపర్వతాన్ని గురించి చెప్పారు కదా! కులపర్వతాలలో ఇది లేదు. మరి యీ మహాపర్వతమెక్కడున్నది? ఆ వృషుడనే దేవతా పురుషుడు అక్కడ గొప్పతపస్సెందుకు చేశాడు. వృషుడంటే వృషభమా! లేక ధర్మదేవతా? మనువా? ఓ నీలలోహితా! పుత్రవత్సలా! మీరు చెప్పిన ఆయన ఎవరో తెలియజేయండి'. అని కుమారుడడగగా వృషభధ్వజుడైన శంకరుడు యిలా చెప్పాడు.

కుమారా! ఇది కులపర్వతం కాదు. ఇది మేరుపుత్రుడైన మహాపర్వతం. ఇది ముల్లోకాలలోను అంజనాద్రిగా ప్రసిద్ధి చెందింది. వత్సా! ఈ పర్వతం బంగారు మయమైంది. రత్నసానువులతో శోభిస్తూ ఉన్నది. శేషునికి, వాయుదేవునికి జరిగిన పోరాటంలో ఈ పర్వతం దక్షిణదిశకు నెట్టివేయ బడింది. పూర్వం విష్ణుమూర్తి ఈ పర్వతాన్ని యిక్కడే ఉండమని, యిలా ఆజ్ఞాపించాడు. ఈ అంజనాద్రి పరమ పవిత్రమైనది. దీనిలో సకల తీర్థాలున్నాయి. ఇది మానవులకు చాలా దుర్లభమైనది. ఇది దేవతాభూమి. 'ఓ పర్వతమా! నీవు దక్షిణదిశలో ఉండు' అని శ్రీహరి ఆజ్ఞాపించినా ఆ పర్వతం తన తండ్రియైన మేరువును వదలి ఉండలేక తండ్రి ఆజ్ఞకొరకు ఎదురుచూస్తూ కొంతకాలమక్కడే ఉంది.

ఆతరువాత ఆదిశేషునికి, వాయుదేవునికి లోకభయంకరమైన వివాదమేర్పడింది. అప్పుడు తన తండ్రియైన మేరువు అనుజ్ఞతో ఈ పర్వతం దక్షిణదిశకు వచ్చింది. తూర్పు సముద్రానికి ఐదు యోజనాల దూరంలో దక్షిణ సముద్రానికి ఉత్తర దిక్కున 36 యోజనాల దూరంలో పరమపవిత్ర మైన సువర్ణముఖరీ నదికి ఉత్తర తీరంలో రెండున్నర క్రోసుల దూరంలో హరిచందన వృక్షాలతో అలంకరించబడిన రమ్యమైన అడవిలో అనేక రసముల వృక్షాలతో కూడిన సుందరవనంలో వచ్చి చేరింది.

ఆ పర్వతంపై సిద్ధులు, ముని గణాలు ఎల్లప్పుడు తపస్సు చేస్తూ ఉంటారు. చండాలురు, యవనులు, వేదాలయందు నమ్మకం లేనివారు, నాస్తికులు ఆ పరమ పవిత్రమైన పర్వతాన్ని ఎక్కడానికి సాధ్యం కాదు. శుకమహర్షి మొదలైన కొందరు మునులు, భృగువు మొదలైన తపోధనులు, ప్రహ్లాదుడు మొదలైన పుణ్యాత్ములు, అంబరీషుడు మొదలైన రాజులు ఈ పర్వతాన్ని విష్ణువు యొక్క మరొక దేహంగా భావిస్తూ దానిని పాదములతో తొక్కుటకు భయపడి దాని సమీప ప్రాంతాలలో నివసిస్తూ ఆ పర్వతం నుండి వెలువడిన నదులలోనే స్నాన, తర్పణాదులు ఆచరిస్తూ ఆ జనార్దనుని సాక్షాత్కరించుకొనుటకై తపస్సు చేస్తున్నారు.

ఆ పర్వతం ఈ విధంగా నిత్యము అత్యంత పవిత్రమైంది. ఆ పర్వత శిఖరాన్ని చూస్తేనే వెంటనే పాపాలన్నీ నశిస్తాయి. ఆ పర్వతంపై సనాతనుడైన నారాయణుడు వరాహరూపంలో ఉన్నాడు. ఆయన తానుద్ధరించిన భూదేవిని ఆలింగన మొనర్చుకొని తన తొడపై ఉంచుకొని విరాజిల్లుతున్నాడు. మునిగణాలు మూడు సంధ్యలలో శ్రద్ధతో ఆయనను ఆరాధిస్తాయి. అప్పటినుండి ఆ పవిత్రక్షేత్రం వరాహక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది.

**తత్రాస్తే కోలరూపీ తు మహావిష్ణుః సనాతనః ।**
**తదా ప్రభృతి తత్పుణ్యం వారాహః క్షేత్రముచ్యతే ॥**

**వామనపురాణం అ.21 శ్లో.24,26**

ఆ పరమ పవిత్రమైన పుణ్యప్రదమైన వరాహక్షేత్రంలో వేంకటాద్రిలో భూవరాహస్వామి సన్నిధిలో ఎవరైతే జితేంద్రియులై వ్రతదీక్షలో శాస్త్రోక్త ప్రకారంగా ఉత్తమోత్తమమైన వరాహ మంత్రాన్ని ఒక నెలరోజుల పాటు నిరంతరం నిర్మల చిత్తంతో జపిస్తారో వారికి ఇళ్ళు, భూములు, మొదలైన కోరికలన్నీ వెంటనే సిద్ధిస్తాయి. చాలాకాలం రాజ్యపాలన కోరుకునే రాజులు షోడశ మహాదానాలు అక్కడ చేసి భూదేవిని దక్షిణలతో సంతృప్తిపరిస్తే వారికి వరాహస్వామి భక్తవత్సలుడైన భగవానుడు చిరకాలం సముద్రముతో చుట్టబడినది. విజ్ఞులు, జానపదులతో కూడినది. నిష్కంటకమైన భూమిని ప్రసాదిస్తాడు.

వరాహరూపంలో ఉన్న శ్రీహరిని, ఆయన ఒడిలో ఉన్న భూదేవిని తిరస్కరించి ఎవరైనా భూమిని పరిపాలించాలనుకొంటే ఆ దోషం వల్ల ఆ రాజ్యంలో అతివృష్టి, అనావృష్టి, దొంగల బాధ, శత్రుపీడ, గొప్ప వ్యాధులు మొదలైనవి సంభవిస్తాయి.

కావున అక్కడ భూదేవితో కూడియున్న వరాహస్వామిని రాజు శ్రద్ధాభక్తులతో చక్కగా ఆరాధించాలి. ఆ దేవదేవుని కెదురుగా త్రిలోకపావని యైన స్వామి పుష్కరిణి అనే తీర్థరాజం విరాజిల్లుతున్నది. ప్రాణికోటిని పవిత్రం చేసే ముల్లోకాలలోని తీర్థాలు, పుష్కరిణులు, ఈ బ్రహ్మాండంలోని నదులన్నీ కూడా తమను పవిత్రం చేసుకోవడానికి ప్రతి సంవత్సరం స్వామి పుష్కరిణిలో స్నానం చేయడానికి వస్తాయి.

కుమారా! షణ్ముఖా! పూర్వం వైవస్వత మనువు లోకాన్ని పరిపాలిస్తూ ఉండగా ధర్మరూపుడైన మనువు తపస్సు చేశాడు. అతనినే వృషుడన్నారు. అతడు తపస్సు చేస్తూ ఉండగా లోకంలో ధర్మం వృద్ధి చెందింది. అప్పుడు వరాహస్వామి భూదేవితో కూడ శరత్కాల మేఘం వలె ప్రత్యక్షమై ప్రసన్నుడై ఆ ధర్మునితో యిలా అన్నాడు.

'ఓ ధర్మా' నీవు చేసిన తపస్సువల్ల లోకంలో ధర్మం అభివృద్ధి చెందింది. కావున ఈ పర్వతం 'వృషాద్రి'గా ప్రఖ్యాతి చెందుతుంది. నీవు కూడా యమధర్మరాజు తరువాత లోకపాలకుడవుతావు' అని ఆ ధర్మానికి వరమిచ్చి ఆ దేవదేవుడు ఆ పర్వతంపై అంతర్ధానం చెందాడు. ఆ ధర్ముడు కూడా వరాలను పొంది తపస్సు విరమించి తన నివాసానికి వెళ్ళాడు.

**వైవస్వతే మనౌ పుత్ర! లోకం శాసతిచాజ్ఞయా ।**
**ధర్మో మనుస్తపస్తేపే సోయం వృష ఇతీరితః ॥**
**తపశ్చరతి తస్మింస్తు వవృధే ధర్మ ఉత్తమః ।**
**– వామనపురాణ అ.21. శ్లో.28,39**
**'ధర్మ' త్వయాతపస్తప్తం వృషశ్చ వవృధే యతః ।**
**తస్మాదయం గిరివరో వృషాభిఖ్యాం గమిష్యతి ॥**
**- వామనపురాణం, అ.21 శ్లో.40,41**

ఇప్పుడు వాయుదేవుడు ఆ పర్వతంపై తారక మంత్రాన్ని జపిస్తూ అక్షమాలతో లెక్కిస్తూ పరాత్పరుడైన రామచంద్రుని యథావిధిగా పూజిస్తూ భూదేవీ సహితుడు, చతుర్భుజుడు, కిరీటం ధరించినవాడు, శంఖ చక్ర ధనుర్బాణాలను ధరించినవాడు, నల్ల కలువల కాంతి కలవాడు. దేవదేవుడు, జగన్నాథుడు అయిన శ్రీమన్నారాయణుని సాక్షాత్కారమునకై సర్వ ప్రాణులకు ప్రాణవాయువైన వాయుదేవుడు తీవ్రమైన తపస్సు చేస్తున్నాడు. బ్రహ్మాది దేవతలు కూడా ఏ దేవాదిదేవుని నిశ్చల చిత్తంతో సేవించాలనుకొంటారో అటువంటి సకల చరాచర జగత్తుకు అంతర్యామియైనవాడు, సర్వశ్రేష్ఠుడు అయిన భగవంతుని దర్శింపగోరి వాయుదేవుడు తన తపస్సును వృద్ధి చేయసాగాడు అని పరమశివుడు ఈ విధంగా చెప్పగా కుమారస్వామి తన తండ్రిని మరల యిలా ప్రార్థించాడు – 'తండ్రీ! నాకు కూడా మీరు విష్ణుమంత్రాలలో కెల్లా ఉత్తమోత్తమమైనది, వరప్రదమైనది, భగవంతుని పొందుటకు సాధనమైన విష్ణుమంత్రాన్ని ఉపదేశించమని ప్రార్థించగా పరమశివుడు పుణ్యశీలుడైన పుత్రునికి యథావిధిగా తారకమంత్రాన్ని ఉపదేశించాడు. మహాదేవుని వలన తారకమంత్రాన్ని పొంది స్కందుడు సంతోషించి తండ్రికి వినయంతో ప్రదక్షిణం చేసి నమస్కరించి ఆ తరువాత తల్లికి కూడ ప్రదక్షిణ నమస్కారాలు చేసి నెమలి వాహనంపై బయలుదేరాడు.

దేవతలకు సేనాపతియైన స్కందుడు వేంకటాచలానికి తపస్సుకై బయలుదేరగా ఇంద్రాది దేవతలంతా ఆ మహానుభావుని అనుసరించారు. ఈ విధంగా దేవతలతో పాటు కూడినవాడై కుమారస్వామి వేగంగా వెళ్ళి నెమలి వాహనంపై పయనిస్తూ లక్షాపాతిక వేల సెలయేరులతో కూడిన వేంకటాచలాన్ని చేరాడు. దేవతా శ్రేష్ఠుడైన కుమారస్వామి దేవగణాలతో పాటు ప్రయాణ బడలికను పోగొట్టే ఆ పర్వతంపై విశ్రమించాడు. అక్కడ తన తల్లిదండ్రులను దర్శించలేక (వారికి దూరంగా వచ్చానని) విచారించాడు.

## బృహస్పతి చెప్పిన స్కందుని పుట్టుక

ఆయనా విధంగా విచారిస్తుండగా చూచి ఇంద్రుడు ప్రేరేపించగా బృహస్పతి స్కందునితో ఇలా అన్నాడు – 'ఓ దేవసేనాపతీ! అగ్రణీ! మహాబాహూ! నీవు విచారించ వద్దు. నీ వెవరవో, శాశ్వతమైన వైకుంఠనామ మెటువంటిదో మరచినావా?' అనగా స్కందుడు సంతోషంతో బృహస్పతినిలా అడిగాడు – 'గురుదేవా! నే నెవరను? నన్ను నేను తెలుసుకోలేక పోతున్నాను. కాబట్టి నేనెవరినో మీరే చెప్పండి' అనగా బృహస్పతి 'చెబుతాను విను' అని ఇలా చెప్పసాగాడు.

పూర్వం తారకాసురుని బాధలకు తట్టుకోలేక దేవతలు సేనాపతి కావాలని బ్రహ్మదేవుని ప్రార్థించారు. అప్పుడు రాబోవు కార్యము నెరిగిన బ్రహ్మదేవుడు ఇంద్రాది దేవతలతో ఇలా అన్నాడు – "దేవేంద్రా! దక్ష ప్రజాపతి చేత అవమానింపబడిన సతీదేవి యోగాగ్నిలో తన దేహాన్ని దహించివేసింది. అప్పుడు త్రినేత్రుడు 'నేను సతీదేవిని తప్ప మరొకరిని చేపట్ట' నని ప్రతిజ్ఞ చేశాడు. సర్వవ్యాపకుడైన శివుడు నిశ్చలంగా శిలవలె నిలబడి, చేతులు పైకెత్తి వాయువును స్తంభించి, స్వస్వరూప ధ్యానం చేస్తూ, ఆత్మస్వరూపాన్ని మనస్సులో చింతిస్తూ ఆ త్రిలోచనుడు మహత్తరమైన, భయంకరమైన తపస్సు చేశాడు. అదే సమయంలో తారకాసురుడు నా గురించి తపస్సు చేశాడు. అతడు నా అనుగ్రహం కోరి ఉగ్రతపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి నేను అతనిని 'నీ కిష్టమైన వరం కోరుకో' అన్నాను.

అప్పుడతను 'శివుని కుమారునిచే తప్ప మరొకరిచే వధింపబడకుండగ' వరం కోరాడు. నేను 'తథాస్తు అలాగే అగుగాక!' అని ఆ అసురునికి వరమిచ్చాను. కాబట్టి

తారకాసురుని చంపటానికి ఇతరులెవరికి సాధ్యం కాదు. ఆ సతీ దేవియే పర్వతరాజైన హిమవంతుని పుత్రికగా పార్వతిగా జన్మించింది. తల్లి మేనకాదేవిచే లాలింపబడుతూ పెరుగుతున్నది. ఆమెతో శంకరునికి వివాహం జరిపించాలి. ఆ తరువాత తారకాసురుని సంహరించే పుత్రుని కొరకై సురేశ్వరుడైన పరమశివుని ప్రార్థించాలి. అప్పుడు విష్ణువు అంశతో వారికి మహాతేజశ్శాలియైన పుత్రుడుదయిస్తాడు. ఆ మహాత్ముని వలన మనందరికి సుఖం కలుగుతుంది.

బ్రహ్మదేవుడిలా చెప్పగా దేవేంద్రుడు దేవకార్యాన్ని నెరవేర్చుటకై వసంతునితో పాటు రతీమన్మథులను పిలిచి వారిని శంకరుని తపస్సు భగ్నం చేయడానికి నియోగించాడు. అంతట మన్మథుడు శంకరుని వశపరచుకొని పార్వతీదేవిపై ఆయనకు అనురాగం కలిగించడానికై పార్వతీ పరమేశ్వరుల సన్నిధానానికి వెళ్ళాడు. తన పూలబాణాన్నెక్కు పెట్టాడు. శివుడు అన తపస్సుకు భంగం కలగడం వల్ల మూడోకన్ను తెరిచారు. వెంటనే మన్మథుడు ఆ నేత్రాగ్నిలో భస్మమైపోయాడు. ఆ విధంగా మన్మథుని దహించి శివుడు ఆ ఉత్తమాశ్రమాన్ని వదలి వెళ్ళాడు. తపస్సు చేసేవాళ్ళు స్త్రీల సన్నిధానంలో ఉండటం మంచిది కాదు గదా! అందువల్ల (తపస్వి నామయుక్తం, హి సన్నిధానం తు యోషితః) – వామనపురాణం, అ.21 శ్లో.67. కైలాస పర్వతానికి ఉత్తర దిక్కున ఉన్న మరొక ఉత్తమాశ్రమానికి వెళ్ళాడు. ఆ తరువాత పార్వతీదేవి శివుని గూర్చి తపస్సు చేసింది. ఆమె తపశ్శక్తికి వశుడై పరమశివుడు ఆమెను వివాహమాడాడు. మన్మథుని బ్రతికించాడు. ఆ హిమవత్పర్వత ప్రాంతంలోని కైలాస శిఖరంపై చంద్ర కళాధరుడైన మహేశ్వరుడు కామవశుడై ఉమాసహితుడై వందల సంవత్సరాలు విహరించాడు. తన మనోరథాలను పొందాడు. అప్పుడు ఇంద్రాది దేవతలు ఆయనను సమీపించి, ఈ విధంగా ప్రార్థించారు –

"మహేశ్వరా! భవా! మేము పాపాత్ముడైన తారకాసురుని చేత పీడించ బడుతున్నాము. మేమా దుర్మార్గుని సంహరించడానికి సాధ్యం కావడం లేదు. అందువల్ల ఆ పాపాత్ముని సంహరించడానికి సమర్థుడైన పుత్రుని మాకు ప్రసాదించండి స్వామీ!" అని ప్రార్థించగా పరమేశ్వరుడు దేవతలను దూరంగా తొలగి పొమ్మని చెప్పాడు. మహేశ్వరునికి కోపం వచ్చిందని గ్రహించిన దేవతలు పది దిక్కులకు పారిపోయారు.

అంతట గిరిజాపతి లోకమంతా క్షోభించేటట్లు తన తేజస్సును విడిచాడు. ఆ తేజస్సు భూమి అంతటా వ్యాపించింది. దానిని భూదేవి భరించ లేకపోయింది. మరుత్తులను ప్రార్థించింది. "నేను ఈశ్వరుని తేజస్సుతో దహింపబడుతున్నాను. ఓ మరుత్తులారా! నన్ను రక్షించండి!" అని వేడుకున్నా వారు మిన్నకున్నారు. అప్పుడు దేవతలు భూదేవి బాధను చూసి అగ్నిదేవునితో 'ఓ అగ్నిదేవా! నీ తేజస్సులో శంకరుని తేజస్సును ధరించు' అని చెప్పి ఆజ్ఞాపించగా అగ్నిహోత్రుడు, హవ్యవాహనుడు శివుని తేజస్సును ధరించి దీనురాలైన భూదేవిని ఆపదనుండి రక్షించాడు.

శివుని తేజస్సును ధరించిన జాతవేదుని చూసి పార్వతీదేవి సంతోషించి 'ఓ అగ్నిదేవా! నీవు పుత్రవంతుడవగుదువుగాక! నీవు శివుని తేజస్సును ధరించావు కాబట్టి నీవు ప్రాణులన్నింటిలోను జఠరాగ్ని రూపంలో విహరించు, ప్రజ్వలించు, సంచరించు. ఇది నా ఆజ్ఞ. నీవు శంకరుడు విడచిన తేజస్సును, తేజోరూపమైన నా గర్భమును ధరించావు కాబట్టి నేను నిన్ననుగ్రహిస్తున్నాను, నిన్ను భక్తితో పూజించే వారికి సత్పుత్రులు కలుగుదురుగాక! అని అగ్నిదేవునికి పార్వతీదేవి వరాన్ని ప్రసాదించింది. ఆ తరువాత ఉమాదేవి మరుత్తులను చూచి 'నేటి నుండి మీ భార్యలు సంతానవంతులు కాకుందురుగాక' అని వారిని శపించింది.

అనంతరం పార్వతీదేవి భూదేవితో 'భూదేవా! నీవు నా పుత్రరూపమైన శివుని తేజస్సును ధరించలేదు కాబట్టి నీకు సంతాన సుఖం కలుగకుండు గాక! నీవు అనేకమందికి భార్య వగుదువుగాక!' అని భూదేవిని శపించినది. అంతట పార్వతీదేవి ప్రసన్నురాలై శాంతించి శంకరునితో కూడి భృగు పర్వత చరియలలోని తీర్థాలలో తపస్సు చేయడానికి వెళ్ళింది.

అప్పుడు దేవతలు విచారగ్రస్తులై మరల చతుర్ముఖ బ్రహ్మతో ఇలా అన్నారు – 'ప్రభూ! మేము మీ ఆజ్ఞను పాటించాము. కానీ అది వ్యర్థమయింది. పార్వతీదేవి మమ్మల్ని శపించింది. ఇప్పుడు మేమేమి చెయ్యాలి. మాగతి ఏమిటి?' అని విన్నవించుకోగా బ్రహ్మదేవుడు వారితో 'పార్వతీదేవి వాక్కు వ్యర్థం కాదు. అది సత్యమే అవుతుంది. అసత్యం కాదు. అయితే నేను మీకొక ఉపాయం చెబుతాను. మీరు అగ్నిహోత్రుని ప్రార్థిస్తే ఆయన తనలో భద్రపరచిన శివుని తేజస్సును మీకు ప్రసాదిస్తాడు. మీరు గంగను ప్రార్థిస్తే ఆమె తన గర్భంలో దానిని ధరిస్తుంది. అని చెప్పగా విని దేవతలంతా వచ్చిన దారినే వెళ్ళిపోయారు.

దేవతలందరు కలిసి వెళ్ళి గంగాదేవిని ప్రార్థించారు. వారి ప్రార్థనను మన్నించి పర్వతరాజ పుత్రియైన గంగాదేవి అగ్నిహోత్రుడు వదలిన, గొప్ప కాంతిగల తేజోరాశిని ధరించింది. ఆ తేజస్సుచే కాల్చబడిన గంగ దానిని భరించలేక ఆ దివ్యతేజస్సును పార్వతీదేవి తపస్సు చేస్తున్న ఆశ్రమ ప్రాంతంలో వదిలింది. దానితో ఆ వనమంతా బంగారుమయమయింది. (స్వర్ణమయంగా ధగధగ మెరిసిపోయింది). ఆ వనంలో పుట్టిన నిన్ను చూసి దేవతలంతా సంతోషించారు. వారు నిన్ను పోషించుటకై ఆరుగురు కృత్తికలను పంపారు. షణ్ముఖుడవైన నిన్ను వారు పోషించారు. ఓ కుమారా! నీవు బాల్యంలోనే ఇంత ప్రభావం కలవాడివి.

**(సశేషం)**

# భక్తి ముక్తి దాయకం

# అనంత పద్మనాభస్వామి వ్రతం

: చింతలపాటి
శివశంకర శాస్త్రి

శ్లో ॥ "కామదేవః కామపాలః కామీకాంతః కృతాగమః
అనిర్దేశ్యః వపుః విష్ణుః వీరః అనంతో ధనంజయః
అనంతోహుత భుగ్భోక్తా సుఖదోనైక జోగ్రజః
అంభోనిధిః అనంతాత్మా మహోదధి శయోంతకః"

భాద్రపద నక్షత్రముతో కూడిన పున్నమి గల మాసం భాద్రపద మాసము అని అందురు. భాద్రపదమంటే సమస్త ప్రాణులకు భద్రాన్నిచ్చే మాసం. ఈ మాసంలోని శుక్లపక్ష చతుర్దశి అనంత పద్మనాభ చతుర్దశి. ఈరోజు అనంత పద్మనాభుడిని పూజిస్తూ వ్రతం చేయాలని శాస్త్ర వచనం. ఈ వ్రతానికే అనంత పద్మానభవ్రతం, అనంత చతుర్దశీ వ్రతం, అనంతవ్రతం అని పేరు. భాద్రపద మాసము నందు వ్రతములు, పండుగలలో వినాయక చవితి తర్వాత అత్యంత ప్రసిద్ధి చెందిన వ్రతము అనంతపద్మనాభ వ్రతము.

అనంత అనగా అంతము లేనివాడని అర్థము. అనంతుడు అనునది విష్ణుభగవానునకు గల పలు నామములలో ఒక నామము. అనంతుడిని ఉద్దేశించి చేయు వ్రతము కనుక ఈ వ్రతమును అనంతపద్మనాభ వ్రతము అని అంటారు. ధర్మార్థ కామ మోక్షాలను అనుగ్రహించేవాడు, తనను ఆశ్రయించిన భక్తుల కోరికలను తీర్చేవాడు, మనోహరమైన రూపం కలవాడు, వేదములను ఉద్ధరించినవాడు శ్రీమహావిష్ణువు. శ్రుతులను కాపాడిన విశ్వకళ్యాణ చక్రవర్తి ఆయన. సకల చరాచర సృష్టికి పోషకుడు, స్థితికారకుడు. అలాంటి శ్రీమహావిష్ణువును తలచుకోవడం కూడా పుణ్యఫలప్రద దాయకమే. తలచినదే తడవుగా కనిపించే ఆ నల్లనయ్య, పిలిచినదే తడవుగా పలికే చల్లని దైవంగా యుగయుగాలుగా అనేక రూపాల్లో ఈ పరిపూర్ణమైన పుణ్యధరిత్రిపై విరాజిల్లుతున్నాడు. ఆ రూపాల్లో అత్యంత మహిమాన్వితమైన, సుందరమైన, సులభప్రసన్నమైన రూపం అనంత పద్మనాభుడు.

"అనంతశ్చాస్మి నాగానం వరుణో యాదసా మహమ్
పితౄణా మర్యమా చాస్మియమః సంయమతా మహమ్"

అనంత అనే పేరు విశిష్టమైన నామమని శంకర భాష్యం చెబుతోంది. విష్ణువును ఆద్యంత రహితుడైన, విశ్వవ్యాప్తమైన శక్తిగా ఈ నామం మన కళ్ళకు కడుతుంది. అనంతమైన దైవీశక్తిని భక్తికి అనుసంధానం చేసి భక్తుడిని అనుగ్రహించే దివ్యరూపమే అనంతపద్మనాభుడు. సకల సంపత్ప్రదాయకుడు. అనంతుడంటే ఆదిశేషుడు అనే అర్థం కూడా ఉంది. అనంతుడి అనుగ్రహం ఉంటే సకల శాస్త్ర పారంగత్వము కలుగుతుందని పురాణ వచనం. అనంత, అచ్యుత, గోవింద అనే నామములతో స్వామిని నిరతమూ మనం తలచుకుంటూ ఉంటాము. ఒక్క అనంతుని తల్చుకుంటే చాలు ఆయన హృదయాంతర వర్తినియైన శ్రీమహాలక్ష్మి అనుగ్రహం, నిరంతరం ఆయన ధ్యానంలో కొలువై ఉండే ఈశ్వరానుగ్రహం, అనంతుని నాభికమలం నుండి ఉద్భవించిన బ్రహ్మదేవుని అనుగ్రహం, అనంతునికి పాయక శయ్యయైన ఆదిశేషుడి అనుగ్రహం పుష్కలంగా లభిస్తాయి. అనంతుని కొలిచిన భక్తులు నిరంతరం సిరిసంపదలతో తులతూగుతారు. అష్టైశ్వర్యాలను పొందుతారు. అనంత పద్మానభవ్రత ప్రస్తావన భవిష్య పురాణంలోను, మహాభారతంలోని సభాపర్వంలోను కనబడుతుంది.

కౌరవులు, పాండవులకూ మధ్య జరిగిన జూదంలో పాండవులు ఓడిపోయి, అరణ్యవాసానికేగినప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణునితో ఈ బాధల నుండి విముక్తిని ప్రసాదించమని ప్రార్థించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునితో అనంత పద్మనాభ వ్రతము అని ఒక వ్రతము ఉన్నది. ఆ వ్రతమును భాద్రపద శుక్ల చతుర్దశి నాడు జరుపుకుంటారు. దంపతులు భక్తిశ్రద్ధలతో ఈ వ్రతమును ఆచరించి ఒకరికొకరు తోరమును కట్టుకుంటారు. ఈ వ్రతమున తోరమునకు అధిక ప్రాధాన్యత ఉంది. కట్టుకున్న తోరమును మరుసటి సంవత్సరము వచ్చు అనంతచతుర్దశి వరకు ఉంచుకోవాలి. ఈ తోరము వారిని శ్రీరామ రక్షలాగా కాపాడుతుంది. ఈ వ్రతము శుభములను కలుగజేస్తుంది. మనోభీష్టాలను నెరవేరుస్తుంది అని శ్రీకృష్ణుడు జవాబిచ్చాడు.

అంతట ధర్మరాజు శ్రీకృష్ణునితో తిరిగి మాట్లాడుచూ "దేవా! ఈ వ్రతమును చేయు విధానమును వివరించండని వేడుకున్నాడు. ధర్మరాజుతో శ్రీకృష్ణుడు వ్రత విధానమును గురించి వివరించుచూ త్రయోదశితో కూడిన చతుర్దశి పనికిరాదని, పూర్ణిమతో కూడిన చతుర్దశి ఈ వ్రతమునకు ముఖ్యమని, వ్రతమును ఆచరించువారు క్షమ, దయ, దాన, శౌచ, ఇంద్రియ నిగ్రహము, దైవపూజ, అగ్నిహోత్రము మున్నగువాటిని పాటించినప్పుడే వ్రతపుణ్యం ప్రాప్తిస్తుందని భవిష్యోత్తర పురాణము ద్వారా తెలియుచున్నది.

ఈ వ్రతమును ఆచరించువారు ఉదయముననే అనగా బ్రాహ్మీ

ముహూర్తంలో లేచి కాలకృత్యములను తీర్చుకుని సమీపమున గల నదీతీరమునకు గానీ, ఏదైనా జలాశయము దగ్గరకు గాని పోయి స్నానమాచరించాలి. స్నానానంతరం గృహాన్ని, పూజామందిరాన్ని శుభ్రం చేసుకుని, అలంకరించుకుని పూజకుపక్రమించాలి. పూజామందిరంలో మంటపాన్ని ఏర్పాటు చేసి అష్టదళ పద్మాన్ని ముగ్గుగా వేసి, దానిపై తెల్లటి వస్త్రాన్ని పరచి, దానిపై బియ్యం పోసి, ఆ బియ్యం మీద కలశాన్ని ఉంచి, దర్భలతో చేసిన అనంతుని ఆకృతుని

**"కృత్యా దర్భమయం దేవం శ్వేత ద్వీపే స్థితం**
**హరిం సమన్వితం సప్తఫణైః పింగళాక్షం చతుర్భుజం"**

అనే శ్లోకంతో దర్భలపైకి ఆహ్వానించి ప్రతిష్ఠించుకోవాలి. కలశోదకంగా యమునా నది నీటిని పోసి, కలశపూజని చేయాలి. శ్రీకృష్ణునికి యమునతో అత్యంత సన్నిహిత సంబంధం ఉందన్నది లోకవిదితమే. అందువలన యమునను పూజించిన వారిపై ఆయన అనుగ్రహం అపారంగా వర్షిస్తుంది. కలశపూజ అనంతరం 14 శిరస్సులు గల సర్పరూపంలో అనంతుని పూజించాలి. 48 దర్భలను ముడివేసి, అగ్రాలను ఏడుగాని, పద్నాలుగు ముఖాలు కలిగిన సర్పంగా మలచి, ఆ రూపాన్ని కలశంపై ప్రతిష్ఠించి వ్రతాన్ని చేసుకోవాలి. అనంతుని షోడశోపచారాలతో పూజించిన తర్వాత బెల్లంతో చేసిన ఇరవై ఎనిమిది అరిశెలను నైవేద్యంగా సమర్పించాలి. రక్షా కంకణాన్ని ఎరుపు రంగు దారములతో తయారు చేసి పూజించాలి. ఈ తోరములను పదునాలుగు తయారు చేసుకుని పదునాలుగు ముడులను ఏర్పాటు చేసుకోవాలి. ఈ పదునాలుగు ముడులలో దిక్పతులు, రవి, వరుణుడు, అశ్వినీ దేవతలు, అగ్ని, ఇంద్రుడు, ఉపేంద్రుడు, యముడు, బ్రహ్మ, చంద్రుడు, స్కందుడు, జీవుడు, శివుడు, వాయువు మొదలైన పదునాలుగుమంది దేవతలు ఉంటారు. ఈ తోరములను పసుపు, కుంకుమలతో, పుష్పములతో, ధూప దీపములతో పూజించి భర్త, భార్య ఎడమ చేతికి కట్టాలి. అదేవిధముగా భార్య భర్త కుడిచేతికి కట్టాలి. ఈ తోరమును మరుసటి సంవత్సరమున వచ్చు అనంత చతుర్దశి వరకు భద్రముగా ఉంచుకోవాలి. ప్రతి వ్రతమునకు ఒక కథ ఉన్నట్లే, ఈ వ్రతానికి కూడా ఒక కథ ఉన్నది.

కృత యుగంలో సుమంతుడు అను ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు చాలా బీదవాడు. అతని భార్య పేరు దీక్ష. వారికి శీల అనే ఒక కుమార్తె కలిగింది. కొంతకాలానికి దీక్ష మరణించడంతో సుమంతుడు కూతురు బాగోగులు చూడడానికి బంధుమిత్రుల సలహాలతో కర్కశ అనే స్త్రీని వివాహమాడాడు. కర్కశ పేరుకు తగినట్లే చాలా కర్కశురాలు. రాను రానూ శీలను మారుటితల్లి యాతనలు పెడుతూ ఆమె పాలిట కర్కోటకురాలిగా మారింది. శీలకు యుక్తవయస్సు రావడంతో తండ్రి తన కుమార్తెను కౌండిన్య రుషికి ఇచ్చి వివాహం చేశాడు. కుమార్తెను అత్తవారింటికి పంపుతూ చీరా సారెలతో పంపించలేని తన దుస్థితికి చింతించుచు వట్టి చేతులతో పంపించలేక ఇంట్లో ఉన్న పేలపిండిని ఇచ్చి పంపాడు. నూతన దంపతులు కాలినడకన తమ ఊరికి పయనమయ్యారు. మధ్యాహ్న సమయానికి ఒక జలాశయ తీర ప్రాంతానికి చేరుకుని అక్కడ ఒక వృక్షము కింద అలసటను తీర్చుకోవటానికి బస చేశారు. ఆ వృక్ష సమీపాన కొందరు మహిళలు పూజ చేయడం గమనించి వారి వద్దకు వెళ్ళి వివరాలను తెలుసుకుని తిరిగి వటవృక్షము వద్దకు చేరుకుని సువాసినులు చెప్పిన విధంగా వ్రతము చేసి, బ్రాహ్మణులకు, ముత్తైదువులకు వాయనములను ఇచ్చి తోరమును కట్టుకుంది.

కౌండిన్యుడు భార్య ముంచేతికి తోరమును చూసి ఇదేమిటి? ఎందుకు కట్టుకున్నావని అడిగాడు. భార్య చెప్పిన విషయములను నమ్మక వశీకరణ తోరము అని భావించి, ఆగ్రహించి ఆ తోరమును తెంపి అగ్నిలో పడవేశాడు. వెంటనే శీల ఆ తోరమును అగ్నిలో నుండి తీసి పాలకుండలో వేసింది.

అనాలోచితంగా, ఆగ్రహంతో కౌండిన్యుడు చేసిన పనికి వారి సంపన్నత దూరమయింది. సంపద దూరమై కష్టములు దరిచేరడంతో తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంతో కుమిలిపోతూ దేశదేశాలు తిరుగుతూ, భగవంతుని అన్వేషిస్తూ పిచ్చిపట్టిన వానివలె తిరగసాగాడు.

కౌండిన్యుని దుస్థితిని చూసి అతనిని సన్మార్గంలో పెట్టాలని భావించిన పద్మనాభుడు వృద్ధ బ్రాహ్మణుని రూపంలో వచ్చి అతనికి దుఃఖోపశమనం కావించి ఒక గుహలోకి తీసుకుపోయాడు. అక్కడ అతనికి పద్మనాభుడు దర్శనమిచ్చాడు. కౌండిన్యుడు ఆనందంతో స్వామిని పరి పరి విధాలుగా స్తుతించి తన తప్పును క్షమించమని ప్రార్థించాడు. అంత అనంతుడు కౌండిన్యుని క్షమించి, వరాలను ప్రసాదించి అంతర్ధానమయ్యాడు. కౌండిన్యుడు తన గృహానికి చేరుకుని, భార్యను కలుసుకుని జరిగిన వృత్తాంతమంతయు వివరించి అనంతుడు చెప్పినవిధంగా భక్తి ప్రపత్తులతో వ్రతమును ఆచరించి, అంత్యకాలమున ముక్తిని పొందాడు.

అనంత పద్మనాభ వ్రతము ఎంతో మహిమాన్వితమైంది. నియమ నిష్ఠలతో, భక్తి ప్రపత్తులతో పరమాత్మ ప్రసాదించిన వ్రతములను ఆచరించి భగవద్భక్తితో పాటు సద్గుణాలను అలవర్చుకుని జీవితములను తరింప చేసుకోవాలనే సందేశమును పాటించి, గ్రహించి మెలిగిన భక్తి, ముక్తి రెండింటిని పొందగలరు. కౌండిన్యుడు తన తప్పు తెలుసుకుని భార్యతో కలిసి అమిత భక్తితో అనంత పద్మనాభ వ్రతాన్ని చేసి మరణానంతరం తేజో రూపమైన నక్షత్రంగా మారి నక్షత్రమండలం చేరాడు.

**సర్వేజనా... సుఖినోభవంతు**

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ

ధారావాహికం



గత సంచిక తరువాయి

## గురువారపు సేవలు – తిరుప్పావడ లేదా అన్నకూటోత్సవం

**"గురువార – గురుతర సేవా మహిమా వర్ణింపగ మా తరమా! పరమాత్మా... తిరువేంకట శిఖర పరంధామా!"**

ప్రతి గురువారం స్వామివారికి రెండవ అర్చనానంతరం, ఉదయం 6 గంటలకు జరిగే నివేదనను తిరుప్పావడ సేవ లేదా అన్నకూటోత్సవం అంటారు. సాధారణంగా మనం ఇంట్లో, మహా అయితే 1–2 కిలోలు, అదే దేవాలయాల్లో, రామనవమి, వినాయకచవితి ఉత్సవాల్లో 10–15 కిలోల పులిహోర వండుకుంటాం. కాని గురువారం జరిగే తిరుప్పావడ లేక అన్నకూటోత్సవ సేవలో, బళ్ళకొద్దీ, వందలాది కిలోల పులిహోర కలిపి, స్వామి నైవేద్యానంతరం భక్తులకు ప్రసాద వితరణ చేస్తారు.



గురువారం ప్రాతఃకాల ఆరాధన పూర్తి కాగానే, అర్చకస్వాములు ఏకాంతంగా శ్రీవారికి అలంకరించిన స్వర్ణాభరణాలు, పీతాంబరాల నన్నింటినీ సడలింపు చేస్తారు. తరువాత ఊర్ధ్వపుండ్రాన్ని (తిరునామాన్ని) సగానికి తగ్గించి, స్వామి వారి నేత్రాలు స్పష్టంగా, నయనానందకరంగా కనపడేటట్లు చేస్తారు. ఆభరణాలు లేకుండా స్వామివారి దివ్యమంగళకరమైన, రూపాన్ని రోజుల్లా చూడగలిగే భాగ్యం కేవలం గురువారం నాడు మాత్రమే కలుగుతుంది.

అనంతరం పండితులు వేదపారాయణతో పాటు శ్రీనివాస గద్యం పఠిస్తుండగా, ఈ "అన్న నివేదన" జరుగుతుంది. బంగారు వాకిలి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో ఉన్న నాలుగు స్తంభాల మధ్య 484 కిలోల బియ్యంతో తయారు చేసిన పులిహోర రాశిని, ప్రత్యేకంగా తయారు చేయబడ్డ ఓ అతిపెద్ద, లాగుడుబండి వంటి వెండి శకటంలో పెద్ద శిఖరంలాగా అమర్చుతారు. దానికి ఎనిమిది దిక్కుల్లో పులిహోరతో ఎనిమిది చిన్న శిఖరాలను ఏర్పాటు చేసి నివేదన చేస్తారు. పులిహోరతో పాటుగా, గురువారం నాడు మాత్రమే తయారు చేయబడ్డ పెద్ద జిలేబీలు, మురుకులు (తేనె తోళీలు లేదా కారం జిలేబీ) వంటి వాటిని కూడా చక్కగా అమర్చి పూలతో అలంకరిస్తారు.

## స్వామివారికి అన్నం ఎందుకు నివేదించాలి?

సమస్త జీవకోటికి ప్రాణాధారం అన్నం. అన్నం పరబ్రహ్మ

స్వరూపం. మన జీవనం సజావుగా సాగిపోవడానికి భగవంతుడు మనకు ప్రసాదిస్తూ వస్తున్న అన్నానికి కృతజ్ఞతగా, సమస్త జీవరాశులకు ముమ్ముందు కూడా ఏ లోటూ లేకుండా అన్న లభ్యత చేకూరాలని ప్రార్థిస్తూ జరిగే ఈ సేవ అత్యంత ప్రముఖమైన సేవల్లో ఒకటి.

వీటితో పాటు ఇంకా అనేక నైవేద్యాలు సమర్పించి ''ఓ స్వామీ ఈ రోజు నువ్వు నిజ నేత్రాలతో సమస్త భక్తులందరినీ అనుగ్రహిస్తున్నావు. ఇదుగో స్వీకరించు నాయనా... '' అంటూ స్వామివారికి నివేదిస్తారు.

ఈ తిరుప్పావడ సేవ గాంచిన భక్తులకు, నివేదించిన పులిహోరలో ఎన్ని మెతుకులున్నాయో, అన్ని సంవత్సరాల పాటు స్వర్గవాసం లభిస్తుందని పెద్దలు చెపుతారు.

## నిజనేత్ర దర్శనం

**''కంటి నఖిలాండతతి కర్తనధికుని గంటి –**
**కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తి గంటి...''**

అంటూ, అన్నమయ్య కీర్తించిన, మహా మహిమాన్వితమైన శ్రీవారి నిజనేత్ర శోభను దర్శించడం పూర్వజన్మ సుకృతం. ప్రతి గురువారం జరిగే నిజనేత్ర దర్శనోత్సవంలో స్వామివారు సన్నటి నామాలతో, విప్పారిన నేత్రాలతో, ఆభరణాలు లేకుండా, కేవలం ధోవతి, పైపల్లెవాటుతో, మెడలో రెండు కంటెలతో, బుగ్గన పచ్చటి కర్పూర దిష్టి చెక్కతో, సొగసైన తలగుడ్డతో, నిరాడంబరంగా ఉంటారు. నల్లని మేనుతో మెరిసిపోతూ, ద్వాపరం నాటి ఆ నల్లనయ్యే కలియుగంలో ఈ శ్రీనివాసునిగా ఉద్భవించాడనే జగద్విదితమైన సత్యాన్ని దృఢపరుస్తారు. అందువల్లనే కొందరు నిజనేత్ర దర్శనాన్ని 'గోపాలుని దర్శనం' అని కూడా అంటారు. గోమాతతో అనుబంధం, గొల్లల సాన్నిహిత్యం, పాలు – పెరుగుల సేవనం, ఇవన్నీ గుర్తుకు తెచ్చుకుంటుంటే, ఆ నల్లనయ్యే ఈ చక్కనయ్య అనే నమ్మకం మరింత బలపడుతోంది.




నిజ నేత్ర దర్శనానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన అంశం స్థానికంగా వెలుగులో ఉంది. తిరుమలలో ఉన్నటువంటి సిబ్బంది, వ్యాపారులు అందరూ, గురువారం నాడు మరింత జాగ్రత్తగా, ఏ విధమైన పొరపాట్లు, తప్పిదాలు జగరకుండా జాగ్రత్త పడతారట. ఎందుకంటే, స్వామివారు సన్నటి నామాల కారణంగా వికసిత నేత్రాలతో ఉండటం వల్ల, ఏ తప్పు జరిగినా వెంటనే గమనిస్తారని వారి నమ్మకం. మిగతా రోజుల్లో అర్ధనిమీలిత నేత్రాలతో ఉన్నంత మాత్రాన ఆ సర్వాంతర్యామికి, సహస్ర నేత్రుడికీ మనం చేసే తప్పొప్పులు కనబడడం లేదనుకోవడం కేవలం అజ్ఞానం.

## పూలంగి సేవ

**''పూలంగి సేవకే పూలెన్నొ తెచ్చేము!**
**మా భక్తి సీమలో పూమాల లల్లేము!''**

పూలంగి అంటే పువ్వుల అంగీ. అనగా పుష్పాలనే వస్త్రాలుగా



ధరించడం. గురువారం నాడు జరిగే మరో సేవ పూలంగిసేవ. రాత్రి 8 గంటలకు జరిగే ఈ సేవ పూర్తిగా ఏకాంతం. జియ్యంగార్లు అందించే పూల మాలలను అర్చకులు శ్రీవారి మూర్తికి వస్త్రరూపంగా, ఉత్తరీయ రూపంగా, ఆభరణ రూపంగా, కిరీట–శంఖు–చక్రాల రూపంగా, మొత్తం పుష్పమయంగా, శోభాయమానంగా అలంకరిస్తారు. స్వామివారు పూల అంగీని తొడిగినట్లుగా, కోటి రెట్ల సౌందర్యంతో, నవ మన్మథునిలా కనువిందు చేస్తారు.

వైష్ణవాలయాలను పుష్పమండపం, జ్ఞానమండపం, త్యాగమండపాలుగా వర్గీకరిస్తారు. తిరుమల పుష్ప మండపన్నమాట. ఈ క్షేత్రంలో పూచే పువ్వులన్నీ, పూర్వజన్మల్లో

మహాభక్తులు, సి ద్ధపురుషులు, మునిపుంగవులే. వారి వారి పూర్వజన్మ పుణ్యఫలాలననుసరించి వారీ జన్మలో పూవులుగా పూచి స్వామివారికి అలంకృతమవుతున్నారు. అందువల్లనే, తిరుమలలో పుష్పాలన్నీ స్వామికే చెందుతాయనీ, వేరెవ్వరూ పూలు అలంకరించుకోరాదనే సాంప్రదాయం అమల్లో ఉంది.

సువాసనలు వెదజల్లే పుష్పాలతో అలంకరింపబడిన స్వామివారిని దర్శించుకుంటే, జన్మాంతర వాసనలన్నీ పోయి, గత జన్మల పాపాలన్నీ పటాపంచలవుతాయని భక్తుల నమ్మిక.

గురువారం నాడు జరిగే వారపు సేవలైన తిరుప్పావడసేవ, నిజనేత్ర దర్శనం, పూలంగిసేవలు సమాప్తం.

## శుక్రవారం అభిషేకం

**"కంటి శుక్రవారం గడియ లేడంట –**
**అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని!"**

అన్న కీర్తనలో అన్నమయ్య, శుక్రవారాభిషేకం సందర్భంగా శ్రీవారికి జరిగే ఉపచర్యలన్నీ ముగ్ధమనోహరంగా వర్ణించాడు. ఆ వాగ్గేయకారుని వర్ణన ముందు, మనం చెప్పుకునే అభిషేక ముచ్చట్లన్నీ, చంద్రుని ముందు దివిటీ లాగా వెల వెల బోతాయని తెలిసీ, స్వామివారి మీద భారం వేసి ఈ సాహసానికి పూనుకుంటున్నాం.



శ్రీవేంకటేశుని మూలమూర్తికి ప్రతి శుక్రవారం ఉదయం 3.30 గంటల నుండి 5 గంటల మధ్య శుక్రవార అభిషేకం జరుగుతుంది. అభిషేక సమయంలో ఆభరణాది అలంకారాలు లేకుండా ఉన్న స్వామివారి మూర్తి యొక్క సొబగులు వర్ణించడం మహామహుల తరం కూడా కాదు. తీర్చిదిద్దినట్లుండే పెదవులు, సంపెంగ వంటి ముక్కు, వికసించిన పుష్పంలా ఉండే ముఖారవిందాన్ని వీక్షిస్తూ భక్తజనులు మైమరచి పోతుంటారు.

అభిషేక సేవ పుట్టుపూర్వోత్తరాల్లోకి వెళ్తే –

పల్లవరాణి ''సామవై'' భోగశ్రీనివాసుని వెండి ప్రతిమని బహూకరించినప్పటి కాలం, అనగా 614వ సంవత్సరం ముందునుండీ విశేష సందర్భాల్లో ఈ అభిషేకోత్సవం జరిగేది. తరువాతి కాలంలో ప్రతి రెండవ శుక్రవారం (పక్షానికో సారి) జరిగేది. అయితే 11-12 శతాబ్దాల్లో భగవద్రామానుజులవారు స్వామివారి వక్షః స్థలంలో ''బంగారు అలమేల్మంగ'' ప్రతిమను అలంకరింప చేసిన శుక్లపక్ష ద్వాదశి ఉత్తర ఫల్గుణీ నక్షత్ర శుక్రవారం నాటినుండి, ప్రతి శుక్రవారం ఈ అభిషేక సేవ నిరాఘాటంగా జరుగుతూ వస్తోంది.

ప్రాతఃకాల ఆరాధన పూర్తి కాగానే, అర్చకులు తెర వేసి శుక్రవార అభిషేక నిమిత్తం, ఏకాంతంగా శ్రీవారికి సంకల్పం చేస్తారు. ఉపచారాలు సమర్పించి, అష్టోత్తర శతనామార్చన కూడా చేస్తారు. అభిషేకానికి ముందుగా శ్రీవారి ఊర్ధ్వ పుండ్రాన్ని (తిరునామం) అర్ధభాగానికి తగ్గించి సూక్ష్మ ఊర్ధ్వపుండ్రంతో ఉంచుతారు. ఉత్తరీయాన్ని తొలగించి స్నాన కౌపీనాన్ని ధరింప చేస్తారు.

ఆ సమయంలో పరిచారకులు శ్రీవారి సన్నిధానంలో రెండు వెండి గంగాళాల గోక్షీరం, మరో రెండు గంగాళాల బంగారుబావి శుద్ధోదకం సిద్ధం చేస్తారు.

జియ్యంగార్లు అందించే క్షీరంతో నిండి వున్న శంఖు పాత్రలను అర్చక స్వాములు స్వీకరించి, పండితులు వేదపారాయణం జరుపుతుండగా, క్షీరాభిషేకం చేస్తారు. అప్పుడు, శ్రీవారి వరదహస్తం నుండి జాలువారే గోక్షీరాన్ని పాత్రల్లో స్వీకరించి తరువాత భక్తులకు తీర్థంగా ఇస్తారు.

తరవాత చందనాన్ని శ్రీవారి దక్షిణహస్తంపై సమర్పించి, శ్రీవారి హస్తరేఖాంకితం చేసి అర్చకులు, జియ్యంగార్లు స్వీకరిస్తారు. పిమ్మట అర్చకులు పరిమళ పాత్రను తీసుకుని, ఆ పరిమళ ద్రవ్యాన్ని స్వామివారి కిరీటాన్నుండి ప్రారంభించి శరీరమంతా పూసి నలుగు పెడతారు. ఈ పరిమళ ద్రవ్యం పునుగు, జవ్వాది, కస్తూరి వంటి సుగంధ ద్రవ్యాల మిశ్రమం.

**"పచ్చకర్పూరమే నూరి పసిడి గిన్నెల నించి**
**తెచ్చి శిరసాదిగ దిగనలది**
**అచ్చెరపడి చూడ అందరి కన్నులకింపై**
**నిచ్చెమల్లెపూవు వలె నిటు తానుండే స్వామిని!!"**

అనే కీర్తనలో అన్నమయ్య శ్రీవారిని అభిషేక నిమిత్తం సిద్ధం చేసే ఘట్టాన్ని ముగ్ధమనోహరంగా వివరించారు.

తరువాత, మహాభక్తుడు తిరుమలనంబి వంశీయులు తెచ్చి సిద్ధంగా ఉంచిన ఆకాశగంగ తీర్థంతో, తదుపరి శుద్ధోదకంతో, స్నానాన్ని ప్రారంభించి స్వామివారి తిరుమేను పైనుండి పరిమళద్రవ్యంతో కలిసి జాలువారుతున్న అభిషేక ఉదకాన్ని అవయవాల వారీగా, ఆయుధాల వారీగా స్వీకరించి ఆ పవిత్ర తీర్థాన్ని తరువాత భక్తులకు ప్రసాదిస్తారు.

ఆ తరువాత పసుపుతో శ్రీవారి వక్షఃస్థల మహాలక్ష్మికి కూడా అభిషేకం జరుగుతుంది. ఏ యుగంలోనో బ్రహ్మాది దేవతల కోరిక మేర, కలియుగ మానవుల కోసం వెలసిన శ్రీనివాసుని యథాతథమైన రూపాన్ని, వక్షఃస్థల లక్ష్మితో సహా దర్శించే

మహద్భాగ్యం శుక్రవార అభిషేక సమయంలో మాత్రమే కలుగుతుంది. శ్రీవారి మెడలో ఉన్న బంగారు అలమేల్ మంగకు కూడా తరవాత అభిషేకం జరుగుతుంది.

తదనంతరం శ్రీవారికి 108 కలశాల శుద్ధజలంతో అభిషేకం పూర్తి చేస్తారు. ఈ అభిషేక తీర్థాన్ని ప్రధాన అర్చకుడు పాత్రలలో సేకరించి, మొదట తన శిరస్సును సంప్రోక్షించుకుని, సన్నిధానంలో ఉన్న ఇతర అర్చకులు, ఏకాంగి, ఆచార్య పురుషులు, ఆలయ అధికారుల మీద "భూతోభవః" అంటూ ప్రోక్షణ చేస్తారు.

తరువాత అర్చకులు తెరవేసి శ్రీవారికి ఉన్ శాత్ అనబడే 24 మూరల పొడవు గల సరిగంచు పట్టు ధోవతిని ధరింప చేస్తారు. అలాగే 12 మూరల ఉత్తరీయాన్ని వల్లెవాటుగా వేస్తారు. వెంటనే శ్రీవారికి గో నవనీతం (వెన్న, పంచదార) నివేదన చేసి, ముఖవాసం (కస్తూరి తాంబూలం) సమర్పిస్తారు. తరువాత పచ్చకర్పూర హారతినిస్తూ, తెర తొలగిస్తారు. తరువాత మళ్ళీ తెరవేసి, ఏకాంతంగా ఊర్ధ్వపుండ్రం, వస్త్రాలంకార సేవలు కావించి భక్తుల సందర్శనార్థం తిరిగి తెర తీయడంతో, అభిషేక సేవాకార్యక్రమం పూర్తవుతుంది. అభిషేకానంతరం గడ్డం బొట్టు మాత్రం అలంకరించరు.

శ్రీవారి శుక్రవార అభిషేక దర్శనంతో, భక్తుల జన్మ జన్మాంతర పాపాలన్నీ శుభ్రంగా కడిగివేసినట్లు తొలగిపోవడమే కాకుండా, ఆరోగ్య – ఐశ్వర్య సంపదలు సమృద్ధిగా కలుగుతాయని ప్రతీతి.

అత్యంత దుర్లభమైన ఈ సేవలో పాల్గొనాలనే ప్రగాఢ వాంఛ శ్రీనివాసుని ప్రతి భక్తికీ ఉంటుంది. అయితే, శ్రీవారి అనుగ్రహం పొందిన ఏ కొద్దిమందికో మాత్రమే ఈ భాగ్యం కలుగుతుంది.

అకుంఠిత భక్తి విశ్వాసాలతో, అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని ఎందరో భక్తులు నిరూపించారు. మనమూ ప్రయత్నిద్దాం! కృషితో నాస్తి దుర్భిక్షం!

## నిజపాద దర్శనం



ప్రతి శుక్రవారం అభిషేకానంతరం, అభిషేక సేవలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించి వెళ్ళిన తరువాత నిజపాద దర్శనం అనే ఆర్జిత సేవ ప్రారంభమవుతుంది. ఈ సేవలో పాల్గొనే భక్తులు స్వామివారి పాదాలను ఎటువంటి ఆచ్ఛాదన లేకుండా చూడవచ్చు. మిగిలిన వేళల్లో ఆ పాదాలు బంగారు తొడుగులతో విరాజిల్లుతూ ఉంటాయి.

మూలమూర్తిని శ్రద్ధగా గమనిస్తే, శ్రీవారు దక్షిణ హస్తంతో తన పాదద్వయాన్ని సూచిస్తుంటారు. వామహస్తం కటిభాగాన, కుడివైపు తిరిగి నేలకు సమాంతరంగా ఉంటుంది. అంటే, భక్తులు తన పాదాల్ని శరణు వేడితే, వారిని తన వామహస్తంతో అక్కున చేర్చుకుంటానని సందేశమిస్తున్నారన్నమాట. అందువల్లనే శ్రీవారి పాద దర్శనంతో పాపాలు పటాపంచలౌతాయని తరతరాల నమ్మిక.

శ్రీవారి పాద దర్శనం సర్వపాప విమోచనం.

బ్రహ్మ కడిగిన ఆ పాపాలు కనికరిస్తే కానిదేముంటుంది?

## వస్త్రాలంకార సేవ

ఈ ఆర్జితసేవ కూడా ప్రతి శుక్రవారం శుక్రవారం అభిషేకానంతరం జరుగుతుంది.

అర్చకులు ముందుగా భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలను శ్రీవారికి ధరింపచేసి, వారిని ఆభరణాలతో అలంకరిస్తారు.



ఇదంతా ఏకాంతంగా జరుగుతుంది.

వస్త్రాలంకార మరియు అభిషేక సేవల్లో పాల్గొన్న భక్తులను నైవేద్యం తరువాత, నూతన వస్త్రధారుడైన వేంకటేశుని దర్శించటానికి అనుమతిస్తారు.

శ్రీవారికి సడలింపు చేసిన వస్త్రాన్ని, విమాన ప్రదక్షిణ మార్గంలో ఉన్న సబేరా అనే గదిలో భద్రపరుస్తారు. స్వామివారి అలంకరణకు కావలసిన ఇతర సామగ్రి, ఏకాంతసేవలో ఉపయోగించే వెండి మంచం మొదలైనవన్నీ కూడా ఈ గదిలోనే భద్రపరుస్తారు.

అత్యంత ప్రముఖులు శ్రీవారి దర్శనార్థం వచ్చినప్పుడు వారికి ఈ సడలింపు చేయబడిన వస్త్రాన్ని మేల్చాట్ వస్త్రంగా బహూకరిస్తారు. అందుకే ఈ సేవను మేల్చాట్ వస్త్రసేవ అని

కూడా అంటారు. శ్రీవారి సేవలన్నింటిలో ఖరీదైన ఈ సేవ నిమిత్తం ఒక జంటకు ప్రస్తుతం 12,250 రూపాయలు చెల్లించాలి.

తిరునామంతో పాటుగా శ్రీవారి గడ్డం కూడా కర్పూరంతో అలంకరింపబడి ఉండటం మనం చూసే ఉంటాం. అలాగే శ్రీవారి మహాద్వారానికి కుడివైపుగా (మందిరంలోకి వెళ్తూంటే) అలంకరింపబడిన గడ్డపారను కూడా తరచూ ఆలయాన్ని సందర్శించేవారు గమనించే ఉంటారు. వీటన్నింటికీ సంబంధించి ఓ ఆసక్తికరమైన కథను, మరో మహాభక్తుడు, భక్తశిఖామణి అనంతాళ్వార్ గురించి తెలుసుకునే ముందు, ప్రతి సోమవారం నాడు జరిగే విశేష పూజల గురించి తెలుసుకుందాం.

## విశేష పూజ

ఈ ఆర్జిత సేవ ప్రతి సోమవారం ఉదయం 6 గంటలకు సంపంగి ప్రదక్షిణం లోని కళ్యాణ మంటపంలో, ఉభయ నాంచారులతో కూడిన మలయప్ప స్వామివారికి జరపబడుతుంది. 1991వ సంవత్సరంలో ఈ సేవ ప్రవేశపెట్టబడింది.

శ్రీ మలయప్ప స్వామి కళ్యాణ మంటపానికి వేంచేసిన తరువాత, వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించిన పిదప, స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. తదనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేస్తారు.

శనివారం, ఆదివారం ప్రత్యేక సేవలు ఏమీ ఉండవు.

## అనంతాళ్వార్

1053 సంవత్సరంలో జన్మించిన అనంతాళ్వార్ సుమారు 84 సంవత్సరాలు జీవించారు. సుదీర్ఘకాలం పాటు శ్రీవారి పుష్పకైంకర్యంలో పాలు పంచుకున్న ఆ ధన్యజీవి, శ్రీవారి భక్తులందరికీ ప్రాతఃస్మరణీయుడు.

**తిరుమల ప్రయాణం:** పూర్వం భోగమండపమైన శ్రీరంగం క్షేత్రంలో, భగవద్రామానుజులు శ్రీవైష్ణవ విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని శిష్యులకు వివరిస్తూ, తిరుమల క్షేత్రంలో స్వామివారికి పుష్పమాలా కైంకర్యం చేయడం భగవత్ప్రీతికరమని సెలవిచ్చారు. అలాగే శాశ్వతంగా తిరుమలలో ఉంటూ, వేంకటేశునికి పుష్పసమర్పణ చేయగల వారెవరైనా ఉన్నారా? అని శిష్యులను ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు సమాధానంగా ఆనందాళ్వాన్ (అనంతాళ్వార్) అనే శిష్యుడు తన సంసిద్ధతను వ్యక్తం చేసి, తిరుమల వెళ్ళటానికి అనుజ్ఞ ఇవ్వవలసిందిగా ప్రార్థించాడు. సంతృప్తి చెందిన రామానుజాచార్యులు, అనంతాళ్వార్ ను, ఆణ్ పిళ్ళై (నీవే నిజమైన మగవాడివి) అని ప్రశంసిస్తూ, తిరుమల వెళ్ళటానికి అనుమతించారు.

**పుష్ప కైంకర్యం :** గురువాజ్ఞ ప్రకారం భార్యాసమేతంగా తిరుమల చేరుకున్న అనంతాళ్వార్, అత్యంత నిష్ఠతో శ్రీవారికి



పుష్పకైంకర్యం చేయసాగాడు. అప్పటికే తిరుమల చేరుకుని తీర్థకైంకర్యం చేస్తూ ఉన్న తిరుమలనంబి ద్వారా శ్రీవారి పుష్ప ప్రియత్వాన్ని గురించి, తిరుమలలో లభించే వివిధ పుష్పజాతుల గురించి, చాలా వివరాలు తెలుసుకున్నాడు.

తన గురువైన రామానుజాచార్యుల వారి గురువైన యామునాచార్యుల వారి పేరుతో శ్రీవారి ఆలయ ప్రాంగణంలో యామునోత్తరై అనే పుష్పమండపాన్ని అనంతాళ్వార్ నిర్మించారు. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం ఆ పరమ భక్తుడు శ్రీకారం చుట్టిన యమునోత్తర (పుష్ప అర) అనే పుష్పమంటపాన్ని నేటికీ మనం శ్రీవారి ఆలయం నందున్న సంపంగి ప్రాకారంలో చూడవచ్చు.

### చెరువు త్రవ్వకం

శ్రీవారి నిత్య కైంకర్యానికి కావలసిన వివిధ రకాలైన, రంగు రంగుల, పరిమళాలు వెదజల్లే పుష్పాల నిమిత్తం ఆయన ఒక ప్రత్యేక పుష్పవాటికను పెంచ దలిచాడు. దానికి నాందిగా, ఆలయానికి దక్షిణ దిక్కున ఉన్న విశాలమైన ప్రదేశంలో ఒక పెద్ద చెరువును నిర్మించ తలపెట్టాడు. ఈ చెరువును ఇప్పటికీ మనం క్యూ కాంప్లెక్స్ పక్కగా చూడవచ్చు. దీని ఒడ్డునే అనంతాళ్వార్ వారి సమాధి కూడా ఉంది.

దైవకార్యంలో ఇతరుల సహాయం కోరకుండా, గర్భవతి అయిన తన భార్యతో కలిసి ఈ మహత్కార్యానికి పూనుకున్నాడు అనంతాళ్వార్. ప్రతి రోజూ ఉదయం పుష్పమాలా కైంకర్యాలు ముగిసి, తీర్థప్రసాదాలు స్వీకరించాక, చెరువు నిమిత్తం, భార్యతో కలిసి గుంట తవ్వడం ప్రారంభించేవాడు.

ఈయన గడ్డపారతో (గునపం) మట్టి తవ్వి గంపలో పోస్తే, అతని భార్య ఆ మట్టిని దూరంగా తరలిస్తుండేది.

ఇలా ఈ కార్యక్రమం దీక్షగా కొన్ని రోజులు కొనసాగింది. గర్భవతి కావడంతో ఆమె అలసిపోయి, మధ్య మధ్యలో నిలబడి పోయేది. ఆయన పిలవడంతో, చెమట బిందువుల్ని పమిట చెంగుతో తుడుచుకుని తిరిగి పని కొనసాగించేది.

**(సశేషం)**

# దండకారణ్యం

– కౌతా నిర్మల

భారతదేశంలో, వింధ పర్వతమునకు దక్షిణ దిశగా, దాదాపు దక్షిణ సముద్రం వరకూ దండకారణ్యం వ్యాపించి ఉంది. దండుడు పాలించిన రాజ్యం, ఆ తర్వాత మట్టిలో కలిసిపోయిన, ఆ ప్రాంతం అరణ్యంగా మారడం వల్ల, ఆ అరణ్యానికి దండకారణ్యం అన్న పేరు ఏర్పడినట్లుగా తెలుస్తోంది. వింధ్య పర్వతాలకు దిగువన ఉన్న అరణ్యమే ఇది. ఈ అరణ్యం సుమారుగా 300 మైళ్ళు తూర్పు పడమరల వైపుగా, 200 మైళ్ళు ఉత్తర దక్షిణ దిశలవైపు వ్యాపించి ఉంది. ఇది తూర్పు కనుమలకు పడమటి దిశలో ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విస్తరించి ఉంది.

ఈ అరణ్యం ప్రకృతి సౌందర్యంతో, ఎంతో మనోహరంగా ఉంటుంది. ఈ అరణ్యంలో వన్యప్రాణులు, జలపాతాలు ఉన్నాయి. పురాతన దేవాలయాలు, రాజభవనాలు ఉండేవి. ఇక్కడ గిరిజన తెగల ప్రజలు నివసిస్తున్నారు. దండకారణ్యం అతి ప్రాచీనమైనది. త్రేతాయుగం ముందే, ఈ దండకారణ్యం ఆవిర్భవించినట్లుగా తెలుస్తోంది. ఆ అరణ్యంలో కందమూలాలు, ఫలాలు, శాకాలు లభిస్తున్నాయి. ఆ అరణ్యం మధ్యలో ఒక సరస్సు ఉంది. అక్కడ హంసలు, కొంగలు, చక్రవాక పక్షులే కాక, వివిధ రకాలైన రంగుల పక్షులు నివసిస్తున్నాయి. దండకారణ్యం ఆవిర్భావం గురించి పద్మపురాణం తెలిపింది. దండకారణ్యం ఏర్పడటానికి వెనుక ఒక కారణం ఉన్నట్లుగా పురాణ కథనం.

కృతయుగంలో వైవస్వత మనువు భూభాగాన్ని పరిపాలించేవాడు. అతని జ్యేష్ఠ పుత్రుడు ఇక్ష్వాకుడు. మనువు తన రాజ్యాన్ని ఇక్ష్వాకునికి అప్పగించి, ధర్మబద్ధంగా పాలించమని చెప్పి, బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు. ఇక్ష్వాకు మహారాజు కుమారులలో చివరివాడు, భవిష్యత్తులో ఒక మహాత్ముని దండనకు గురి అవుతాడని, అతని జాతకం ద్వారా తెలుసుకున్న ఇక్ష్వాకుడు, అతనికి దండుడు అని పేరు పెట్టాడు. దండుడికి వింధ్య, నీల పర్వతాల మధ్యగా ఉన్న భూ ప్రాంతాన్ని ఇచ్చి, దానికి అతనిని రాజుగా ప్రకటించాడు. ఇక్ష్వాకు మహారాజు అక్కడ ఒక నగరాన్ని నిర్మించి, దానికి 'మధుమంత'మని పేరు పెట్టాడు. ఆ రాజ్యాన్ని పాలించసాగాడు దండుడు.

ఒకరోజు రాక్షసుల గురువైన శుక్రాచార్యుని ఆశ్రమ సమీపానికి వచ్చాడు దండుడు. అక్కడ అతను అత్యంత అద్భుత సౌందర్యవతిని చూచాడు. ఆమె రూపం, సౌందర్యం దండుని మనస్సుని ఆకట్టుకున్నాయి. ఆమె పట్ల మోహితుడయ్యాడతను. ఆమెను సమీపించి, తన ప్రేమను, మనోవాంఛను, ఆమెకు తెలియజేశాడు దండుడు. అప్పుడా సౌందర్యవతి తాను శుక్రాచార్యుని పుత్రికనని, తన పేరు అరజ అనీ చెప్పింది. తాను దండుడికి గురుపుత్రికను కనుక తాను అతనికి సోదరిననీ, తనను అతను ఆ విధంగా కోరడం తప్పనీ, కామవాంఛతో చూడటం ధర్మ విరుద్ధమనీ చెప్పింది.

కామంతో విచక్షణనూ, ధర్మాన్నీ విస్మరించిన దండుడు, ఆమె మాటలను వినే పరిస్థితిలో లేకపోవడంతో, అరజ అతను తనను చేపట్టాలంటే తన తండ్రి శుక్రాచార్యుని అనుమతి పొందాలన్న షరతు పెట్టింది. కామప్రేరితుడైన దండుడికి ఆమె మాటలు తలకెక్కలేదు. ఆమె మాటలను నిర్లక్ష్యం చేసి, విచక్షణా జ్ఞానాన్ని విస్మరించి బలవంతంగా ఆమెతో సంగమించాడు.

తనకు జరిగిన అన్యాయానికీ, అధర్మానికీ అమితంగా దుఃఖిస్తూ, తాను అపవిత్రురాలనయ్యానని క్షోభిస్తూ, పవిత్రమైన తండ్రి ఆశ్రమంలో పాదం పెట్టడానికి ఇష్టపడక, తన మీద, తన సౌందర్యం మీద చీదర కలగటంతో విలపిస్తూ తండ్రి ఆశ్రమం బయటే ఉండిపోయింది అరజ. పని మీద బయటకు వెళ్ళిన శుక్రాచార్యుడు తన పనిని ముగించుకుని శిష్యులతో కలిసి ఆశ్రమానికి వెళ్ళాడు. కూతురిని ఆ స్థితిలో చూసి, ఆమె దుఃఖానికి కారణమేమిటని అడిగాడు. అరజ, తనకు దండుని వల్ల జరిగిన అన్యాయాన్ని భోరున రోదిస్తూ తండ్రికి తెలియజేసింది. ఆ విషయాన్ని విన్న శుక్రాచార్యుడు అమిత ఆగ్రహావేశాలతో, అన్యాయంగా, అధర్మంగా తన కూతురిని చెరపట్టిన దండుడు నశించిపోవాలని, అతడు సజీవంగా మట్టిలో కలిసిపోవాలని, అతడి రాజ్యం మీద ఇంద్రుడు ధూళి వర్షం కురిపిస్తాడని, అదే అతనికి సరైన దండన అనీ శాపం విధించి ఆశ్రమం వదిలేసి వేరొక ప్రాంతానికి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత కుంభవృష్టిగా ఏడు రోజుల వరకూ ఆకాశం నుంచి ధూళి కురిసి దండుని రాజ్యంతో పాటు, దండుడూ మట్టిలో కలిసిపోయారు. అనంతరం ఆ మట్టిలో నుంచి ఒక మహారణ్యం ఆవిర్భవించింది. ఆ మహారణ్యమే దండకారణ్యంగా పిలువబడింది. కొంతకాలం తరువాత మునులు వచ్చి అక్కడ తపస్సు చేయసాగారు. అక్కడ తాపసులతో, మునులతో, మహర్షులతో జనావాసాలు ఏర్పడటంతో, ఆ ప్రాంతం జనస్థానంగా పేరు పొందింది.


వనవాస సమయంలో శ్రీరాముడు దండకారణ్యంలో ప్రవేశించి, ఆ ప్రదేశంలో గడిపినట్లు రామాయణం ద్వారా తెలుస్తుంది. దండకారణ్యంలో విరాధుడనే రాక్షసుడిని సంహరించిన పిదప శరభంగ, సుతీక్ష్ణ మునుల ఆశ్రమాలను భార్య సీత, సోదరుడు లక్ష్మణుని సమేతంగా దర్శించాడు శ్రీరాముడు. అటు పిమ్మట అగస్త్య మహర్షి ఆశ్రమానికి వెళ్ళారు వారు. ఆ తర్వాత దండకారణ్యాన్ని నివాసస్థలంగా ఎంచుకుని మునుల కోరికపై, రాక్షసులను సంహరిస్తూ అక్కడ చాలాకాలం గడిపినట్లుగా రామాయణం వెల్లడించింది. దండకారణ్య ఆవిర్భావ కథను అగస్త్య మహర్షి శ్రీరామునికి తెలియచేశాడు.

# మరణించి జీవించు

– డా॥ ఎం.రాజ్యలక్ష్మి రంగాచార్య

ప్రతి మానవుడూ లోకంలో తనకు మరణం లేకుండా ఉండాలనే కోరుకుంటాడు. సజీవిగా సాగుతూ ఈ భూమిపై ఆనందాన్ని అనుభవించాలని అభిలషిస్తాడు. దాని కోసం అహర్నిశలూ కృషి చేస్తాడు. ధనార్జనే తన ధ్యేయంగా కొనసాగుతాడు. స్వార్థం కోసం పర వంచనకూ పాల్పడతాడు. కానీ నిజానికి మన జీవితం మనం మరణించాకే అనే విషయం మనం గుర్తుంచుకోవాలి.

ఈ భూమిపై పుట్టిన ప్రతి జీవరాశికీ మరణం ఉంటుంది. ఇదే విషయాన్ని గీతాచార్యుడు ''జన్మించిన వానికి మరణం తప్పదు, మరణించిన వానికి జన్మము తప్పదు'' అని చెప్పడం జరిగింది. జనన మరణాలు నిత్య సత్యాలైనప్పటికీ జీవన పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. మన జీవన పోరాటంలో మనం మనుషులుగా జీవించగలగాలి. మనిషి మనిషిగా జీవించడమే కాక మనీషిగా మనగలిగితే తప్పక యశస్సును పొందగలడు. కీర్తి కాంక్షతో కాకుండా నిస్వార్థంతో పరోపకారం చేయాలి. పరులకు మనం ప్రాణంగా నిలవగలగాలి.



మధుకరం మధువున్న పూవులపైననే వ్రాలి మధువును గ్రోలుతుంది. అలాగే మనిషి ఎదుటి మనిషిలోని మంచిని మాత్రమే చూడగలగాలి. ఎదుటివారిని చూసి అసహ్యించుకునే స్వభావం విడనాడాలి. ప్రయత్నపూర్వకంగా నలుగురికీ ఉపకరించే మంచి పనిని చేసి, తోటివారికి సహాయం చేయాలి. తన స్వార్థం కోసం ఎదుటి వారిని మోసం చేయకుండా నిలువగలగాలి. తను కష్టాల్లో ఉన్ననూ ఎదుటివారి సుఖాన్ని అపేక్షించాలి. ఎందుకూ పనికిరాని ఈ శరీరాన్ని పరోపకార సుగంధంతో గుబాళించేలా చేసి మనుషుల ఎదల్లో మనం జీవించగలగాలి. అప్పుడే మానవ జన్మకు సార్థకత చేకూరుతుంది. నీచే సహాయం పొందిన వ్యక్తి నిన్ను జీవితాంతం దైవంలా భావిస్తాడు. నీ గురించి నలుగురికీ తెలిపి తన కృతజ్ఞతను చాటుకుంటూ, తన మనస్సులో తనకుపకరించిన వ్యక్తులను దైవంలా నిలుపుకుంటాడు.

ఎదుటి వారి ఎదలలో నీవు నిస్వార్థ వ్యక్తిగా, పరోపకారిగా, సత్యవాదిగా నిలిస్తే నీవు మరణించినా జీవించగలిగిన వాడివవుతావు. ఆవు గడ్డిని మేస్తూ పాలను మాత్రమే ఇస్తుంది. కానీ నీవు వేసింది గరికే కదా! అని ఎన్నడూ తూలనాడదు. అట్లాగే నీకు కష్టం కల్గినా ఎదుటి వారికి మాత్రం నీవు మేలునే తలపెట్టాలి. అందుకే వేమన అంటాడు''చంపదగిన యట్టి శత్రువు తన చేత చిక్కెనేని కీడు చేయరాదు, పొసగ మేలు చేసి పొమ్మనుటే చాలు'' – అంటే మనం చేసే మేలుతోనే దుష్టుణ్ణి కూడా సన్మార్గంలో నిలపగలుగుతాం.


ఎందుకూ పనికిరాని నీ మృతశరీర అవయవాలను దానం చేస్తే, ఆయా లోపాలున్న వారికి నీ అవయవాల ద్వారా ఉపకరించగలుగుతావు. పూర్వం లేని శాస్త్ర విజ్ఞానం ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్న ఈ తరుణంలో అవయవ దానం చేసి మరణించాక జీవించగలగాలి. మాట తప్పకుండా ఇచ్చిన మాటను నిలబెట్టుకుని పరులకు నీవు ఉపకరించగలగాలి. దైవం నీకు అధికార హోదా ఇచ్చినట్లయితే దాన్ని నీ స్వార్థానికి వాడుకోకుండా నిస్వార్థంగా నిన్ను నమ్ముకున్న వారికి మేలు చేయాలి. నలుగురికి అన్నం పెట్టే యత్నంలో నీవు కొనసాగుతూ ఉండాలి తప్ప, అన్నాన్ని దూరం చేసే యత్నం చేయకూడదు. అందుకే భరతుడు తనకు రాజ్యకాంక్ష లేదన్నట్లు, శ్రీరాముడే తనకు సర్వస్వం అని శపథ పూర్వకంగా శ్రీరామునితో తెలుపుతూ ''ఒకవేళ శ్రీరాముడు అడవులకు వెళ్ళాలనే కోరిక తనకుండి ఉంటే, ఎదుటివారిని నమ్మించి మోసగించేవాడు పొందే పాపం పొందెదను గాక, అట్లే నీరును, అన్నాన్ని దూరం

చేసినవాడు పొందే పాపం పొందెదను గాక! అని తెల్పాడు.

ఎదు టి వారి మనస్సులలో మనం దైవంలా నిలువడానికి మనం శ్రీరామునిలా ఉండాలి. విశ్వామిత్రుడంతటివాడు శ్రీరామ సహాయం కోరగా కాదనలేదు శ్రీరాముడు. యజ్ఞ సహాయకుడై నిలిచాడు. గుహుని కృతజ్ఞతను మరువలేదు. భక్తిభావంతో తనకు ఎంగిలి పండ్లను తినమని ఇచ్చినా ప్రేమతో శబరిని అనుగ్రహించాడు. అట్లాగే జటాయువు అంత్యక్రియలను కూడా జరిపాడు. పరోపకార సుగుణం కలవారికి అల్ప, అధిక తరతమ భేదాలుండవు. తను నిర్ణయించుకొన్నదే వేదంగా భావించదు పరోపకారి. తనను నమ్ముకున్న వాళ్ళను నట్టేట ముంచని స్వభావం కలిగి ఉంటాడు. పరోపకారంతో అవసరం ఉన్నవారికి సహాయం చేస్తాడు. ధనం ఉన్నవానికి సహాయం చేయడం కాదు, నిరుపేదలకు నీవు సహకరించాలి. సముద్రంలోకి ఏరును ప్రవహింపచేస్తే నీ ప్రయత్నం వృథా అవడమే కాక పాపాన్నీ కొని తెచ్చుకున్నవాడివే అవుతావు. అదే ఏరును ఎండిన పంటపొలాలకు మళ్ళించగలిగితే భగీరథునిగా భాసిల్లుతావు.

నీ జీవితంలో నీవు ప్రకాశాత్ముడవై నీ వెలుగులో నాలుగు అంధ కుటుంబాలకు వెలుగుల నివ్వగలిగితే చాలు. నీవు సూర్యునిలా తోస్తావు. నీవు ఈ పుడమిపై లేనపుడు నలుగురి స్మరణలో నీవు మిగులుతావు. అప్పుడు నీవు అజరామరమైనట్లే కదా. జీవించినంత కాలం నీవు నలుగురికీ సహాయం చేస్తూ బ్రతకాలి. ఒకవేళ నీ వలన కాకపోతే ముందే నీ బలహీనత తెలియపరచాలి. అంతేకాని తేనె పూసిన కత్తి లాంటి మాటలతో ఎదుటివారిని నమ్మించకూడదు. అసత్యం ఎప్పుడూ మాట్లాడకూడదు. అసత్యం వల్ల కలిగే పాపం అంతా యింతా కాదు అందుకే మహాభారత యుద్ధంలో ద్రోణుని కొడుకు అశ్వత్థామ మరణించినట్లు అబద్ధం పలుకమని ధర్మరాజుకు చెప్పినా, అశ్వత్థామ అనే పేరు గల ఏనుగు సాకుతో "అశ్వత్థామ హతః నరోవాయా కుంజరోవా" అని "అశ్వత్థామ మరణించాడు, ఆ అశ్వత్థామ ఏనుగో, నరుడో" అంటూ పలికాడట.

అందుకే అసత్య దోషంతో ఎదుటి వారి ఎదలకు నీవు గాయం చేసేవాడిలా కాక, ఆడితప్పని వాడిగా నీవు నిలువగలిగి నలుగురికీ నీవు మేలు చేయాలి. ఏదీ శాశ్వతం కాని ఈ జీవన చక్రంలో శాశ్వతమైంది నీ పేరు ఒక్కటే. ఆ పేరు ఈ భూమిపై నిలిచినంత కాలం నీవు మరణించినా జీవించిన వాడివే అవుతావు. క్షణభంగురమైన ఈ జీవన చక్రంలో భగవంతుడు జగత్సాక్షి అని, అతన్ని మోసం చేయకుండా నీవు గడపగలగాలి. సర్వకారణ కర్త పరమాత్ముడే అయినా నిన్ను నమ్మినవారిని నీవు మోసం చేయకుండా ఉండి, సాయం చేయగలిగితే మరణించినా నీవు జీవించినవాడివే అవుతావు. లేదంటే జీవిస్తున్నా మరణించినవాడివే అవుతావు.



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 83 వ కళ్యాణం

ఇది తేది 06-08-2025 బుధవారం 10.30 నుండి జరిగింది. ఇది కొత్తూరు గ్రామం, ఎం.సి. పల్లి మండలం, మేడ్చల్ జిల్లాలో శ్రీమాన్ వల్లాల వేంకటేశం, రాజేశ్వరి దంపతుల నిర్వహణలో జరిగింది.

## 84 వ కళ్యాణం

ఇది తేది 10-08-2025 ఆదివారం ఉదయం 10.30 నుండి జరిగింది. హబ్సీగూడ వీధి నెం.8 లో గల శ్రీ కోదండరామాలయ కమ్యూనిటీ హాలు నందు శ్రీమాన్ పుల్లగూర్ల అరవింద్ రెడ్డి, ప్రణీత దంపతుల నిర్వహణలో వైఖానసాగమోక్తంగా, అన్నమయ్య కీర్తనల మధ్యన జరిగింది.

## 85 వ కళ్యాణం

ఇది తేది 19-08-2025 మంగళవారం ఉదయం 10.30 నుండి జరిగింది. శ్రీమాన్ చాడ వేంకటేశ్వరరావు, పద్మ మరియు శ్రీమాన్ చాడ హరికృష్ణ, స్వప్న దంపతులు సంయుక్తంగా నిర్వహించారు. ఇది ఇంటి నెం. 12-1-421/ ఎ, లాలాపేట, సికింద్రాబాద్ లో జరిగింది.

# క్షమాగుణం

– ప్రొఫెసర్ జి.వి.శేషారెడ్డి

పగ తీర్చుకుంటే ప్రశాంతత చిక్కుతుందనుకోవడం కేవలం భ్రాంతి మాత్రమే. క్షమాగుణం మానసిక రుగ్మతలకు మంచి మందు. ఎలాగో తెలుసుకుందాం.

మన మనస్సులో రెండు వైరుధ్య భావాలుంటాయి. ఒకటి క్షమించడం, రెండోది పగ తీర్చుకోవడం. ఈ రెంటికీ సదా సమరం జరుగుతూ ఉంటుంది. క్షమ గెలిస్తే హృదయం ఆనందమయం అవుతుంది. మనసులో అంతులేని సంతోషం కలుగుతుంది. మనలో ఉండే ప్రేమ ఎప్పుడూ 'క్షమించు క్షమించు' అని చెబుతూనే ఉంటుంది. ప్రేమిస్తే ప్రేమను పొందుతాం. ద్వేషిస్తే ద్వేషాన్నే తిరిగి పొందుతాం. ''గుండెలో పగ దాచుకోవడం అంటే 'పామున్న ఇంటిలో ఉండటమే'' అంటుంది భారతం. పగ వల్ల పగ పోదనీ, ఏ విధంగా చూసినా పగని అణచడం లెస్స అనీ, భారత మహేతిహాస ఉద్బోధ.

'నా కన్ను నువ్వు పొడిస్తే... నీ కన్ను నేను పొడుస్తా' అని కన్నుకు కన్ను... పన్నుకు పన్ను సిద్ధాంతంతో అందరూ ముందుకు దూకితే లోకం అంతా గుడ్డివాళ్ళతో, బోసినోటివాళ్ళతో నిండిపోతుంది.

ప్రతీకారం అనే విషచక్రం నుంచి బయట పడాలంటే క్షమించడం ఒక్కటే ఉపాయం. అందువల్ల రెండు లాభాలున్నాయి.

ఒకటి క్షమించేవారు ఆదర్శ వ్యక్తులుగా గౌరవం పొందుతారు. రెండోది క్షమ పొందేవారు, తమ జీవితాలను సరిదిద్దుకుంటారు. క్షమాగుణం శత్రువును సైతం మిత్రుడిగా మార్చేస్తుంది. పొరపాటు అనేది మానవ సహజ గుణం. క్షమ దైవ విశిష్ట గుణం అని ఆంగ్ల సామెత.

మహా భక్తుల జీవితాలన్నీ ప్రేమ మయాలు.

ఏకనాథుడు పాండురంగడి భక్తుడు. ప్రశాంత చిత్తుడు. సదా స్వామి సేవలో, భజనలో కాలం గడిపేవాడు. ప్రజలందరూ ఆయన్ని ప్రశంసించడం చూసి కొందరు ఈర్ష్య పడ్డారు. ఎలాగైనా ఏకనాథుడికి కోపం తెప్పించాలని ప్రయత్నించసాగారు. ఒక దుష్టుడికి డబ్బు ఆశ చూపి, ఆ పనికి నియోగించారు. ఏకనాథుడు రోజూ తెల్లవారు జామునే నదిలో స్నానం చేసి వచ్చేవాడు. ఆ సమయంలో ఆ దుష్టుడు ఏకనాథుడిపై ఉమ్ము వేశాడు. ఏకనాథుడు ప్రశాంత చిత్తంతో చిరునవ్వు చెరగనీయకుండా మళ్ళీ వెనక్కి వెళ్ళి నదీ స్నానం చేశాడు. ఇలా మొత్తం 107 సార్లు జరిగింది.



ఏకనాథుడు ఏమాత్రం నిగ్రహం వీడకుండా మందస్మిత వదనంతో అన్నిసార్లూ మరల మరల స్నానం చేసి వస్తున్నాడు. దీంతో ఆ కుటిలుడి హృదయం చలించిపోయింది.

ఆయన ఏకనాథుడి కాళ్ళపై పడ్డాడు. స్వామీ మీరు నిజంగా దైవస్వరూపులు. మీ నిగ్రహం చెడగొట్టి, ఎలాగైనా మీకు కోపం తెప్పించాలని కొందరు నన్ను పురమాయించారు. మీకు ఆగ్రహం తెప్పించగలిగితే నాకు ధనం ఇస్తామని ఆశ చూపారు. మీ క్షమాగుణం తెలియక నేను ఈ నీచ కృత్యానికి అంగీకరించాను అన్నాడు ఆ వ్యక్తి పశ్చాత్తాపంతో.

ఏకనాథుడు అతనికి నమస్కరిస్తూ ఇలా అన్నాడు. నాయనా! నీవు నాకెంతో మేలు చేశావు. నా చేత నూట ఎనిమిది సార్లు పవిత్ర నదీస్నానం చేయించిన మహానుభావుడివి నువ్వు. నేను నీ మేలు ఎన్నటికీ మరచిపోను.

ఏకనాథుడి పలుకులు విని అవతలి వ్యక్తి నిర్విణ్ణుడయ్యాడు. ఆ భక్తాగ్రేసరుడి క్షమాగుణం ఆ ఉమ్ము వేసిన వ్యక్తి హృదయాన్ని ప్రక్షాళనం గావించింది. పశ్చాత్తాపంతో అతడు కన్నీరు కార్చాడు.

క్షమ అంటే భూమి. భూమి ఓర్పు గల తల్లి కనుకనే మనం ఎంత బాధపెట్టినా భూమాత మనపై పగ తీర్చుకోవాలనుకోదు. క్షమించే గుణం ఉన్నది కదా అని మనం అదేపనిగా భూమాతను హింసించకూడదు. క్షమా గుణానికీ హద్దులుంటాయని గుర్తుంచుకోవాలి. క్షమాగుణం పురాణాలకు, ఇతిహాసాలకే పరిమితం కాదు. ఇటీవలి చరిత్రలో క్షమాగుణంతో చరితార్థులైన

మహాపురుషులెందరో ఉన్నారు.

ఆర్య సమాజ స్థాపకులైన మహర్షి దయానంద నిష్కాపట్యం, నిర్భయత్వం సమాజంలో అనేకులకు కంటగింపైంది. ఆయన వద్ద వంట వాడికి లంచం ఇచ్చి, ఆహారంలో విషం పెట్టించారు. దయానందులు మృత్యుశయ్యపై ఉన్నారు. తన వంటవాడిని దగ్గరకు పిలిచారు. కొంత డబ్బు అతడి చేతిలో పెట్టి ఇలా అన్నారు. వెంటనే నువ్వు నేపాల్ కి వెళ్ళిపో. నా శిష్యులకు నువ్వు చేసిన పని తెలిస్తే నిన్ను బతకనీయరు. తనకు ప్రాణ హాని కలిగించిన వ్యక్తిని సైతం క్షమించి అతడికి ప్రాణ దానం చేసిన మహర్షి దయానంద చరితార్థులయ్యారు.

క్షమాగుణం మానసిక రుగ్మతలకు మంచి మందు. పగ తీర్చుకుంటే ప్రశాంతత చిక్కుతుందనుకోవడం కేవలం భ్రాంతి మాత్రమే. నిజానికి అభద్రత మిగులుతుంది. చిత్త వికారం ఏర్పడుతుంది. చివరకు జీవితం విషాదాంతం అవుతుంది.

ఒక అరబ్బీ సామెత ఇలా చెబుతుంది.

ఇతరులు మనకు చేసిన అపకారాలను ఇసుకపై రాయాలి. ఇతరులు మనకు చేసిన ఉపకారాలను చలువ రాయిపై చెక్కుకోవాలి. ఇలాంటి క్షమ అందరిలో రావాలంటే ధ్యానమే చక్కటి మార్గం.

**శ్లో ॥ నరస్యాభరణం రూపం, రూపస్యాభరణం గుణః**
**గుణస్యాభరణం జ్ఞానం, జ్ఞానస్యాభరణం క్షమా.**

**గీ. మనుజునకు రూపమే యాభరణము తలప.**
**గుణమె రూపంబునకు నాభరణము కనగ.**
**గుణమునకు జ్ఞానమే యాభరణము తెలియ.**
**క్షమయే యాభరణంబు సు జ్ఞానమునకు.**

భావము – మానవునకు రూపమే ఆభరణం. ఆ రూపానికి గుణం ఆభరణం. గుణానికి జ్ఞానమే ఆభరణం. జ్ఞానానికి క్షమాశీలం ఆభరణం.

---

# హయగ్రీవ వైభవ కీర్తనం

**విశుద్ధ విజ్ఞాన ఘన స్వరూపం**
**విజ్ఞాన విశ్రాణన బద్ధదీక్షమ్ ।**
**దయానిధిం దేహభృతాంశరణ్యం,**
**దేవం హయగ్రీవమహం ప్రపద్యే ।**

అని ప్రత్యక్షమైన శ్రీ హయగ్రీవ భగవానుణ్ణి దేశికులు ప్రపత్తి చేశారు.

భగవత్స్వరూపం 'విజ్ఞానఘన ఏవ' అనియే శ్రుతిచే ప్రతిపాదింపబడింది. అపహతపాప్మత్వాది గుణాష్టకంతో కూడిన కేవలం జ్ఞాన స్వరూపమది. ''దదామిబుద్ధి యోగంతం'' అన్నట్లు దీక్షతో ప్రీతిపూర్వకంగా భజించేవారికి, సర్వశాస్త్రాలను సద్వారకంగానో అద్వారకంగానో అనుగ్రహించే దీక్ష గలవాడు భగవానుడే కదా! ఓ దయానిధీ! జీవులకు రక్షకుడవైన ఓ హయగ్రీవదేవా! అకించనుడనూ, అనన్యగతికుడనూ అయిన నన్ను రక్షించడం నీకెంత పని! స్వామీ! నిన్ను శరణు వేడుతున్నానని శ్రీ హయగ్రీవ స్తోత్రం చేశారు.

ఈ స్తోత్రం దేశికుల అనుభవ పరీవాహ రూపమే. జీవాత్మ పరమాత్మతో పరస్పర సంభాషణ జరుపుతున్నట్లే ఉంటుంది. దేవుని శరణ్యత్వం పూర్తిని తెలుపుతూ, జ్ఞాన ప్రదానమే ప్రధానంగా తెలిపే విశేషణాల వల్ల, పరికరాలంకార సజ్జితమీ శ్లోకం.

**"సమాహారస్సామ్నాం ప్రతిపదమృచాం ధామయజుషాం**
**లయః ప్రత్యూహానాం లహరివితతి ర్బోధజలధేః ।**
**కథా దర్పక్షు భ్యత్కథక కులకోలాహలభవం**
**హరత్వంత ర్ధ్వాంతం హయవదన హేషాహలహలః" ॥**

భక్తితో స్తుతించినందువల్ల హయగ్రీవుడు ఆనందించి హేషారవం (సకిలింపు) చేయగా, ఆ ధ్వనియే చాలు స్వామీ! మాకిష్ట ప్రాప్తిని, అనిష్ట నివృత్తిని కలుగజేస్తుందని హేషారవాన్ని ప్రార్థించారు. వేదార్థగర్భితమైన హేష అజ్ఞాననివర్తకం కదా! శ్రీ హయగ్రీవుని హేషలో ఆ దేవి మంత్రబీజాక్షరాలైన హకారలకారాలున్నాయి. 'హలహలః' అనే పదంలో అచ్చులు, హల్లులు (హల్+అహల్) ధ్వనిస్తున్నాయి. 'సకిలింపు' యొక్క ధ్వన్యనుకరణ పదమిది. కాబట్టి ఈ హేషాహలహలం సామవేదాల సమాహారం. ఋగ్వేద ప్రతిరూపం, యజుర్వేదం యొక్క వాసస్థానం : 'లయః ప్రత్యూహానాం' అంటే విఘ్నాలను ధ్వంసం చేసేది. అంటే అనిష్టాన్ని తొలగించి ఇష్టప్రాప్తిని తొలగించే కర్మలు గల అథర్వణవేదము సూచితం. నాలుగు వేదాల నాదరూపమై, ఉన్మేషకరమైన, జ్ఞాన సముద్ర తరంగాల సమూహం శబ్దించే హయగ్రీవుని హేషారావం ప్రత్యర్థులు చేయు వాదాల ఆర్భాటం వల్ల భగవద్భక్తులమనే అంధకారాన్ని పోగొట్టుగాక! అని స్తుతింపబడింది. శ్లోక పూర్వార్ధంలో పూర్వమీమాంస, ఉత్తరార్ధంలో ఉత్తరమీమాంస శాస్త్రార్థ రూపత్వం విశదీకరింపబడింది. ఈ శిఖరిణీవృత్త శ్లోకం పరికరం, రూపకం, రూపజాతి శయోక్త్యలంకారాలు అంగాంగి భావంగా సంకరమై భాసిస్తున్నది. శ్రీ హయగ్రీవ స్తోత్రం బ్రహ్మవిద్యయే కాబట్టి, అట్టి సంఖ్య గల 32 శ్లోకాలలో రచింపబడింది. ఇదే మొదటి స్తోత్రం. దేశికుల రచనలు సంస్కృతం, ప్రాకృతం, మణిప్రవాళం, ద్రావిడం అనే నాలుగు భాషలలో శతాధికంగా ఉన్నాయి.

# వామనావతారము

– పి.ఎల్.నరసింహాచార్య దాసన్



**ఇంతింతై వటుడింతయై మరియు దానింతై నభోవీధిపై**
**నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై**
**నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై**
**నంతై సత్య పదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్థియై**
**రవిబింబంబుపమింప బాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై**
**శ్రవణాలంకృతమై గళాభరణమై సౌవర్ణ కేయూరమై**
**ఛవి మత్కంకణమై కటిస్థలి నుదంచద్వస్త్రమై నూపుర**
**ప్రవరంబై పదపీఠమై వటుడు దా బ్రహ్మాండమున్నిండుచోన్**

శుక్రాచార్యుని మాట వినక, బలిచక్రవర్తి వటువు రూపంలో వచ్చిన ఆ శ్రీమహావిష్ణువుకు మూడడుగుల నేల దానం ఇచ్చాడు. ఆ దాన ఫలంతో వామనుడు త్రివిక్రముడై యేవిధంగా విజృంభించాడో వర్ణించి చెప్పిన పద్యాలు ఇవి.

సన్నివేశానికి తగినట్లు అల్లిన పదముల అల్లిక పోతనామాత్యుని వైరుధ్యమైన శైలికి ప్రతీక.

ఇంతగా ఉన్న వటువు అంత అయినాడు. అనగా కొంచెం పెరిగాడు. మళ్ళీ అంత అయినాడు. ఆకాశమార్గాన అంతవాడుగా కనిపించాడు. ఆ తర్వాత మేఘమండలం దగ్గరగా వచ్చాడు. ఆపై కాంతివలయాన్ని దాటి, చంద్రుని దాటిపోయి, ధ్రువనక్షత్ర మండలాన్ని దాటిపోయి, మహాలోకాన్ని దాటి, బ్రహ్మస్థానమైన సత్యలోకాన్ని కూడా మించిపోయి, బ్రహ్మాండాన్ని అంతా ఆక్రమించునట్లు పెరిగిపోయినాడు.

ఒక్కొక్క మాట, ఒక్కొక్క గెంతు వేసి, వామనుని ఉన్నత శిఖరాలలోనికి తీసుకెళ్ళిన పదప్రయోగం అనిర్వచనీయమైన ఆనందాన్నిస్తుంది చదువుతుంటే. ''రవి గాంచనిది కవి గాంచును'' అన్న ఆర్యోక్తి ఇక్కడ అన్నివిధాలా పోతనామాత్యులవారు మనో చక్షు దర్శనా ప్రాభవానికి సరిగ్గా సరిపోతుంది. ''ఇంతింతై, తానింతై, అంతై, అల్లన్తై, ఆపై, అంతై'' అనే పద ప్రయోగాలు ఆరోహణా క్రమాన్ని సూచిస్తూ, వామనుడు పెరిగిపోయిన విధానం కళ్ళకు కట్టినట్లు చూపింపబడింది.

ఆకాశవీధి, మేఘమండలం, కాంతిమండలం, ఆపై ధ్రువమండలం, మహర్లోకం, సత్యలోకం, ఆపై విష్ణుస్థానం. సామాన్య మానవులకు అగోచరమైన లోకాల ఆరోహణా క్రమాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించిన ద్రష్ట పోతన. ఆయనకు ఈ రచనలో రామభద్రుని సహకారం అడుగడుగునా విదితం అవుతుంది. లేకుంటే ఖగోళ రహస్యాలు ఆయనకు అవగతమెట్లగుతాయి?

ఇక రెండో పద్యంలో వామనునికి, త్రివిక్రమావతారంలో, ఈ సహజసిద్ధ సూర్యమండలం ఎలా ఆభరణాలు సమకూర్చింది చెబుతున్నారు పోతన. ఒక స్థాయిలో విక్రమించిన త్రివిక్రమునికి, సూర్యమండలమే ఒక గొడుగుగా భాసిల్లింది. అదే సూర్యమండలం వామనుడు ఇంకొద్దిగా పైకి వెళ్ళగానే, తలమీద రత్నంగా కనబడసాగింది. ఎత్తు పెరుగుతున్న కొద్దీ, ఆ సూర్యమండల పరిమాణం తగ్గడం సహజమే కదా.

ఇంకొద్దిసేపటికే అదే సూర్యమండలం వామనుని చెవిపోగులాగా ద్యోతకమయింది. చూస్తూ ఉండగానే కంఠాభరణంగా మారిపోయింది అదే సూర్యమండలం. ఆపై త్రివిక్రముడు అధిగమిస్తున్న కొద్దీ సూర్యబింబం ఆయనకు దండపట్టీగా, ముంజేతి కంకణంగా, మొలకు కట్టుకునే పట్టుబట్టగా, కాలి కడియంగా, చివరకు స్వామి పాదపీఠంగా మారిపోయింది.

ఓహ్! ఎంత సాపేక్షంగా ఉన్నది ఈ వర్ణన. పోతనామాత్యులు ఎక్కడ నేర్చుకుని ఈ వర్ణన చేశాడు? ఆయనకు, సాపేక్ష సిద్ధాంతం కనిపెట్టాడని చెబుతున్న ఐన్ స్టీన్ కు ఏ విధమైన సంబంధం లేదు కదా! కేవలం ఆ చదువుల తల్లి కటాక్షం, మనోనేత్రాలు ప్రసాదించిన శ్రీరామచంద్రుని కరుణ. మన పుణ్యం. సూర్యుని ఉపమానంగా పెట్టుకుని వామనుని త్రివిక్రమావతారం మన కన్నులకు కట్టవలెననే ఆలోచన, నభూతో నభవిష్యతి.

చీకట్లను తొలగించేవాడు సూర్యుడు. ఇక్కడ జ్ఞాన చక్షువులు తెరిపించి ముల్లోకాలకూ సందేశం ఇచ్చినవాడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడు.

ఇంతింతై, వటుడింతై అనే పద్యం యెత్తుగడ, మన తెలుగు ప్రజానీకానికి ఇప్పటికీ, ఎప్పటికీ నాలుకపై ఉండే మణిరత్నం. ఎవరైనా తమ కండ్లముందే త్వరితంగా అభివృద్ధి లోనికి వస్తుంటే అప్రయత్నంగా ఈ పద్యపాదంతోనే వారిని మెచ్చుకోవడం మన అందరికీ అనుభవైక వేద్యమే కదా!

**శ్రీలక్ష్మీనారాయణ నమః**

# పౌండ్రక వాసుదేవుడు

పూర్వం కరూష దేశమును పౌండ్రక వాసుదేవుడు అనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆయన పెరిగి పెద్దవాడయిన తరువాత ఆయనకు ఎవరో మీ పేరు ఉన్న మరొక ఆయన ఉన్నాడు. ఆయన వసుదేవుని కుమారుడు. అసలు వాసుదేవుడు ఆయనే అని లోకం నమ్ముతోంది అని చెప్పారు. ఈ విషయం చెప్పగానే ఈయన కూడా తెల్లటి శంఖం ఒకదానిని కొనుక్కున్నాడు. ఒక చక్రమును, గ దను చేయించుకున్నాడు. ఎప్పుడూ పట్టు పీతాంబరమును కట్టుకోవడం ప్రారంభించాడు. ఆవిధంగా అతను వాసుదేవుని అనుకరిస్తూ తాను పౌండ్రక వాసుదేవుడనని మురిసిపోయేవాడు.

ఒక రాయబారిని పిలిచి నీవు వెళ్ళి కృష్ణుడికి ఒక సందేశం చెప్పు అని ఒక లేఖ రాసి ఇచ్చి పంపించాడు. ఆ రాయబారి కృష్ణ భగవానుని దగ్గరకు వెళ్ళాడు. ఆ సమయంలో కృష్ణుడు నిండు సభలో కూర్చుని ఉన్నాడు. ఈ రాయబారి వెళ్ళి పౌండ్రక రాయబారి మీకీ రాయబారం పంపించాడు అని చెప్పాడు.

ఆ పత్రికలో నేను ఎటువంటి అలంకారములను ధరించి ఉంటానో, అలా నీవు కూడా పెట్టుకుంటావని తెలిసింది. నాకు అర్థంకానిది ఒకటే. నాకూ వాసుదేవుడు అనే పేరు ఉంది. నీకూ వాసుదేవుడు అనే పేరు ఉంది. దీనివలన ఇబ్బంది వస్తోంది. నీ అంతట నీవు మర్యాదగా ఈ చిహ్నములన్నిటిని వదలి పెట్టేయాలి. వాసుదేవుడన్న పేరును వదిలిపెట్టెయ్యాలి. లేకపోతే యుద్ధమునకు వచ్చి నీ శరీరమును మట్టుపెట్టవలసి ఉంటుంది. ఏది కావాలో అడుగు. ఇదీ రాయబారము సారాంశం.

కృష్ణుడు ఈ చిహ్నములు నాకు సహజములు. నేను వీటిని వదిలిపెట్టడం కుదరదు. అతడు కోరుకున్న రెండవ కోరికను నేను అంగీకరిస్తున్నాను అని చెప్పు. యుద్ధభూమిలో కలుసుకుందాం అని పంపించివేశాడు.

పౌండ్రక వాసుదేవునకు కాశీరాజు మద్దతు పలికాడు.

ఇద్దరూ కలిసి కృష్ణపరమాత్మ మీద యుద్ధం మొదలుపెట్టారు. ఈ పౌండ్రక వాసుదేవుడు ఎలా ఉంటాడో చూడాలి అనుకున్నాడు కృష్ణపరమాత్మ. కృష్ణ పరమాత్మ ఎలా ఉన్నాడో పౌండ్రక వాసుదేవుడూ అలాగే ఉన్నాడు. కృష్ణుడు వానిని రథం మీద చూసి ఆశ్చర్యపోయి పకపకా నవ్వి యుద్ధం ప్రారంభించాడు. కొంతసేపు వారిద్దరి మధ్య యుద్ధం జరిగింది. చివరికి పౌండ్రక వాసుదేవుడు కృష్ణుడి చేతిలో చచ్చిపోయాడు. చిత్రమైన సంఘటన జరిగింది. ఆ చచ్చిపోయిన వానిలో ఉన్న తేజస్సు పైకి లేచి కృష్ణ పరమాత్మలో కలిసిపోయింది.



ఇది వినగానే పరీక్షిత్తు తెల్లబోయాడు. ఆయనలో తేజస్సు ఈయనలో ఎలా కలిసింది? అని శుకమహర్షిని అడిగాడు. శుకుడు అతనికి సందేహం తీరేలా సమాధానం చెప్పాడు. పౌండ్రక వాసుదేవుడు ఏ పని చేసినా అచ్చం కృష్ణుడిలా ఉన్నానా లేదా అని ఎల్లవేళలా కృష్ణుని తలచుకుంటూ ఉండడం వలన మనస్సునందు కృష్ణ ధ్యానమును పొంది ఉన్నాడు. కాబట్టి వాడు ఏ కారణం చేత తలచినా సంతతము తలచిన వస్తువులోనే కలిసిపోయాడు.

పౌండ్రక వాసుదేవుని వృత్తాంతం నుంచి మనం ఒక్కటి తెలుసుకోవాలి. మనం ఎప్పుడూ భగవంతుని పేరుతోటి, ఆయన లీలల తోటి భగవంతుని అనుకరించే ప్రయత్నములు చేయకూడదు. అటువంటివి ధూర్త చేష్టితములు అయిపోతాయి. అక్కడ యుద్ధం జరిగినప్పుడు కాశీరాజు తల కూడా తెగి పడిపోయింది. కానీ కాశీరాజు తేజస్సు కృష్ణ పరమాత్మలో చేరలేదు.

కాశీరాజు కొడుకు కృష్ణుడి మీద అభిచారిక హోమం చేశాడు. కృష్ణుడు దానిని చక్రంతో తోసి అవతలకి పారవేశాడు. ఇది అనవసర విషయముల జోలికి వెళ్ళి మద్దతులు ప్రకటించడం, తిరగడం మొదలైన ఇబ్బందులు తీసుకువస్తాయని, భగవంతుని సాత్వికమైన మూర్తులను ఆరాధన చేసి మనస్సును సత్వగుణంతో ఉంచుకుని భగవంతుని చేరే ప్రయత్నం చేయాలే తప్ప, లేనిపోని భేషజములు అంత మంచివి కావని హెచ్చరిక చేసే అద్భుతమైన లీల.

**శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః**

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**

(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు తెలియని భయం. ధనసంబంధమైన సమస్యలు, బంధుమిత్రుల అభిప్రాయభేదములు, స్థాన చలనము. మాట పట్టింపు వలన ఆకస్మికంగా తగాదాలు, తొందర పనికిరాదు. చాలా జాగ్రత్తగా ఉండవలసిన రోజులు. అధిక ఖర్చులు. శాంతి పూజలు చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో ఆటంకములు ఉన్నవి. విఘ్నేశ్వర పూజలు, లక్ష్మీగణపతి హోమం, కమల పుష్పాలు, తేనె, ఆవు నెయ్యితో చేసిన ఫలితములు అధికముగా ఉండగలవు. ఎన్ని సమస్యలు వచ్చిననూ చివరికి అనుకూలంగా ఉంటుంది.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు నూతన ఆదాయ వనరులు సమకూరుట వలన మీలో కొంత ఒరిజినల్‌గా మార్పు వస్తుంది. కొన్ని విధములుగా పాత బాకీలు తీర్చుకొనుటకు సరైన సమయం అనుకూలంగా ఉన్నది. లోతుగా ఆలోచన చేయండి. అసలైన సంతృప్తి ఉంటుంది. గతం వేరు ఇప్పుడు వేరు. గం గం గణపతయే నమః నామ జపం ఈ మాసమంతా చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆర్థికంగా బాగుంటుంది. ఆకస్మిక ధన ఆదాయము విషయములో కొన్ని జాగ్రత్తలు. ఉద్రేకం లేకుండా ఆలోచన చేసిన నిర్ణయములు తీసుకొనగలరు. స్త్రీల విషయంలో వంద శాతం జాగ్రత్తగా ఉండాలి. రాజీ పడరాదు. లక్ష్మీగణపతి హోం చేయండి.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలమైన రోజులు. ఆవరణ అలంకరణతోపాటు ఆభరణములు అమర్చుకొనగలరు. కొంత అత్యాశ వలన అప్పులు చేయవలసి వస్తుంది. తొందరపాటు వలన సమస్యలు తలెత్తగలవు. రాహుకేతువులకు పాలాభిషేకం, శనికి తైలాభిషేకం అవసరం ఉన్నది.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు శరీర అలసట, దూర ప్రయాణములలో అనుకూలత. ప్రతి విషయంలో తొందరపాటు లేకుండా సౌమ్యముగా ముందుకు సాగండి. ఆదాయ వనరులు సమకూరును. తక్కువగా మాట్లాడి ఎక్కువ పనులు చేసుకొనండి. గం గణపతయే నమః జపం చేయండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సంఘంలో గౌరవ మర్యాదలు శత్రుశేషం ఉన్నది. మిమ్ములను చూసి ఓర్చుకొనలేకపోవుటయే ప్రధాన కారణం. అందుచేత కొంత ఓర్పుగా ఉండటం వలన శత్రు బాధలు తగ్గును. అనారోగ్య సూచనలు ఉన్నవి. ఉద్రేకమునకు అవకాశమివ్వరాదు. విఘ్నేశ్వర పూజలు చేయండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని మెలకువలు పాటించిన ధనాదాయం బాగుంటుంది. కార్యసాధన వలన కార్యం అనుకూలించును. ప్రతి విషయంలో ఆచితూచి నడుచుకొనిన ప్రతి విషయంలో ధనాదాయం ఉంటుంది. భయపడనవసరం లేదు. లక్ష్మీగణపతి హోమం కమల పుష్పాలతో చేయండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో వెసులుబాటు కలిగి ఉంటారు. మీరు తొందరగా ఏది నమ్మరు. పాజిటివ్‌గా ఆలోచన చేయండి. అనారోగ్య సమస్యలు సమసిపోతుంది. ఇష్టదైవారాధన అఖండ దీపారాధన విఘ్నేశ్వర పూజలు సంతృప్తిని ఇవ్వగలరు.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఆకస్మిక ధనలాభము కలిగి ఉన్నారు. విధి నిర్వహణలో చాలా జాగ్రత్తగా యాక్టివ్‌గా ఉండాలి. బద్ధకమును వదలండి. మీకు చాలా సంతృప్తి ఆదాయం ఉన్నది. ఆకస్మిక తగాదాలు రాకుండా చూసుకొనగలరు. విఘ్నేశ్వర పూజలు చేయండి.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా కనిపిస్తుంది. కాని చాలా ఒడిదుడుకులు ఉన్నవి. అప్పులు చేయవలసి వస్తుంది. స్నేహితుల విషయంలో ఎవరితోనైనా తక్కువ మాట్లాడి చాలా జాగ్రత్తగా ఉండవలసిన రోజులు. ధనము ఆవిరి అవుతుంది. నిర్లక్ష్యం పనికిరాదు. విఘ్నేశ్వర పూజలు చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలత కనిపిస్తుంది. నూతన ప్రయత్నం కనిపించును తొందరపడి ఏవిధమైన నిర్ణయములు చేయరాదు. కొన్ని రకములుగా ఆలోచన చేసిన ఒడిదుడుకులు ఎక్కువగా ఉన్నవి. మీరు అన్ని ప్రయత్నములు వాయిదా వేయండి. లక్ష్మీగణపతి హోమం చేయండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా.పి. లలితవాణి

శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సిగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. సుడిగాలి రూపంలో వచ్చి శ్రీకృష్ణుని ఎత్తుకు పోయిందెవరు?
2. "వేంకటాద్రి క్షేత్ర మాహాత్మ్యం" వ్రాసిందెవరు?
3. శివానందాశ్రమం ఎక్కడుంది?
4. శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఒంటి వేలుపై ఎన్ని రోజులు నిలిపి ఉంచాడు?
5. చిత్తోడ్ రాణి ఎవరికి రాఖీని పంపింది?
6. శివుని ఢమరుకం లోని 24 ధ్వనులు ఏవి?
7. జంబుమాలి ఎవరు?
8. ఆంజనేయుడు ఏ అస్త్రానికి కట్టుబడ్డాడు?
9. శ్రీకృష్ణునికి మహాభక్తులైన దంపతులు ఎవరు?
10. కుమారధార తీర్థానికి ఏది పర్వదినం?
11. బలరాముడు అవతారాన్ని ఎలా చాలించాడు?
12. శ్రీరామానుజుల వారు ఎవరి శిష్యుడు?
13. శ్రీవారికి స్వర్ణ కమలాలు చేయించిందెవరు?
14. గణపతి జన్మ నక్షత్రమేది?
15. కంటి సంబంధ వ్యాధులు రాకుండా కాపాడే పత్రమేది?

1. ......................................................
2. ......................................................
3. ......................................................
4. ......................................................
5. ......................................................
6. ......................................................
7. ......................................................
8. ......................................................
9. ......................................................
10. ......................................................
11. ......................................................
12. ......................................................
13. ......................................................
14. ......................................................
15. ......................................................

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. శుక్ల వర్ణం, 2. దేవికా నది, 3. శకుంతలాదేవి, 4. 5 లక్షలు, 5. కుక్కుట మునిని, 6. తొలి ఏకాదశి, శయన ఏకాదశి, 7. వేదధర్ముడు, 8. 4. జ్యోతి పీఠం, శారదా పీఠం, గోవర్ధన పీఠం, శృంగేరీ పీఠం, 9. 5 సంవత్సరాలు, 10. గీత గోవిందం, 11. గోవింద శాస్త్రి, 12. అగస్త్య మహర్షి, 13. సాంబుడు, 14. శ్రావణ శుక్ల పంచమి నాడు, 15.యమధర్మరాజు

## సరైన సమాధానాలు రాసినవారు

1. బులుసు బాబురావు, 2. చిల్లర సీతారామారావు, 3. చింతలపాటి శివశంకరశాస్త్రి, 4. సూరి సౌభాగ్యలక్ష్మి, 5. పి. యశోద

పేరు: ____________________

చిరునామా: ____________________

____________________

____________________

____________________

పిన్‌కోడ్: ____________________

ఫోన్: ____________________

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

సూరి సౌభాగ్యలక్ష్మి

## 23వ పర్యాయంగా
## 7 కోట్ల జప సమర్పణ దృశ్యమాలికలు

















RNI No.: APTEL/2008/23122 | Postal Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



# 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ దృశ్యమాలికలు













**If Un Delivered Please Return to:**

**SRI VENKATESHAM,**

**(Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGIh6kVYyLq